

'మట్టిని నమ్ముకున్న వ్యక్తి
రాబోయే రోజుల్లో ధనవంతుడు కావాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 4

సోమవారం 27-3-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మళ్లీ పేట్రేగిపోయిన ఖలిస్తానీ మూకలు

వాషింగ్టన్‌లోని భారత దౌత్య కార్యాలయంపై ఖలిస్తానీ మద్దతుదారులు దాడికి పాల్పడేందుకు చేసిన యత్నాన్ని సీక్రెట్ సర్వీస్ పోలీసులు విఫలం చేశారు.

- వివరాలు 6లో



మోదీ పిరికిపంద: ప్రియాంకా గాంధీ

'అధికారం వెనుక దాక్కుంటున్న మోదీ ఒక పిరికిపంద.. బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం నేర్పించడం తథ్యం' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వ్యాఖ్యానించారు.

- వివరాలు 6లో



రెండోసారి విశ్వ విజేతగా భారత స్టార్ బాక్సర్

ఫైనల్లో ఆసియా చాంపియన్‌పై ఏకపక్ష విజయం

టోర్నీ 'బెస్ట్ బాక్సర్'గా అవార్డు కైవసం

లక్ష డాలర్ల ప్రైజ్‌మనీ సొంతం

నిఖత్ తడాఖా...

సొంతగడ్డపై భారత్ పంచ్ అదిరింది. అంచనాలకు అనుగుణంగా రాణిస్తూ భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ (50 కేజీలు) వరుసగా రెండో ఏడాది విశ్వవిజేతగా నిలువగా... టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు) తొలిసారి ప్రపంచ చాంపియన్‌గా అవతరించింది. న్యూఢిల్లీలో ఆదివారం ముగిసిన ప్రపంచ సీనియర్ మహిళల చాంపియన్‌షిప్‌ను భారత్ నాలుగు స్వర్ణ పతకాలతో ముగించింది. శనివారం నీతూ (48 కేజీలు), స్వీటీ (81 కేజీలు) పసిడి పతకాలు నెగ్గగా... ఆదివారం తెలంగాణ అమ్మాయి నిఖత్, అస్సాం క్రీడాకారిణి లవ్లీనా కూడా బంగారు పతకాలు గెలిచి 'గోల్డెన్ ఫినిషింగ్' ఇచ్చారు. తాజా ప్రదర్శనతో నిఖత్... దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కనీసం రెండు స్వర్ణ పతకాలు గెలిచిన రెండో భారతీయ బాక్సర్‌గా గుర్తింపు పొందింది. స్వర్ణ పతకం సాధించిన నిఖత్ జరీన్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు.



లవ్లీనా బొర్గొహైన్

- వివరాలు 12లో

జాతివాదం, మతవాదం కాదు...

రైతువాదం కావాలి



కాంధార్ లోహ బహిరంగ సభలో ప్రసంగిస్తున్న కేసీఆర్

కులం, మతం పేరిట పాలింపబడితే మన పరిస్థితి ఇలాగే ఉంటుంది: సీఎం కేసీఆర్

దేశంలో ఎన్నో వనరులున్నా ఉపయోగించుకోలేని దుస్థితి

వాటి సద్వినియోగానికి ప్రధాని ప్రతిబంధకంగా మారారు

రైతు సర్కారు వస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం

నేను భారత పౌరుడిని.. అన్ని రాష్ట్రాల్లో నాకు పని ఉంది

తెలంగాణ మోడల్ అమలయ్యేంత వరకు ఉద్యమిస్తా

దేశంలో ప్రతి ఎకరానికి సాగునీరు అందాలి

మహారాష్ట్రలో త్వరలో విప్లవం వస్తుంది

అక్కడి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటుతాం

తనతో కలసి ఉద్యమించేందుకు ముందుకు రావాలని పిలుపు

మహారాష్ట్రలోని కాంధార్ లోహలో బీఆర్‌ఎస్ బహిరంగ సభ

> మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో, అన్ని జిల్లా పరిషత్‌లలో బీఆర్‌ఎస్ పోటీచేసి గులాబీ జెండాను ఎగురవేస్తుంది. గ్రామాల్లో మీ బలాన్ని చూపితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగెత్తుకుంటూ వస్తాయి. ఇంతకుముందు తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలని 80 గ్రామాల సర్పంచులు తీర్మానం చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం భయపడిపోయింది. ఎంతో సంపద ఉన్న మహారాష్ట్రను పది పదిహే నేళ్లలో శక్తివంతమైన రాష్ట్రంగా మార్చవచ్చు.
>
> - బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: దేశంలో జాతివాదం, మతవాదాన్ని విడిచిపెట్టి.. రైతువాదాన్ని చేపట్టాలని.. అప్పుడే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఇన్నాళ్లుగా దేశంలో ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రజలకు, రైతులకు న్యాయం జరగలేదని.. రైతు సర్కారు వచ్చినప్పుడే మన సమస్యలు తీరుతాయని చెప్పారు. మహారాష్ట్రలో తన సభకు జనం రాకుండా కొందరు ప్రయత్నాలు చేశారని, రైతులు తుపాన్‌లా విజృంభించినప్పుడు అలాంటి కుట్రలు పనిచేయవని స్పష్టం చేశారు. తనతో కలసి ఉద్యమించేందుకు రావాలని, ప్రతి ఎకరానికి సాగునీరు అందించే బాధ్యత తనదని చెప్పారు. ఆదివారం మహారాష్ట్రలోని కాంధార్ లోహలో 'అబ్‌కీ బార్.. కిసాన్ సర్కార్' నినాదంతో బీఆర్‌ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''మీరు తెలంగాణలో పనిచేయండి, ఇక్కడేం పని అని నన్ను అడుగుతున్నారు. నేను భారత పౌరుడిని. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో

మిగతా 2వ పేజీలో ▶

కథ.. స్క్రీన్‌ప్లే.. దర్శకత్వం.. చంద్రబాబు నాయుడు

ఓటుకు కోట్లు 2.0

పోలింగ్ రోజు అసెంబ్లీ లాబీ వేదికగా కొనసాగిన ప్రలోభాల పర్వం

- ఎమ్మెల్యే రాపాకకు రూ.10కోట్లు ఆఫర్ ఇచ్చిన టీడీపీ ఎమ్మెల్యే మంతెన రామరాజు
- అంతకుముందు కేఎస్ఎన్ రాజు ద్వారా కూడా రాపాకతో సంప్రదింపులు
- లాబీల్లో రాపాకను కలసి మాట్లాడిన విషయం నిజమేనని ఒప్పుకున్న రామరాజు
- ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ ప్రలోభాల పర్వం బట్టబయలు

10 లో



ఎమ్మెల్సీ ఎన్నికల్లో బేరసారాలు నిజమే!

టీడీపీ నుంచి నాకు ఆఫర్ ఇచ్చారు: రాజోలు ఎమ్మెల్యే రాపాక

- వివరాలు 10లో

'స్విస్' ఓపెన్‌లో సాత్విక్-చిరాగ్ జోడీకి టైటిల్



12 లో

భారత బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నీలో పురుషుల డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 68 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో పురుషుల డబుల్స్ టైటిల్ నెగ్గిన తొలి భారతీయ జోడీగా సాత్విక్-చిరాగ్ గుర్తింపు పొందారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్, మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ శెట్టిలకు ఈ ఏడాది ఇదే తొలి టైటిల్ కాగా, ఓవరాల్‌గా ఐదో టైటిల్. విజేతగా నిలిచిన సాత్విక్-చిరాగ్ జోడీకి 16,590 డాలర్ల (రూ. 13 లక్షల 66 వేలు) ప్రైజ్‌మనీ, 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

లీకేజీ కేసులో మరో ఇద్దరు అరెస్ట్

వారు కూడా ఏఈ ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు తేల్చిన సిట్



- నిందితులు ప్రశాంత్‌రెడ్డి, రాజేంద్రకుమార్‌గా నిర్ధారణ
- పోలీసుల అదుపులో మరో నలుగురు అనుమానితులు
- అదనపు కస్టడీలోకి ప్రవీణ్, డాక్యా సహా నలుగురు

3 లో

ఇస్రో కీర్తి కిరీటంలో.. మరో విజయం



- దిగ్విజయంగా వన్‌వెబ్ ఇండియా-2 ఉపగ్రహాల ప్రయోగం
- విజయవంతంగా కక్ష్యలోకి 36 సమాచార ఉపగ్రహాలు

6 లో

రాహుల్ అంటే బీజేపీకి భయం..

- అందుకే కుట్ర చేసి అనర్హత వేటు వేశారు
- ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్షలో కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు
- మరో పోరాటానికి సిద్ధం కావాలి: రేవంత్
- మన సత్తా చూపించే సమయం వచ్చింది: ఠాక్రే

2 లో

సొంతగూటికి డీఎస్

- ఠాక్రే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ధర్మపురి శ్రీనివాస్
- కాంగ్రెస్‌ను వీడి తప్పు చేశానని వ్యాఖ్య

- 2లో

'బండి'కి బదులు బీజేపీ లీగల్ టీమ్

- సిట్ కార్యాలయానికి వెళ్లిన ఆ పార్టీ బృందం
- అధికారుల ఎదుట హాజరై బండి రాసిన లేఖ అందించిన వైనం

3 లో

ఇది ఆఫీస్ 2050



ఆఫీసు అంటే ఎలా ఉంటుంది?.. వరుసపెట్టి టేబుళ్లు, కుర్చీలు.. కంప్యూటర్లు.. హడావుడిగా పనిచేసుకునే ఉద్యోగులు.. మరి 2050లో ఆఫీస్ ఎలా ఉంటుంది?.. హోలోగ్రామ్ రిసెప్షనిస్ట్.. వర్చువల్/అగ్మెంటెడ్ రియాలిటీ మీటింగ్‌లు.. చెప్పిన పనిచేసే రోబోలు.. కాసేపు కునుకు తీయడానికి బెడ్లు.. కాఫీ తెచ్చి ఇచ్చే డ్రోన్లు.. ..మరో 30 ఏళ్లలో అత్యాధునిక టెక్నాలజీల సాయంతో ఆఫీసుల రూపురేఖలు, పనివాతావరణం ఎలా మారిపోతాయనే అంశంపై 'ఫర్నిచర్ ఎట్ వర్క్' సంస్థ అధ్యయనం చేసి ఈ వివరాలను తెలిపింది. ఉద్యోగుల నుంచి మరింత 'పని'ని రాబట్టుకోవడంతోపాటు వారికి ఆరోగ్యం, ఆహ్లాదం అందించేలా ఆఫీసులు రూపొందుతాయని పేర్కొంది. - సాక్షి, సెంట్రల్‌డెస్క్

1. అవసరానికి తగినట్టు సులువుగా మార్చుకో గలిగేలా.. కదిలే గోడలు, ఆధునిక ఫర్నిచర్ వస్తాయి.
2. అవసరానికి తగ్గట్టు లైటింగ్, గాలి నాణ్యతను చెక్ చేస్తూ శుభ్రపర్చడం, ఉష్ణోగ్రతను చెక్ చేస్తూ సమానంగా ఉంచడం వంటివి ఆటోమేటిగ్గా జరిగేలా సెన్సర్లతో ఆఫీసు భవనాలు 'స్మార్ట్'గా మారుతాయి.
3. పనితీరు మెరుగుపడేలా ఎప్పటికప్పుడు వర్చువల్ రియాలిటీతో కూడిన శిక్షణ.
4. ఆఫీసుకు వచ్చే సందర్శకులకు సమాచారం ఇవ్వగల హోలోగ్రామ్ రిసెప్షనిస్ట్
5. వేలిముద్రల (బయోమెట్రిక్)తో తెరుచుకునే ఫ్రిడ్జ్‌లు
6. ఉద్యోగులు లేచి వెళ్లాల్సిన పనిలేకుండా కాఫీ, టీలు తెచ్చే డ్రోన్లు
7. ఆఫీసులో గాలి కాలుష్యాన్ని తొలగించేలా గోడలకు నానో పెయింట్లు
8. పని అలసట నుంచి చిన్న కునుకుతో సేద తీరేందుకు న్యాపింగ్ బెడ్స్
9. ఒత్తిడిని తగ్గించుకునేందుకు వర్చువల్/అగుమెంటెడ్ రియాలిటీతో కూడిన మెడిటేషన్ గది
10. చిన్నపిల్లలున్న ఉద్యోగుల కోసం బేబీ సిట్టర్, ప్రత్యేక రూమ్
11. ఒకరినొకరు సంప్రదించుకుంటూ పనిచేయాల్సిన ఉద్యోగుల కోసం ఓపెన్ ఆఫీస్
12. ఆఫీసులోకి వచ్చే ప్రతి ఒక్కరిని గుర్తించే ఫేస్ స్కానింగ్ వ్యవస్థ
13. అవసరమైన సమాచారాన్ని చూసేందుకు, సమావేశాల కోసం వర్చువల్/అగుమెంటెడ్ రియాలిటీ కళ్లద్దాలు
14. ఆహ్లాదకరమైన, కాలుష్య రహిత వాతావరణం కోసం మాడ్యులర్ గ్రీన్ వాల్స్
15. పర్యావరణ హితమైన బయోఫిలిక్ ఫర్నిచర్
16. ఎక్కువ ఏకాగ్రతతో పనిచేయాల్సిన ఉద్యోగుల కోసం 'యాంటీ డిస్ట్రాక్షన్ టెక్నాలజీ' క్యాబిన్లు
17. క్లీనింగ్‌తో పాటు వివిధ రకాల పనుల కోసం రోబోలు
18. నేరుగా మాట్లాడుకున్న అనుభూతి వచ్చేలా హోలోగ్రామ్ ఆధారిత వర్చువల్ సమావేశాలు
19. శారీరక, మానసిక ఆరోగ్య పరిస్థితిని గమనించే రిస్ట్ బ్యాండ్లు

క్లుప్తంగా...

రాహుల్‌కు మద్దతుగా రాజీనామా చేయాలి
కాంగ్రెస్ ఎంపీలకు ఠాక్రే పిలుపు



వైరా: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారనే భయంతోనే బీజేపీ ప్రభుత్వం ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేసిందని, ఆయనకు మద్దతుగా నిలబడేలా కాంగ్రెస్ ఎంపీలందరూ రాజీనామా చేయాలని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే అన్నారు. ఖమ్మం జిల్లా వైరాలో ఆదివారం రాత్రి జరిగిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర, సభలో ఆయన మాట్లాడుతూ దేశ సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 4 వేల కి.మీ. మేర పాదయాత్ర చేయగా జనం నీరాజనాలు పట్టారని గుర్తు చేశారు. బ్యాంకుల నుంచి రూ.లక్షల కోట్లు లూటీ చేసిన అదానీ వంటి కార్పొరేట్ శక్తులు బీజేపీ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నాయని మండిపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఇతర రాష్ట్రాల సీఎంలు రాహుల్‌గాంధీకి అండగా ప్రకటనలు చేసిన నేపథ్యంలో బీజేపీయేతర పార్టీలన్నీ ఏకం కావాలని కోరారు. ఇక ప్రజలు కూడా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు రాహుల్‌గాంధీకి మద్దతు తెలపడమే కాక హిందూ–ముస్లింల మధ్య చిచ్చుపెడుతున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని మాణిక్‌రావ్ పిలుపునిచ్చారు.

నేడు జిల్లా కేంద్రాల్లో దీక్ష

సాక్షి, హైదరాబాద్: రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో సత్యాగ్రహ దీక్షలు చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. అంబేడ్కర్ లేదా గాంధీ విగ్రహాల వద్ద శాంతియుతంగా నిరసన తెలియజేయాలని, అలాగే మంగళవారం కూడా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని టీపీసీసీ ఉపాధ్యక్షులు మల్లురవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు వెల్లడించారు. రాహుల్ గాంధీ పోరాటానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ శ్రేణులు అండగా నిలవాలని వారు కోరారు.

భారత్ జోడో యాత్రతో బీజేపీ మైండ్ బ్లాక్: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: గాంధీ కుటుంబంపై ప్రధాని మోదీ ఎంత కక్ష పెంచుకున్నారో చెప్పేందుకు రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయడమే ఉదాహరణ అని సంగారెడ్డి ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. పార్లమెంటులో గాంధీ కుటుంబం ఉండొద్దనే కుట్రతోనే కోర్టు తీర్పును అడ్డుపెట్టుకుని రాహుల్ గాంధీపై నిర్ణయం తీసుకున్నారని ఆదివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఆరోపించారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఎంతోమందికి పదవులిచ్చిన కుటుంబానికి ఇప్పుడు ఎంపీ పదవి ఓ సమస్య కాదన్న విషయాన్ని బీజేపీ గుర్తుంచుకోవాలని జగ్గారెడ్డి హితవు పలికారు. ప్రధాని అయ్యే అవకాశాన్ని కూడా కాదనుకున్న కుటుంబం నుంచి వచ్చిన ఆయన కుటుంబానికి ఎంత విలువ ఉంటుందో ఇప్పుడు బీజేపీకి అర్థం అవుతుందని చెప్పారు. భారత్ జోడో యాత్ర పేరుతో రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా పాదయాత్ర చేయడంతోనే బీజేపీ మైండ్ బ్లాక్ అయిందని, అదానీపై రాహుల్ గట్టిగా నిలబడటంతో బీజేపీ పెద్దలు తమ క్రిమినల్ మైండ్ ఉపయోగించారని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ ఒంటరి కాదని, దేశ ప్రజలు ఆయనకు అండగా ఉంటారన్నారు.

ఆదివారం మహారాష్ట్రలోని కాంధార్–లోహాలో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్



జాతివాదం, మతవాదం కాదు
రైతువాదం కావాలి

▶ మొదటి పేజీ తరువాయి

నాకు పని ఉంది. గతంలో నాందేడ్ పర్యటనకు వచ్చినప్పుడు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇక్కడ మీకేం పని అని ప్రశ్నించారు. రైతులకు ప్రతీ ఎకరానికి రూ.10 వేలు పెట్టుబడి సాయం, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్, ఉచిత సాగునీరు, ప్రతీ ధాన్యం గింజ కొనుగోలు వంటివి అమలు చేసేంత వరకు మహారాష్ట్రలో రైతులతో కలిసి నా పోరాటం కొనసాగుతుంది. తెలంగాణ తరహాలో ప్రతీ దళిత కుటుంబానికి రూ.10లక్షల సాయం అందజేసే దళితబంధు పథకం అంబేద్కర్ పుట్టిన మహారాష్ట్ర గడ్డపై అమలయ్యేంత వరకు వస్తూనే ఉంటా. నాందేడ్ ప్రజల ప్రేమ నన్ను ప్రతీసారి ఇక్కడికి వచ్చేలా చేస్తోంది. చంద్రాపూర్, షోలాపూర్, పశ్చిమ మహారాష్ట్రతో పాటు మరెన్నో చోట్లకు రావాలంటూ నాకు వినతులు అందుతున్నాయి. ఇక్కడ నా సభకు ప్రజలు రాకుండా చేసేందుకు మేకలను కోస్తూ దావత్‌లు ఇస్తున్నారు. రైతులు తుఫాన్‌లా విజృంభించినప్పుడు ఇలాంటి కుట్రలు పనిచేయవు. నా అంచనా ప్రకారం మహారాష్ట్రలో త్వరలో విప్లవం వస్తుంది.

ప్రతీ ఎకరానికి సాగు నీరు అందిస్తా..

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా.. పార్టీలు, పాలకులు మారుతున్నా.. ప్రజల స్థితిగతుల్లో మార్పులు రావడం లేదు. స్వాతంత్య్రం తర్వాత మొరార్జీ, వీపీ సింగ్, చరణ్‌సింగ్, దేవేగౌడ వంటి కొందరు తప్పించి మిగతా 70 ఏళ్లలో.. 54ఏళ్లు కాంగ్రెస్, 16 ఏళ్ల పాటు బీజేపీ పాలన సాగినా ప్రజల పరిస్థితిలో తేడా లేదు. దేశంలో సమృద్ధిగా సాగుయోగ్య భూమి, నీటి వనరులున్నా వ్యవసాయ రంగం దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. నదుల్లో వేలాది టీఎంసీల నీరు ప్రవహిస్తున్నా.. మహారాష్ట్ర సహా ఎన్నో ప్రాంతాల్లో తాగు, సాగునీరు లభించడం లేదు. వనరులను సద్వినియోగం చేయడంలో ఇక్కడి ముఖ్యమంత్రి, దేశ ప్రధాని ప్రతిబంధకంగా మారారనే విషయాన్ని గుర్తించండి. నాతో కలిసి ఉద్యమించండి. ప్రతీ ఎకరానికి నీరు అందించే బాధ్యత నాది. నా మాటలను ఇక్కడే వదిలి వెళ్లకుండా మీ గ్రామాల్లో, మీ కుటుంబాల్లో చర్చించండి.

గులాబీ జెండా బలం తెలుసుకోండి

రైతాంగ సమస్యలపై రైతులు 75 ఏళ్లుగా పోరాడుతున్నారు. నేటికీ మద్దతు ధర కోసం రోడ్డెక్కుతున్నారు. మరి వారు ఎన్నుకున్న ఎమ్మెల్యేలు ఎక్కడ పడుకున్నారు. రైతులు 13 నెలల పాటు ధర్నా చేసి 750 మంది ప్రాణాలు కోల్పోతే ఒక్కమాట మాట్లాడని ప్రధాన మంత్రి.. యూపీ, పంజాబ్ ఎన్నికలు రావడంతో తీయటి మాటలతో క్షమాపణ చెప్పాడు. మనం ఏకమై లక్ష్యం కోసం ఉద్యమించి బలాన్ని చూపినప్పుడు ఇలా నిప్పు మీద నీళ్లు చల్లినట్టుగా డ్రామాలు ఆడుతుంటారు. దేశంలో కులం, మతం పేరు మీద విభజింపబడి ఎంతకాలం పాలింపబడతామో అప్పటిదాకా మనం ఇలాగే మధనపడాల్సి వస్తుంది. రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వస్తుంది. రైతులు ఎవరికో ఒకరికి వేటు వేస్తారు కదా అనే ధీమాతో దేశంలోని రాజకీయ పార్టీలున్నాయి. రైతుల ఐకమత్యమే వారి దుస్థితికి విరుగుడు. గులాబీ జెండా బలం తెలుసుకుని మనమే స్వయంగా ఎమ్మెల్యేలు, ఎంపీలమవుదాం. ఎంతవరకు మనం ఏకమవుతామనే విషయంపైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో, అన్ని జిల్లా పరిషత్‌లలో బీఆర్‌ఎస్ పోటీచేసి గులాబీ జెండాను ఎగురవేస్తుంది. గ్రామాల్లో మీ బలాన్ని చూపితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగెత్తుకుంటూ వస్తాయి. ఇంతకుముందు తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలని 80 గ్రామాల సర్పంచులు తీర్మానం చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం భయపడిపోయింది. తొమ్మిదేళ్ల క్రితం దారుణ స్థితిలో ఉన్న తెలంగాణ ఇప్పుడు గొప్ప ప్రగతితో ఆదర్శంగా నిలుస్తోంది. అలాంటిది ఎంతో సంపద ఉన్న మహారాష్ట్రను పది పదిహేనేండ్లలో శక్తివంతమైన రాష్ట్రంగా మార్చవచ్చు. జై తెలంగాణ.. జై మహారాష్ట్ర.. జై భారత్' అంటూ కేసీఆర్ ప్రసంగాన్ని ముగించారు. సభలో ఎంపీలు బీబీ పాటిల్, సంతోష్‌కుమార్, దామోదర్‌రావు, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యేలు ఎ.జీవన్‌రెడ్డి, బాల్క సుమన్, షకీల్ అహ్మద్, బీఆర్‌ఎస్ కిసాన్‌సెల్ అధ్యక్షుడు గుర్నామ్ సింగ్, బీఆర్‌ఎస్ జనరల్ సెక్రటరీ హిమాంశు తివారీ తదితరులు పాల్గొన్నారు.

కాంధార్, లోహ పట్టణాలు గులాబీమయం

బీఆర్‌ఎస్ బహిరంగ సభ నేపథ్యంలో కాంధార్, లోహ పట్టణాలు గులాబీమయంగా మారాయి. ప్రధాన రహదారుల వెంట బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలు, జెండాలు, తోరణాలు కట్టారు. ఈ సభలో పాల్గొనేందుకు కేసీఆర్ ఆదివారం మధ్యాహ్నం బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో నాందేడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో కాంధార్ లోహకు వెళ్లారు. తొలుత కాంధార్ మాజీ ఎమ్మెల్యే శంకరన్న ధోంగ్డే నివాసానికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించారు. తర్వాత ప్రత్యేక బస్సులో ర్యాలీగా లోహలోని బైల్‌బజార్ మైదానం బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకున్నారు. వేదికపై ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ, బసవేశ్వరుడు, బీఆర్ అంబేడ్కర్, అన్నా బాహుసాతే, మహాత్మా పూలే, అహిల్యాబాయి హోల్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సాయంత్రం 4.20కు బహిరంగ సభ ముగిశాక హైదరాబాద్‌కు తిరుగుపయనమైన కేసీఆర్ 5.45 గంటలకు ప్రగతిభవన్‌కు చేరుకున్నారు.

బీఆర్‌ఎస్‌లో నేతల చేరిక

సీఎం కేసీఆర్ పర్యటన సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన మహారాష్ట్ర నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే, ఎన్సీపీ కిసాన్ సెల్ మాజీ అధ్యక్షుడు శంకరన్న ధోంగ్డే, మాజీ ఎంపీ హరిభావ్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు హర్షవర్ధన్ జాదవ్, డాక్టర్ వసంతరావు బోండే తోపాటు నాగ్‌నాథ్ ఘిసేవాడ్, సురేష్ గైక్వాడ్, యశ్‌పాల్ భింగే, జకీర్ చావ్స్, ప్రహ్లాద్ రొఖండో తదితరులు ఈ జాబితాలో ఉన్నారు.

రాజ్‌భవన్‌లో బిల్లుల పెండింగ్‌పై
నేడు సుప్రీంలో విచారణ

- కౌంటర్ దాఖలు చేయనున్న కేంద్ర ప్రభుత్వం
- ఇప్పటికే న్యాయ నిపుణులతో చర్చించిన గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్ మధ్య విభేదాల నేపథ్యంలో రాజ్‌భవన్‌లో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న పలు బిల్లుల వ్యవహారంపై సోమవారం సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరగనుంది. గవర్నర్ తమిళిసై బిల్లులను ఆమోదించకపోవడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయగా ఈ నెల 20న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్... కౌంటర్ దాఖలు చేయాలని కేంద్రానికి నోటీసులు పంపడం తెలిసిందే. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండటంతో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు నోటీసులు జారీ చేయలేమని వ్యాఖ్యానించిన ధర్మాసనం... కేసు తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో ఈ కేసు విషయమై అనుసరించాల్సిన వ్యూహంపై గవర్నర్ తమిళిసై ఢిల్లీలోని న్యాయ నిపుణులతో చర్చించినట్లు రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. సోమవారం జరిగే విచారణ సందర్భంగా ఈ వ్యవహారంలో కేంద్రం అభిప్రాయంతోపాటు రాజ్‌భవన్ వైఖరి సైతం వెల్లడి కానుంది. ఈ వ్యవహారంలో సుప్రీం ధర్మాసనం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశాభావంతో ఉంది.

194 రోజులుగా పెండింగ్‌లో 7 బిల్లులు..

గతేడాది సెప్టెంబర్ 13న శాసనసభ, శాసన మండలి ఆమోదించిన మొత్తం 8 బిల్లులను ప్రభుత్వం గవర్నర్ ఆమోదం కోసం రాజ్‌భవన్‌కు పంపించింది. అందులో జీఎస్టీ చట్ట సవరణ బిల్లుకు మాత్రమే గవర్నర్ ఆమోదం తెలిపారు. మిగతా ఏడు బిల్లులు 194 రోజులుగా రాజ్‌భవన్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ప్రైవేటు వర్సిటీల బిల్లు ముఖ్యమైనది. ఈ బిల్లుపై గవర్నర్ పలు అనుమానాలు వ్యక్తం చేయడంతో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గతేడాది నవంబర్ 8న రాజ్‌భవన్‌కు వెళ్లి అనుమానాలను నివృత్తి చేశారు. అయినా బిల్లు పెండింగ్‌లోనే ఉండిపోయింది. మరోవైపు వర్సిటీల్లో బోధన, బోధనేతర విభాగాల కొలువుల భర్తీ జరగక ఉన్నత విద్య కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ములుగు అటవీ కళాశాల పేరును తెలంగాణ అటవీ యూనివర్సిటీగా మార్చు ప్రతిపాదన బిల్లు, ప్రైవేటు వర్సిటీల చట్టం బిల్లు, పురపాలికల చట్ట సవరణ బిల్లు, ఆజామాబాద్ పారిశ్రామిక ప్రాంత చట్ట సవరణ బిల్లు, పబ్లిక్ ఎంప్లాయిమెంట్ చట్ట సవరణ బిల్లు, మోటార్ వెహికల్స్ ట్యాక్సేషన్ చట్ట సవరణ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మరోవైపు ఈ ఏడాది ఫిబ్రవరి 12న శాసనసభ, మండలి ఆమోదించిన ప్రొ.జయశంకర్ వ్యవసాయ వర్సిటీ చట్ట సవరణ బిల్లు, తెలంగాణ పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు, తెలంగాణ మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.

మిర్యాలగూడలో సీపీఎం పోటీ ఖాయం: తమ్మినేని

మిర్యాలగూడ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మిర్యాలగూడ నుంచి తమ పార్టీ తప్పకుండా పోటీ చేస్తుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన జన చైతన్య యాత్ర ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చేరుకుంది. యాత్రకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. వందలాది వాహనాలతో ఆలగడప, అవంతీపురం, రాంనగర్‌బంధం, ఈదులగూడెం, హౌసింగ్‌బోర్డు, రాజీవ్‌చౌక్ మీదుగా మున్సిపల్ కాంప్లెక్స్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. అక్కడ జరిగిన సభలో తమ్మినేని మాట్లాడారు. బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీకి తాము మద్దతు ఇస్తున్నామని చెప్పారు. సభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్, పోతినేని సుదర్శన్, మల్లు లక్ష్మి, జూలకంటి రంగారెడ్డి పాల్గొన్నారు.

రాహుల్ అంటేనే బీజేపీకి భయం

- అందుకే కుట్ర చేసి అనర్హత వేటు వేశారు
- ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్షలో కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు



'ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష'లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొన్నం, అంజన్‌కుమార్, వీహెచ్, కోమటిరెడ్డి, మాణిక్‌రావ్ ఠాక్రే, ఉత్తమ్, సంపత్, చిన్నారెడ్డి, చెరుకు సుధాకర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అంటే బీజేపీకి భయమని, అందుకే కుట్రతో ఆయనపై అనర్హత వేటు వేశారని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తారు. పదవులను త్యజించే కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ విషయంలో అప్రజాస్వామికంగా వ్యవహరించిన బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని, రాహుల్ గాంధీకి అండగా నిలబడాలని వారు పిలుపునిచ్చారు. రాహుల్ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేస్తూ పార్లమెంట్ సెక్రటేరియట్ తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ ఆదివారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష'నిర్వహించారు. దీక్షలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎంపీలు ఉత్తమ్, కోమటిరెడ్డిలతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి తారిఖ్ అన్వర్, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, సీతక్క, ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్ జావేద్, రోహిత్‌చౌదరి, సీనియర్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, వి.హనుమంతరావు, జానారెడ్డి, షబ్బీర్‌అలీ, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు సంతప్, చిన్నారెడ్డి, మాజీ ఎంపీలు పొన్నం ప్రభాకర్, మల్లురవి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్, ఇతర నేతలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్, వేం నరేందర్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీక్షలో కాంగ్రెస్ నేతలు ఏమన్నారంటే..

కాంగ్రెస్ కుటుంబం అండగా ఉంటుంది: ఠాక్రే

జోడో యాత్రతో రాహుల్ అంటే ఏంటో దేశానికి అర్థం అయింది. బీజేపీకి భయం మొదలయింది. అందుకే ఆయనపై కుట్ర చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ కుటుంబం ఆయనకు అండగా ఉంటుంది. మన సత్తా ఏంటో చూపించే సమయం ఆసన్నమయింది.

అప్పటి నుంచే కుట్ర: ఎంపీ కోమటిరెడ్డి

అదానీ వ్యవహారం గురించి పార్లమెంటులో మాట్లాడినప్పటి నుంచే రాహుల్‌పై కుట్ర చేశారు. పరువు నష్టం కేసులో శిక్ష పడేట్టు చేసి ఆగమేఘాల మీద అనర్హత వేటు వేశారు. అవసరమైతే కాంగ్రెస్ ఎంపీలమంతా రాజీనామా చేస్తాం. అనర్హత వేటు ఎత్తివేసేంతవరకు కాంగ్రెస్ శ్రేణులు పోరాడుతాయి.

అణచివేత చర్య: జానారెడ్డి

రాహుల్‌పై అనర్హత వేటు వేయడం అప్రజాస్వామిక చర్య. ఆయనను అణచివేయాలన్న కుట్రతోనే ఈ చర్యకు పాల్పడ్డారు. బీజేపీ కేవలం అధికారం కోసమే బీజేపీ పనిచేస్తుంది. కాంగ్రెస్ పార్టీ అందరి అభివృద్ధి కోసం పనిచేస్తుంది.

కోలార్‌లో మాట్లాడితే గుజరాత్‌లో కేసు: ఉత్తమ్

దేశసంపదను అదానీకి ధారాదత్తం చేస్తున్న ప్రధాని మోదీ తీరును ఆధారాలతో సహా రాహుల్ బయటపెట్టారు. అందుకే ఆయనను అప్రజాస్వామికంగా బయటకు పంపే ప్రయత్నం చేశారు. కోలార్‌లో రాహుల్ మాట్లాడితే గుజరాత్‌లో కేసు వేశారు.

బీజేపీ అంటే బ్రిటిష్ జనతా పార్టీ: రేవంత్

బీజేపీ అంటే బ్రిటిష్ జనతా పార్టీ అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వ్యాపారం ముసుగులో బ్రిటిషర్లు దేశంలో అడుగుపెట్టింది కూడా సూరత్‌లోనేనని, అదే సూరత్ నుంచే అదానీ కంపెనీలు కూడా వచ్చాయన్నారు. హిండెన్‌బర్గ్ నివేదికతో మోదీ, అదానీ బండారం బయటపడిందని చెప్పారు. మోదీ, అదానీ అక్రమాలపై చర్చించాలని పార్లమెంటులో రాహుల్ పట్టుపట్టడంతోనే ఆయనపై అనర్హత వేటు వేశారని ఆరోపించారు. తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎమ్మెల్యేలు, మంత్రులపై అనర్హత వేటు ఎందుకు వేయలేదని రేవంత్ ప్రశ్నించారు. రాహుల్‌ని పప్పు అని అవహేళన చేసిన వారే ఇప్పుడు ఆయన నిప్పు అని తెలుసుకున్నారని, ఆ నిప్పును అడ్డుతొలగించుకునేందుకే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. నాడు భగత్‌సింగ్ బ్రిటిషర్లకు లొంగిపోలేదని, అదే విధంగా రాహుల్ గాంధీ కూడా ఎవరికీ తలవంచరని అన్నారు. బీజేపీ సంకెళ్ల నుంచి దేశానికి విముక్తి సాధించడానికి మరో స్వాతంత్య్ర పోరాటం చేయాల్సిన అవసరం ఉందని రేవంత్ పిలుపునిచ్చారు.

మళ్లీ సొంతగూటికి డీఎస్

- ఠాక్రే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన ధర్మపురి శ్రీనివాస్
- కాంగ్రెస్‌ను వీడి తప్పు చేశా: డీఎస్
- డీఎస్‌ది లక్కీహ్యాండ్: రేవంత్ రెడ్డి



డీఎస్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాణిక్‌రావ్ ఠాక్రే. చిత్రంలో ఉత్తమ్, సంజయ్, వీహెచ్, రేవంత్, పొన్నాల, జానా, కోమటిరెడ్డి, షబ్బీర్ అలీ


సాక్షి, హైదరాబాద్: పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్) సొంత గూటికి చేరుకున్నారు. తన కుమారుడు సంజయ్‌తో కలిసి ఆదివారం ఉదయం గాంధీభవన్‌కు వచ్చిన డీఎస్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావ్ ఠాక్రే సమక్షంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత కె.జానారెడ్డిలు ఆయనకు పార్టీ కండువాలు కప్పారు. ఆయనతో పాటు నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, మేడ్చల్ సత్యనారాయణలు కూడా పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు పొన్నాల లక్ష్మయ్య, రేణుకా చౌదరి, అంజన్‌కుమార్ యాదవ్, షబ్బీర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది: డీఎస్

తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి రావడంపై మాజీ ఎంపీ డీఎస్ మీడియాతో మాట్లాడుతూ తనకు చాలా సంతోషంగా, ఆనందంగా ఉందన్నారు. తాను కాంగ్రెస్‌ను వీడి తప్పు చేశానని, భవిష్యత్తులో అలాంటి తప్పు చేయనని, తాను చనిపోయినపుడు తన మృతదేహంపై కాంగ్రెస్ పార్టీ జెండానే ఉంచాలని సోనియాగాంధీని కలిసినప్పుడు చెప్పానని వెల్లడించారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందా అన్న ప్రశ్నకు స్పందిస్తూ పార్టీ అధికారంలోకి వచ్చేది రానిది ప్రజల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు. రాహుల్‌గాంధీకి అండగా నిలబడతామని చెప్పారు.

డీఎస్ సారథ్యంలోనే అధికారంలోకి వచ్చాం: రేవంత్

డీఎస్ పార్టీలో చేరిన అనంతరం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠి మాట్లాడుతూ డీఎస్‌ది లక్కీ హ్యాండ్ అని వ్యాఖ్యానించారు. ఆయన పార్టీలో చేరడానికి ప్రాధాన్యత ఉందని, డీఎస్ ఎప్పుడు క్రియాశీలంగా ఉన్నా పార్టీ అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. 2004, 2009 ఎన్నికల్లో ఆయన సారథ్యంలోనే పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు రాహుల్‌గాంధీకి అండగా నిలిచేందుకు డీఎస్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారన్నారు. కాగా, సొంతగూటికి చేరుకున్న డీఎస్‌ను రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఆప్యాయంగా అక్కున చేర్చుకున్నారు. నల్లగొండ ఎంపీ ఉత్తమ్, జానారెడ్డిలు డీఎస్‌ను ఆలింగనం చేసుకుని ఆత్మీయంగా పలకరించారు. డీఎస్ గాంధీభవన్‌లో ఉన్నంతసేపూ ఆయన పార్టీ అభివృద్ధికి చేసిన కృషి గురించి నేతలకు వివరించారు. డీఎస్ ఆరోగ్యం గురించి పలువురు నేతలు వాకబు చేశారు.



చూస్తుంటే... ఈసారి మనల్ని బాగా లైట్‌గా తీసుకున్నట్లున్నారు!

క్లుప్తంగా...

లీకేజీపై సీబీఐ విచారణ జరిపించాలి: వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌కు చిత్తశుద్ధి ఉంటే టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై సీబీఐతో విచారణ చేయించాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అప్పుడే ఎవరి కథ ఏందో తెలుస్తదన్నారు. లీకేజీ వ్యవహారంపై కేటీఆర్ వైఖరిని ఆక్షేపించారు. టీఎస్‌పీఎస్సీ ప్రభుత్వ అధీనంలో లేకపోతే దాని సభ్యులను నియమించనందుకు కోర్టుకు ఎందుకు సంజాయిషీ ఇచ్చుకున్నారని మంత్రి కేటీఆర్‌ను నిలదీశారు. చైర్మన్‌ను నియమించనందుకు ఎందుకు మొట్టికాయలు తిన్నారని ప్రశ్నించారు.

'విద్యుత్ సంస్థ తరహాలో ఆర్టీసీకీ సాయం చేయాలి'

సాక్షి, హైదరాబాద్: కరెంటు కొనుగోళ్ల కోసం విద్యుత్ సంస్థ వ్యయం చేసిన రూ.12,718 కోట్ల ట్రూ అప్ చార్జీలను ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించటం హర్షణీయమని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. కోవిడ్ కాలంలో నష్టపోయిన ఆర్టీసీకి కూడా ప్రభుత్వం చేయూతనందించాలని కోరారు. రూ.4 వేల కోట్ల గ్రాంట్ మంజూరు చేసి, తుక్కుగా మారిన 5 వేల బస్సుల స్థానంలో కొత్తవి కొనేందుకు నిధులు, బకాయిల చెల్లింపులకు ఆర్థికసాయం అందించాలని ఒక ప్రకటనలో కోరారు.



నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

'బండి'కి బదులు బీజేపీ లీగల్ టీమ్

- సిట్ కార్యాలయానికి వెళ్లిన ఆ పార్టీ బృందం
- అధికారుల ఎదుట హాజరై బండి రాసిన లేఖ అందించిన వైనం
- తనకు వచ్చిన సమాచారం పబ్లిక్ డొమైన్‌లో పెట్టానన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు
- నిజాలు నిగ్గు తేల్చాల్సింది పోయి నాకు నోటీస్‌లు ఎలా ఇస్తారని ప్రశ్న



సిట్ కార్యాలయం వద్ద బీజేపీ న్యాయవాదుల బృందం

హిమాయత్‌నగర్, సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ లీకేజ్ స్కామ్‌లో పలు ఆరోపణలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎట్టకేలకు సిట్ రెండో నోటీసులకు స్పందించారు. శనివారం మలిసారి సిట్ నోటీసులు జారీ చేయడంతో ఆదివారం తమ పార్టీకి చెందిన లీగల్ టీమ్‌ను సిట్ కార్యాలయానికి పంపారు. లీగల్ సెల్ కన్వీనర్ రామారావు, లీగల్ సెల్ ఇన్‌చార్జి ఆంథోనిరెడ్డి నేతృత్వంలో ఉదయం 11 గంటల ప్రాంతంలో హిమాయత్‌నగర్‌లోని సిట్ కార్యాలయానికి వచ్చిన బీజేపీ బృందం బండి సంజయ్ రాసిన లేఖను అధికారులకు అందించింది. ఆ లేఖలో సంజయ్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో తాను సిట్ ఎదుట హాజరుకాలేనని తెలియజేశారు. ఒక ప్రజాప్రతినిధిగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా వివిధ రూపాలు, మార్గాల్లో తనకు సమాచారం అందుతుందని, అదే విధంగా టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ పై తనకు వచ్చిన సమాచారాన్ని ప్రజల సమక్షంలో (పబ్లిక్ డొమైన్) పెట్టానని సిట్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని గతంలోనూ సిట్‌కు తెలిపానని, అయినప్పటికీ మరోసారి నోటీసులు ఇవ్వడానికి కారణాలను తాను ఊహించగలనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌పై తనకు నమ్మకం లేదని స్పష్టం చేశారు.

బాధ్యత కలిగిన ఆ మంత్రి అలా ఎలా చెబుతారు?

టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాలు, ముఖ్యంగా గ్రూప్–1 పేపర్ లీక్ వ్యవహారం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, రాష్ట్ర కేబినెట్‌లో ఓ బాధ్యత గల మంత్రి ఈ వ్యవహారంలో కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారని చెప్పారని గుర్తు చేశారు. అయితే సిట్ ఇప్పటికే అనేక మందిని అరెస్టు చేసిందని, ఆది నుంచీ ఈ స్కామ్‌ను తక్కువ చేసి చూపడానికి, ఈ కుంభకోణం నుంచి దృష్టి మళ్లించడానికి గట్టి ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. రాజకీయాలను పక్కన పెడితే ఈ కుంభకోణం వల్ల తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్న లక్షలాది మంది నిరుద్యోగ యువతకును దృష్టిలో పెట్టుకోవాలని సిట్‌కు విజ్ఞప్తి చేశారు. ఒకే గ్రామంలో అనేక మంది టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో అర్హత సాధించడంపై వచ్చిన సమాచారాన్ని తాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచానని, అందులోని అంశాలను దర్యాప్తు చేయడానికి బదులు తనకు నోటీసులు ఇచ్చారని సంజయ్ తన లేఖలో పేర్కొన్నారు. మార్చి 26 వరకు పార్లమెంట్ సమావేశాలు ఉన్న నేపథ్యంలో అప్పటి వరకు తాను సిట్ విచారణకు రాలేనని స్పష్టం చేశారు. సిట్ కార్యాలయానికి వెళ్లిన బృందంలో న్యాయవాదులు వేముల అశోక్, దేవినేని హంస, సుంకర మౌనిక తదితరులు ఉన్నారు.

బీజేపీ గెలిస్తే అధికారికంగా 'విమోచనం'

కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా



కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బండి సంజయ్, ఈటల రాజేందర్ తదితరులు

జహీరాబాద్ టౌన్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే అధికారికంగా విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. తెలంగాణ సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం బసవ కళ్యాణ్ ప్రాంతంలోని గోల్టా గ్రామంలో ప్రతిష్ఠించిన 20 అడుగుల సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహంతోపాటు 103 అడుగుల జాతీయ పతాకాన్ని ఆదివారం అమిత్‌షా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పట్లో హైదరాబాద్ సంస్థానంలో భాగంగా ఉన్న గోల్టా గ్రామంలో నరమేథం జరిగిందని, దేశానికి పూర్తి స్వాతంత్ర్యం వచ్చినా హైదరాబాద్ ప్రాంతం నిజాం పాలనలో ఉండిపోయిందన్నారు, వల్లభాయ్ పటేల్ హైదరాబాద్ విమోచనానికి కృషి చేశారని, ఆయన లేకుంటే హైదరాబాద్‌కు విమోచనం జరిగేది కాదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికీ హైదరాబాద్ విమోచన దినోత్సవం జరపడానికి జంకుతోందని ఎద్దేవా చేశారు. కర్ణాటకలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రూ.50 కోట్లతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. మహాత్మ బసవేశ్వరుడు దేశంలో మొట్ట మొదటి ప్రజాస్వామ్యాన్ని స్థాపించారని, ఆయన చూపిన మార్గంలో నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి అమిత్‌షా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను సభకు పరిచయం చేశారు.

లీకేజీ కేసులో మరో ఇద్దరు అరెస్ట్

- వారు కూడా ఏఈ ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు తేల్చిన సిట్
- నిందితులు ప్రశాంత్‌రెడ్డి, రాజేంద్రకుమార్‌గా నిర్ధారణ
- పోలీసుల అదుపులో మరో నలుగురు అనుమానితులు
- అదనపు కస్టడీలోకి ప్రవీణ్, డాక్యా సహా నలుగురు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్ల లీకేజీ కేసులో సిట్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన నీలేష్, గోపాల్, డాక్యా, రాజేందర్‌లు ఈ నెల 4న రాత్రి హైదరాబాద్‌లోని ఓ లాడ్జిలో బస చేసినప్పుడు వారిని మరో ఇద్దరు అభ్యర్థులు కలిసి ఏఈ ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు పక్కా ఆధారాలతో గుర్తించారు. వారిని నవాబ్‌పేట్, షాద్‌నగర్ ప్రాంతాలకు చెందిన ప్రశాంత్‌రెడ్డి, రాజేంద్రకుమార్‌గా నిర్ధారించారు. డాక్యా, రేణుకల విచారణలోనూ ఇదే విషయం రుజువు కావడంతో ఇద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ అభ్యర్థులిద్దరూ ప్రశ్నపత్రాన్ని రూ.18 లక్షలకు కొనేందుకు డాక్యా, ఇతరులతో ఒప్పందం కుదుర్చుకొని రూ.10 లక్షల వరకు చెల్లించారని సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంలో మధ్యవర్తిగా వ్యవహరించిన మహబూబ్‌నగర్‌లోని సల్కర్‌పేటకు చెందిన తిరుపతయ్యతోపాటు మరో ముగ్గురు అనుమానితులను ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తిరుపతయ్య... ప్రశాంత్, రాజేంద్రకుమార్‌లతోపాటు పలువురు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉద్యోగులకు ఏఈ ప్రశ్నపత్రం విక్రయంలో దళారిగా వ్యవహరించాడని సిట్ ప్రాథమికంగా నిర్ధారించింది. పూర్తి ఆధారాలు లభించాక అతనితోపాటు మరో వ్యక్తిని అరెస్టు చేయాలని భావిస్తోంది. మరోవైపు గతేడాది నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 100 కంటే ఎక్కువ మార్కులు సాధించిన 121 మంది అభ్యర్థుల విచారణ కొనసాగుతోంది. ఆదివారం మరో 20 మంది అభ్యర్థులను అధికారులు ప్రశ్నించారు. దీంతో పోలీసులు విచారించిన వారి సంఖ్య 50 దాటింది.

అడ్డదారి తొక్కి.. అడ్డంగా బుక్కయ్యి..

షాద్‌నగర్ రూరల్: సిట్ అధికారులు తాజాగా అరెస్టు చేసిన ఇద్దరు నిందితుల్లో ఒకడైన రాజేంద్రకుమార్‌ది రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పరిధిలోని నేరేళ్ల చెరువు గ్రామం. నిరుపేదలైన లక్ష్మయ్య, లక్ష్మీదేవమ్మ దంపతుల నలుగురు సంతానంలో అతను పెద్ద కొడుకు. రాజేంద్రకుమార్ కొన్నేళ్లు ఉపాధి హామీ పథకంలో పనిచేసి కుటుంబాన్ని పోషించాడు. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడం కోసం అప్పులు చేసి హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నాడు. అయితే కచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగం సాధించేందుకు అడ్డదారిని ఎంచుకున్నాడు. తన కుటుంబ సభ్యుల వద్ద ఉన్న బంగారాన్ని అమ్మడంతోపాటు ఇతరుల వద్ద అప్పు చేసి రూ.5 లక్షలకు డాక్యా నాయక్ ద్వారా ఏఈఈ ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ బండారాన్ని సిట్ నిగ్గుతేల్చడంతో అడ్డంగా బుక్కయ్యాడు.

8 గంటలపాటు నిందితుల విచారణ

టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ కేసులో కోర్టు అదనపు కస్టడీకి అనుమతించడంతో నిందితులైన ప్రవీణ్, రాజశేఖర్, డాక్యా, రాజేశ్వర్‌లను పోలీసులు ఆదివారం చంచల్‌గూడ జైలు నుంచి సిట్ కార్యాలయానికి తరలించారు. దాదాపు ఎనిమిది గంటలపాటు వారిని ప్రశ్నించారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో సిట్ కార్యాలయం నుంచి సీసీఎస్‌కు తరలించారు. సోమ, మంగళవారాల్లోనూ వారిని విచారించనున్నారు.

తెలంగాణకు నిఖత్ గర్వకారణం: కేసీఆర్

ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో స్వర్ణ పతకం సాధించడంపై హర్షం

సాక్షి, హైదరాబాద్: న్యూఢిల్లీలో ఆదివారం జరిగిన మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ ఫైనల్‌లో 50 కిలోల విభాగంలో తెలంగాణకు చెందిన నిఖత్ జరీన్ స్వర్ణ పతకం సాధించడంపట్ల ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. నిఖత్ జరీన్ తెలంగాణ గర్వించదగ్గ బిడ్డ అని కొనియాడారు. క్రీడాభివృద్ధికి, క్రీడాకారుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ దిశగా తమ కృషిని కొనసాగిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో అంతర్జాతీయస్థాయి ఖ్యాతిగడించే ప్రదర్శన చేస్తున్న బాక్సర్ నిఖత్ జరీన్ స్వశక్తికి నిదర్శనమని రాష్ట్ర క్రీడల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జరీన్‌ను ఢిల్లీలో మంత్రి అభినందించారు.



నిఖత్‌ను అభినందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్



నీ గురించి నువ్వు తెలుసుకోవడమే
మొత్తం వివేకానికి ఆరంభం.
– అరిస్టాటిల్

సాక్షి
సోమవారం, మార్చి, 27

పారిస్ పవనాలు

తెలుగువాళ్లు ఉగాది జరుపుకోవడానికి సరిగ్గా ఒక్కరోజు ముందు ప్రపంచ సాహిత్యానికి 'వసంతం' వచ్చింది. సాహిత్య రంగంలో అత్యంత విశిష్టమైన మ్యాగజైన్‌గా పేరున్న 'ద పారిస్ రివ్యూ' తన 70వ వార్షికోత్సవ 'స్ప్రింగ్' సంచికను ఈ వారంలోనే విడుదల చేసింది. అన్ని సంచికలనూ క్రమసంఖ్యతో వెలువరించే సంప్రదాయం ఉన్నందున పత్రిక పరంపరలో ఇది 243వ ఇష్యూ. 2018లో మ్యాన్ బుకర్ గెలుచుకుని, అదే ఏడాది నోబెల్ పురస్కారం పొందిన పోలండ్ రచయిత్రి ఓల్గా తొకార్చుక్ ఇంటర్వ్యూ ఈ సంచిక విశేషాల్లో ఒకటి. కవిత్వం, వచనం, కళలకు అత్యంత ప్రాధాన్యముండే ఈ పత్రికలో రచయితల అంతరంగాలను లోలోతుల నుంచి అత్యంత సూక్ష్మంగా, విశదంగా స్పృశించడం మొదటినుంచీ ఒక ప్రత్యేకతగా నిలిచిపోయింది. నేపథ్యం, రాసే విధానం, విచారధారతో పాటు సాహిత్య సృజనను ప్రయోగ శాలలో పరిశీలించినంత లోతుగా జరిపే కాలాతీత సంభాషణలు ఇవి.

'ఒక రాత్రి ఓ స్నేహితుడు నాకు ఫ్రాంజ్ కాఫ్కా కథల పుస్తకం అరువిచ్చాడు. నేనుంటున్న లాడ్జికి తిరిగివెళ్లి 'ద మెటమార్ఫసిస్' చదవడం మొదలుపెట్టాను. ఆ మొదటివాక్యమే నన్ను దాదాపు మంచంలోంచి కిందపడేసినంత పని చేసింది. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఆ మొదటి వాక్యం ఇలా ఉంది: ''ఒక ఉదయం కలత నిదురతో మేల్కొన్న గ్రెగర్ జాంజా, మంచంలో తానొక పెద్ద పురుగుగా మారిపోయి ఉండటం గుర్తించాడు...'' ఆ వాక్యం చదవగానే, ఎవరైనా ఇలాంటి విషయాలు కూడా రాయవచ్చని నాకు ఇంతకుముందు తెలీదే అని నాకు అనిపించింది. తెలిసివుంటే, నేను ఎప్పుడో రాయడం మొదలుపెట్టేవాడిని. వెంటనే నేను కథలు రాయడం మొదలుపెట్టాను' అని తన సాహిత్య ప్రస్థానం గురించి చెబుతారు గాబ్రియేల్ గార్సియా మార్క్వెజ్. 'ఫిక్షన్ నా జర్నలిజానికి సాహిత్య విలువను ఇచ్చింది. జర్నలిజం నా ఫిక్షన్‌ను వాస్తవానికి దగ్గరగా ఉండేట్టు చేసింది' అంటారు ఈ పాత్రికేయ రచయిత. 'నేను ఏ భాషలోనూ ఆలోచించను. నేను దృశ్యాల్లో ఆలోచిస్తాను. అసలు ఎవరికైనా ఆలోచించేటప్పుడు భాషతో పని ఉంటుందనుకోను' అని చెబుతారు తన మాతృభాష రష్యన్‌కు దూరమైన వ్లాదిమీర్ నబకోవ్. 'అచ్చులోకొచ్చిన నా ప్రతీ పదమూ అనేకమార్లు తిరగరాయబడిందే. నా ఎరేజర్లతో పోలిస్తే నా పెన్సిళ్ల జీవితకాలమే ఎక్కువ' అంటారు ఈ పర్ఫెక్షనిస్టు. 'నేను ఎవరికీ ప్రాతినిధ్యం వహించటం లేదు' అని నిర్మొహమాటంగా చెప్పే భారత మూలాలున్న ట్రినిడాడ్–బ్రిటిష్ రచయిత వి.ఎస్.నైపాల్, 'మనిషి అనునిత్యం నైతిక తీర్పుల బరువు మోయనక్కర్లేని ప్రపంచాన్ని కోరుకున్నాను' అంటారు. ఎర్నెస్ట్ హెమింగ్వే, జేమ్స్ థర్బర్, రే బ్రాడ్బరీ, స్టీఫెన్ కింగ్, రేమండ్ కార్వర్, మాయా ఏంజెలో, లిడియా డేవిస్ లాంటి వందలాది మేటి రచయితల ఇంటర్వ్యూలను 'ది ఆర్ట్ ఆఫ్ ఫిక్షన్' విభాగంలో ప్రచురించింది పారిస్ రివ్యూ. జార్జ్ లూయీ బోర్హెస్, హారుకీ మురకామి, మిలన్ కుందేరా, సైమన్ దె బువా, ఓర్హాన్ పాముక్, సల్మాన్ రష్దీ, చినువా అచేబే లాంటి భిన్న మూలాలున్న రచయితలు ఇందులో ఉన్నారు. 'ది ఆర్ట్ ఆఫ్ పొయెట్రీ'గా రాబర్ట్ ఫ్రాస్ట్, టీఎస్ ఎలియట్, అక్తావియో పాజ్, పాబ్లో నెరూడా, ఎజ్రా పౌండ్ లాంటి కవుల సంభాషణలను నమోదు చేసింది. ఇవన్నీ 'ద రైటర్స్ ఎట్ వర్క్' పుస్తకాల సిరీస్‌గా వచ్చాయి. ప్రపంచ చరిత్రలో పట్టువిడవకుండా ఒంటిచేత్తో నెరిపిన సాంస్కృతిక సంభాషణగా దీన్ని అభివర్ణించారు సాహిత్య విమర్శకుడు జో డేవిడ్ బెలామీ.

ఈ త్రైమాసిక ఆంగ్లభాష పత్రిక ఫ్రాన్స్ రాజధాని నగరం పారిస్‌లో 1953లో ప్రారంభమైంది. 1973లో అమెరికాలోని న్యూయార్క్ నగరానికి తన కార్యస్థానాన్ని మార్చుకుంది. పత్రికను స్థాపించిన నాటి నుంచీ 2003లో మరణించేదాకా– యాభై ఏళ్లపాటు అమెరికా రచయిత జార్జ్ ప్లింప్టన్ దీనికి ప్రధాన సంపాదకుడిగా వ్యవహరించారు. ఆయన ముద్ర ఎంతటిదంటే, ఈయన తర్వాత ఆ స్థానంలోకి వచ్చిన బ్రిజిడ్ హ్యూస్... ప్లింప్టన్ గౌరవార్థం 'సంపాదకురాలు' అనిపించుకోవడానికి నిరాకరించారు. ప్రస్తుతం ఎమిలీ స్టోక్స్ సంపాదకురాలిగా ఉన్నారు. పత్రిక చరిత్రలో ఈమె ఆరో ఎడిటర్.

ఫిలిప్ రాత్, ఇటాలో కాల్వీనో, శామ్యూల్ బెకెట్, డేవిడ్ ఫాస్టర్ వాలెస్ లాంటి మహామహుల రచనలు పారిస్ రివ్యూలో చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం 24,000 ప్రింట్ కాపీల సర్క్యులేషన్, నెలకు సుమారు 12 లక్షల ఆన్‌లైన్ వ్యూస్ ఇది కలిగివుంది. ఈ ఏడు దశాబ్దాల్లో ఎన్నో సాహిత్య పత్రికలు మూతపడ్డాయి. 'ఎన్ని పోయినా మనకు 'పారిస్' మాత్రం ఉంటుంది' అంటారు రచయిత వుహాన్ విడాల్. 'పారిస్ రివ్యూ చచ్చేంత బోర్ కొడుతోందని ఎప్పటికీ అనలేం' అంటారు పబ్లిషర్ జెస్సా క్రిస్పిన్. ఉత్తమ సాహిత్యానికి పెద్దపీట వేయడంతో పాటు, ఆర్కైవు మొత్తాన్నీ అందుబాటులో ఉంచడం, అందులోని క్లాసిక్స్‌ను నవతరపు రచయితల వ్యాఖ్యానంతో పునఃప్రచురించడం లాంటివి కొత్త పాఠకులను పాత సాహిత్యంతో పరిచయం చేసుకునేలా ఉపకరిస్తున్నాయి. 2012 నుంచీ మొబైల్ యాప్ ప్రారంభించింది. 2017లో పాడ్‌కాస్ట్ మొదలుపెట్టింది. సమకాలీన రచయితల రచనలను తమ గొంతుల్లోనే వినిపించడం కూడా మొదలుపెట్టింది. ఎలా రాయాలో శిక్షణ ఇచ్చే రోక్సానే గే తన 'మాస్టర్ క్లాస్'లో వర్తమాన రచయితలకు ఇచ్చే ఒక ముఖ్యమైన సలహా: పారిస్ రివ్యూ ఇంటర్వ్యూలను లోతుగా చదవడం! సాహిత్యం రెండో ఆలోచనగా మాత్రమే ఉండే ప్రపంచంలో దాన్ని ఉత్సాహభరితం చేస్తూ, ప్రధాన స్రవంతికి తేగలిగింది 'ద పారిస్ రివ్యూ'!

విమర్శ ప్రాధాన్యం మరిచారా?

కామెంట్



కరణ్ థాపర్

కొన్నేళ్ల క్రితం నరేంద్ర మోదీ ''ప్రభుత్వాలపై, వాటి పనితీరుపై వీలైనంత కఠినాతికఠినమైన విశ్లేషణ, విమర్శ చేయాలన్నది నా బలమైన విశ్వాసం. లేనిపక్షంలో ప్రజాస్వామ్యం నడవదు'' అన్నారు. మీడియా విమర్శనాత్మకంగా ఉండకపోతే ప్రభుత్వంలో భయం పోయి దేశానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. చాలామంది బలమైన విమర్శను ఆహ్వానిస్తారు, కానీ ప్రభుత్వాన్ని భయంలో ఉంచాలని ఎవరూ చెప్పలేదు. కొంతమంది మంత్రులు మోదీ మాటల్ని మర్చిపోయారు. విమర్శకులను జాతి వ్యతిరేకులు అని నిందిస్తే, ఆ ప్రతిస్పందన విమర్శ కంటే ఎక్కువ ప్రభావాన్ని ప్రేరేపిస్తుంది.

స్వాతంత్య్రం తన ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఉన్న ప్రాధాన్యం గురించి ప్రధాన మంత్రే చెప్పిన మాటలు ఎంతమందికి గుర్తున్నాయో నాకు తెలీదు. ఆయన ప్రకటనలోని విషయం మాత్రమే కాదు, ఆయన జాగ్రత్తగా వాడిన పదాలు కూడా. ఆ ప్రసంగ వీడియోలోని క్లిప్‌ను ప్రదర్శించినట్లయితే, ప్రధాని ప్రసంగంలోని ధాటిని కూడా మీరు గమనిస్తారు. ఆ మూడింటినీ కలిపిచూస్తే, ఆయన చెప్పిన మాటల్ని సరిగ్గా అలాగే ఉద్దేశించారని మనల్ని స్పష్టంగా నమ్మమని అన్నట్లుగా ఉంటాయి.

ప్రధాని పదవిని చేపట్టిన రెండేళ్ల తర్వాత, అంటే 2016 సెప్టెంబర్‌లో 'నెట్‌వర్క్ 18' ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ అన్నారు: ''ప్రభుత్వాలపై, వాటి పనితీరుపై వీలైనంత కఠినాతి కఠినమైన విశ్లేషణ, విమర్శ చేయాలన్నది నా బలమైన విశ్వాసం. లేనిపక్షంలో ప్రజాస్వామ్యం నడవదు.''

భయం ఉండాల్సిన అవసరం

మొదటగా ఆ పదాల ఎంపికను గమనించండి. 'కఠినాతి కఠినమైన' విశ్లేషణ, విమర్శ. మృదువైన, సూక్ష్మ కాదు. పరుషంగా, దాపరికం లేకుండా, శక్తిమంతంగా! రెండవది, ప్రభుత్వ పనిని మాత్రమే కాదు, ప్రభుత్వాన్నే విమర్శించి, విశ్లేషించాలి. మోదీ వీటిని ప్రత్యేక అంశాలుగా పేర్కొన్నారు. ఇది ఉద్దేశపూర్వక విభజన.

మోదీ మరింత ముందుకెళ్లారు. అంతే సమానమైన, శక్తిమంతమైన పదాలతో ఒకవేళ ప్రభుత్వాన్ని విమర్శించడంలో మీడియా విఫలమైతే రాదగిన నిర్దేశిత ఫలితమేమిటో చెప్పారు. ''ప్రభుత్వంలో తేవాల్సిన మెరుగుదల, ప్రభుత్వంలో ఉండి తీరాల్సిన భయం లేకుండాపోతాయి. ఒకవేళ ఆ భయం ప్రభుత్వంలో అదృశ్యమైతే, దేశం ఘోరంగా దెబ్బతింటుంది. అందువల్లే మీడియా అత్యంత విమర్శనాత్మకంగా ఉండాలని నేను కోరుకుంటున్నాను''.

అంటే, ప్రభుత్వాన్ని భయపడుతున్న స్థితిలోనే ఉంచాలని ప్రధాని కోరుకుంటున్నారు. ఆయన 'భయం' అనేమాటను అనుకోకుండా ఉపయోగించలేదు. చెప్పాలంటే, ఆ పదాన్ని ఆయన మూడుసార్లు వాడారు. ప్రభుత్వం భయపడటం మానేస్తే ఏం



జరుగుతుందో గమనించండి– దేశానికి తీవ్ర నష్టం!

జాతి వ్యతిరేకులా?

ఇతర ప్రజాస్వామిక నేతలు విమర్శ అవసరం గురించి ఈ స్థాయిలో చెప్పి ఉంటారా అని నేను గుర్తు చేసుకోలేకపోతున్నాను. చాలామంది బలమైన విమర్శను ఆహ్వానిస్తారు, కానీ ప్రభుత్వాన్ని భయంలో ఉంచాలని ఎవరూ చెప్పలేదు. పైగా మోదీ ప్రభుత్వాలను అని బహువచనంలో మాట్లాడలేదు. ప్రత్యేకించి తన సొంత ప్రభుత్వం గురించే మాట్లాడారు.

ఇప్పుడు నేను దీన్ని ఎందుకు పునరుల్లేఖించాను? మామూలు కారణం ఏమిటంటే, కొంతమంది మంత్రులు దాన్ని మర్చిపోయారు లేదా ఉద్దేశపూర్వకంగా విస్మరించేశారు. అందుకు నేను అనేక ఉదాహరణలు ఇవ్వగలను. కానీ రెండింటికి మాత్రమే పరిమితమవుతాను.

కొంతమంది రిటైరైన న్యాయమూర్తులు 'భారత వ్యతిరేక గ్యాంగ్'లో భాగమయ్యారని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. ఎందుకంటే ఈ న్యాయమూర్తులు పాల్గొన్న ఒక సెమినార్‌లో– మోదీ ప్రభుత్వం నియమించిన న్యాయమూర్తుల గురించిన విశ్లేషణను ప్రొఫెసర్ మోహన్ గోపాల్ సమర్పిస్తూ, వారిలో 15 శాతంమంది మతరాజ్య వ్యవస్థకు తప్ప రాజ్యాంగబద్ధ న్యాయమూర్తులుగా లేరని పేర్కొన్నారు. మోదీ ప్రకటన సరిగ్గా ఇదే మాట్లాడుతోందని న్యాయమంత్రి గుర్తించడం లేదా? అయినప్పటికీ ఆయన దాన్ని 'భారత వ్యతిరేకం' అన్నారు. న్యాయమూర్తులు దీనికి 'తగిన మూల్యం' చెల్లిస్తారని హెచ్చరించారు కూడా!

చతురత లేకపోతే...

నా రెండో ఉదాహరణ – ఉప రాష్ట్రపతికి సంబంధించినది. ఆయన మోదీ ప్రభుత్వంలో సభ్యుడు కాదు. ఆయన స్థానం ఆయన్ని మించినది. కానీ 'మేధావర్గం, మీడియా జనాల' గురించి ఆయన మాట్లాడుతూ, ''మన వృద్ధి వేగాన్ని తగ్గించి చూపడానికి భారత వ్యతిరేక శక్తులు హానికరమైన కథనాలను అల్లుతున్నాయి. మన క్రియాత్మక ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగబద్ధ సంస్థలకు కళంకం తెస్తున్నాయి'' అని వ్యాఖ్యానించారు. మోదీ ఇంటర్వ్యూలోని విషయాలు తనకు కూడా వర్తిస్తాయని ఆయన మరిచిపోయినట్లు ఉన్నారు.

''మన వృద్ధి వేగాన్ని తగ్గించాలని చూస్తున్నవారు'' మన స్థూలదేశీయోత్పత్తి యథార్థతను ప్రశ్నిస్తున్నారు. ''మన క్రియాత్మక ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగబద్ధ సంస్థలను'' కళంకపరుస్తున్నవారు పార్లమెంటు, ఎన్నికల కమిషన్, మన భద్రతా సంస్థల పనితీరును ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి విమర్శను కేవలం స్వాగతించడం కాదు, ఇది అవసరమే అని మోదీ చెప్పారు.

ప్రభుత్వ విమర్శలకు జవాబు ఇవ్వాల్సిన కేంద్ర మంత్రులూ, బీజేపీ అధికార ప్రతినిధులూ ప్రధానమంత్రి వివేకవంతమైన మాటలను కంఠతా పట్టాల్సి ఉంది. నన్ను మరో అంశాన్ని కూడా చేర్చనివ్వండి. విమర్శను ఎదుర్కొన్నప్పుడు చిరునవ్వుతో వినాలి, హుందాగా స్పందించాలి. అప్పుడు ఆ విమర్శ వెంటనే వీగిపోతుంది. అలా కాకుండా విమర్శతో ఘర్షించడం, ఇంకా ఘోరంగా విమర్శకులను జాతి వ్యతిరేకులు అని నిందించడం చేస్తే, ఆ ప్రతిస్పందన విమర్శ కంటే ఎక్కువ ప్రభావాన్ని ప్రేరేపిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, చతురతతో వ్యవహరించు, రాజకీయం చేయవద్దు!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అదే గొప్పా?



మన విలువను కేవలం ఇన్‌స్టా ఫాలో యర్ల సంఖ్యతో కొలిచేచోట మనం పని చేయలేం. ఆ కారణంగానే నేను ఒక కాంట్రాక్టును వదులుకున్నాను. – నందితా బోస్, రచయిత్రి

ముందే తెలుసు!



పనికొచ్చే మా ఆరో క్లాసు అబ్బాయి సాహిత్య విమర్శ: "పుస్తకం కవర్ మీద కుక్క బొమ్మ ఉండి, దానికి అవార్డు వచ్చిందంటే, ఇక నేను దాన్ని చదవను. ఎందుకంటే కచ్చితంగా కుక్క చనిపోతుంది."

– రెబెక్కా మక్కాయి, స్టూడియో ఆర్ట్ డైరెక్టర్

మీరెంత అనడమే!



కాంగ్రెస్‌ను విమర్శించేవాళ్లు ఒక్కసారి వెనక్కి తగ్గి, మొత్తంగా పరిస్థితి ఏమిటో అవగతం చేసుకోవాలి. రాహుల్ గాంధీకి జరుగుతున్నదాని ఉద్దేశం, హయాంను విమర్శించే ప్రతి ఒక్కరికీ బలమైన సంకేతం పంపడం! "రాహుల్ గాంధీ లాంటివాడికే మేము ఇది చేయగలిగినప్పుడు, మీ గతి ఏమిటి?"

– మీనా కందసామి, రచయిత్రి

ఇంకెవరూ దొరకలేదా?



ఘనమైన చరిత గలిగిన నలంద విశ్వవిద్యాలయం లాంటిదాని పునరుద్ధరణను దర్శనాల పట్ల ఏ శ్రద్ధాసక్తులూ లేని అమర్త్య సేన్ లాంటివాడికి అప్పగించడం నిరాశాపూరితం, స్వీయ విధ్వంసకరం. ఆయనొక రహస్య కమ్యూనిస్టుకు తక్కువ కాదు.

– జోసెఫ్ టి. నూనీ, చరిత్రాంశాల వ్యాఖ్యాత

నాణ్యత కొరత



సివిల్ సర్వెంట్ల నాణ్యతలో క్రమ పతనం ఉంటోందని దీర్ఘానుభవం గల కొందరు రాజకీయ నాయకులు వ్యాఖ్యానిస్తారు. ఎందుకిలా? చాలావరకు ఇప్పటి బ్యూరోక్రాట్లు లిబరల్ సైన్సుల విద్యార్థులు కాకుండా కోచింగ్ క్లాసులు, బట్టీయం చదువుల ఉత్పత్తి కావడం వల్లనా?

– ధవళ్ కులకర్ణి, రచయిత

కొడుకు కోసమా?



మార్క్ జుకర్‌బర్గ్, ఆయన భార్యకు ముగ్గురు పిల్లలెందుకు? వెయ్యి మంది పిల్లల్ని పెంచడానికి కావాల్సిన డబ్బయినా వాళ్ల దగ్గరుంది సరే. కానీ ఇది డబ్బు సంగతి కాదు. ఇద్దరు కూతుళ్లకు జన్మనిచ్చిన తర్వాత కూడా వాళ్లు సంతోషంగా లేరా? ఒకవేళ ప్రిస్కిల్లా చాన్ ఆసియా మనస్తత్వమే రహస్యంగా ఒక కొడుకును కోరుకుందా?

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

నిర్వచనాలు వద్దు



నేనొక మహిళను. దయచేసి ఎప్పుడూ నా గురించి గర్భం ఉన్న వ్యక్తి, జన్మనిచ్చే మనిషి, రుతుస్రావం ఉన్న మనిషి అని సూచించకండి. ఇది ఒక మనిషిని ఎంత హీనపరచడమో జనానికి ఎందుకు తెలియట్లేదు? ఈ చెత్త వ్యాఖ్యానాలతో నిమిత్తం లేకుండా కూడా మీరు ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి మద్దతు ఇవ్వొచ్చు.

– అనా కస్పరియన్, టీవీ హోస్ట్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

జాగ్రత్త పడకపోతే నరకమే!

పదివేల సంవత్సరాల ప్రయాణం తర్వాత, మానవ నాగరికతపై వాతావరణం ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రాబోయే కొన్నేళ్లలో మనం చేసే పనులు వేల ఏళ్ల మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి. వాతావరణ మార్పులపై 'ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్' తాజా నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. 'అందరికీ జీవించగలిగే, స్థిరమైన భవిష్యత్తును భద్రపరచడానికి ఉన్న అవకాశం త్వరగా ముగిసిపోబోతున్నది' అని ఆ నివేదిక అంటోంది.

ఇంకా ఆ నివేదిక ఏమని హెచ్చరిస్తున్నదంటే... 2030 నాటికి తీసుకునే చర్యలూ, చేసుకునే ఎంపికలూ వేల సంవత్సరాల పాటు ప్రభావం చూపుతాయి. వాతావరణ సంక్షోభం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా జీవితాలనూ, జీవనోపాధినీ దెబ్బతీస్తోంది. 'నిరంతర ఉద్గారాలు అన్ని ప్రధాన వాతావరణ వ్యవస్థ భాగాలనూ మరింత ప్రభావితం చేస్తాయి. గ్లోబల్ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కి పరిమితం చేయాలి. 2022లో ప్రపంచ ఉద్గారాలు మళ్లీ పెరిగి కొత్త రికార్డును నెలకొల్పాయి. కాబట్టి 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పరిమితం చేయాలన్న లక్ష్యం వాస్తవికంగా లేదు. మానవాళిని రక్షించే పనిలో అప్రమత్తత అవసరం. ఏది ఏమైనప్పటికీ, ఎంత వేగంగా ఉద్గారాలను తగ్గించగలిగితే అంతగా బిలియన్ల కొద్దీ ప్రజలకు మేలు కలుగుతుంది.' నిరోధించగలిగిన ప్రతి టన్ను సీఓ2 ఉద్గారాలు వాస్తవ విపత్తు ప్రమాదాన్ని తగ్గిస్తాయి. కొత్త ప్రాజెక్టుల సంగతి పక్కన పెట్టి ... ఇప్పటికే ఆపరేషన్‌లో ఉన్న చమురు, గ్యాస్, బొగ్గు ప్రాజెక్టులను కొనసాగించినా గ్లోబల్ వార్మింగ్‌ను 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు పరిమితం చేసే లక్ష్యం దెబ్బతింటుంది.

ఉద్గారాలను తగ్గించడానికి అవసరమైన సాంకేతిక పద్ధతులు, అందుకు అవసరమైన నిధులు లక్ష్య సాధనలో కీలకం. సౌర, పవన శక్తి వంటివాటిని ఎక్కువగా వాడుకోవడం; అడవుల విధ్వంసాన్ని ఆపడం వంటివి ఇప్పటికే మనకు అందుబాటులో ఉన్న కొన్ని చౌకైన, కీలకమైన పరిష్కార మార్గాలు. లక్ష్య సాధనకు డబ్బుల అవసరం ఎక్కువే కానీ నిధులను ఈ దిశలోకి మళ్లించే క్రమంలో ఎదురయ్యే అడ్డంకులను అధిగమించగలగాలి. గ్లోబల్ వార్మింగ్ 2100 నాటికి 3.2 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు పెరుగుతుందని అంచనా. ప్రభుత్వాలు విధానాలను బలోపేతం చేయకుండా తాత్సారం చేస్తే... పరిస్థితి నరకప్రాయం అవుతుంది. మూడు దశాబ్దాలుగా ఐపీసీసీ హెచ్చరికలు విస్మరణకు గురయ్యాయి. ఇప్పటికైనా అప్రమత్తంగా లేకపోతే భవిష్యత్తు అంధకారమే.

– డాక్టర్ ముచ్చుకోట సురేష్ బాబు, ప్రజాసైన్స్ వేదిక

దేశం అలా విడిపోయింది!

సందర్భం



జిల్లా గోవర్ధన్

మన దాయాది దేశం మార్చి 23ను 'పాకిస్తాన్ డే'గా జరుపుకొంది. అయితే ఎందుకు అన్నదే చాలా మందికి తెలియదు.

1937లో యునైటెడ్ ప్రావిన్స్‌కు జరిగిన లెజిస్లేటివ్ ఎన్నికల్లో కాంగ్రెస్, ముస్లింలీగ్ దాదాపు మిత్ర పక్షాల్లాగానే ప్రచారం చేసుకున్నాయి. కాంగ్రెస్ 134 సీట్లు, ముస్లిం లీగ్ 39 సీట్లు కైవసం చేసుకున్నాయి. యునైటెడ్ ప్రావిన్స్‌లో మంత్రివర్గం ఏర్పాటు చేసేటప్పుడు మాత్రం కాంగ్రెస్ నాయకత్వం, ముస్లిం లీగ్ సభ్యులను దూరం పెట్టింది. కనీసం రెండైనా పదవులు కేటాయించవలసిందిగా లీగ్ నాయకులు కోరారు. కాంగ్రెస్ సీనియర్ నేత జవహర్‌లాల్ నెహ్రూ, వారి విన్నపాన్ని పట్టించుకోలేదు. 39 మంది ముస్లిం (లీగ్) సభ్యులు ప్రతిపక్ష బెంచీలకే పరిమితమయ్యారు. దీనితో సహనం కోల్పోయిన ముస్లిం లీగ్ నాయకులు, 'కాంగ్రెస్ బ్రాహ్మణ, బనియా లోగోం కీ హిందూ పార్టీ' (కాంగ్రెస్ బ్రాహ్మణ, బనియా ప్రజల హిందూ పార్టీ) అని దుమ్మెత్తి పోయడం మొదలు పెట్టారు. దీనికి తోడు, ముస్లింలను తమ వైపు మలచుకోవడానికి పండిత్ నెహ్రూ, 'ముస్లిం మాస్ కాంటాక్ట్ ప్రోగ్రాం' చేపట్టి, ముస్లిం యువకులను కాంగ్రెస్ లోకి ఆహ్వానించటం ప్రారంభించారు. ఇది లీగ్ నాయకులకు మింగుడు పడలేదు.

39 కోట్ల దేశ జనాభాలో ముస్లింల సంఖ్య కేవలం 8 కోట్లు మాత్రమే. ఈ నిష్పత్తిలో ముస్లింలు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నటికీ అధికారంలోకి రాలేరని ఆలోచించిన లీగ్ నాయకుడు జిన్నా... ప్రతీ పెద్ద నగరంలో సుడిగాలి పర్యటనలు చేసి ముస్లిం చైతన్య సభలు నిర్వహించి, కాంగ్రెస్ హిందూ పక్షపాత పార్టీ అనీ, ముస్లింలు వారి మాటలతో మోసపోవద్దనీ చెప్పారు. వారి 'మసీహా,' ముస్లిం లీగ్ మాత్రమే ననీ ప్రచారం చేశారు.

1930 వరకు బాంబే ప్రావిన్స్‌లో మకుటం లేని కాంగ్రెస్ నాయకుడిగా, హిందూ ముస్లింలకు వారధిగా పేరు గడించాడు మహమ్మద్ అలీ జిన్నా. మతాన్ని రాజకీయాన్ని వేరు వేరు దృక్పథాలతో చూడాలని ఆయన ఆకాలంలో పదే పదే చాటేవాడట. తిలక్‌పై బ్రిటిష్‌వాళ్లు పెట్టిన దేశద్రోహ కేసుపై కోర్టులో ఉచితంగా వాదించారు కూడా. అటువంటి జిన్నా, తర్వాత కాలంలో పూర్తిగా మారిపోయారు.

1937 తర్వాత చెలరేగిన మతపరమైన అల్లర్ల



ప్రభావానికి హిందూ ముస్లిం సౌభ్రాతృత్వం తెగిపోయింది. నవంబరు 1939లో అనుకోని పరిస్థితుల్లో కాంగ్రెస్ మంత్రివర్గం యునైటెడ్ ప్రావిన్స్‌లో రాజీనామా చేసింది. అది తిరిగి బ్రిటిష్ గవర్నర్ పాలనలోకి రావటంతో, ముస్లిం లీగ్ బ్రిటిష్ అధికార యంత్రాంగానికి, అనుకూలంగా నడుచుకుంటూ వారి మన్ననలు పొందింది. 1940 మార్చి 22, 23, 24 తేదీల్లో లాహోర్‌లో ముస్లింలీగ్ సదస్సు జరిగింది. జిన్నా తన అధ్యక్ష ఉపన్యాసంలో, హిందూ డామినేటెడ్ భారత్‌లో ప్రజాస్వామ్య రీతిలో ముస్లింలు అధికారం చేజిక్కించుకోవటం దుర్లభం అనీ, దీనికి పరిష్కారం ముస్లింలకు ప్రత్యేక దేశమే అని తేల్చేశాడు.

మార్చి 23 నాటి సభలో బెంగాల్ ప్రావిన్స్‌కు చెందిన ఫజల్ ఉల్ హక్... ముస్లింల శ్రేయస్సుకు వేరు దేశం కావాలని తీర్మానం ప్రవేశ పెట్టాడు. దాన్ని ముక్త కంఠంతో ఆమోదించింది సభ. ఈ తీర్మానంలో పాకిస్తాన్ పదం ఎక్కడా ప్రస్తావించలేదు. కానీ మరుసటి రోజు లాహోర్ నుండి వెలువడే ఉర్దూ పత్రిక, 'నవా ఇ వక్త్' ఈ ప్రస్తావనను, 'పాకిస్తాన్ రెజెల్యూషన్' అని ప్రచురించింది. కాంగ్రెస్‌కు చెందిన మౌలానా అబుల్ కలాం ఆజాద్, రఫీ అహ్మద్ కిద్వాయి లాంటి ప్రోగ్రెసివ్ ముస్లిం నాయకులు మతపరంగా దేశవిభజన శ్రేయస్కరం కాదని పదే పదే చెప్పినప్పటికీ, జిన్నా ప్రచారానికే చాలామంది మహమ్మదీయులు ఆకర్షితులయ్యారు.

దేశ విభజన తర్వాత 'టైమ్స్' లండన్ విలేకరి, లూయిస్ హెరెన్ అడిగిన ఒక ప్రశ్నకు, పాకిస్తాన్ గవర్నర్ జనరల్‌గా పగ్గాలు చేపట్టిన రోజుల్లో జిన్నా జవాబిస్తూ... '1937లో యూపీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ముస్లింలీగ్ చేరడానికి ఆయన (నెహ్రూ) అంగీకరించి ఉంటే పాకిస్తాన్ అనేది ఉండేదే కాద'ని అన్నాడని కులదీప్ నయ్యర్ తన 'బియాండ్ ద లైన్స్'లో పేర్కొన్నారు. అగ్ర నాయకుల వ్యక్తిగత పంతాల కారణాలతో దేశ విభజన కావటం నిజంగా శోచనీయం. 1940, మార్చి 23న లాహోర్ సదస్సులో 'పాకిస్తాన్ రిజల్యూషన్' ఆమోదం పొందినందున పాక్ ప్రభుత్వం ఈ రోజును 'పాకిస్తాన్ డే'గా ప్రతి ఏటా పాటిస్తోంది.

(కులదీప్ నయ్యర్ 'బియాండ్ ద లైన్స్', వెంకట్ ధూళిపాళ 'క్రియేటింగ్ ఎ న్యూ మదీనా' ఆధారంగా)

వ్యాసకర్త విశ్రాంత ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ | 98190 96949

మాతృత్వానికి ప్రతిరూపం

జిల్లెళ్లమూడి అమ్మ ఉత్తుంగ తరంగిత ప్రేమ మూర్తి, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని చాటిన మహనీయురాలు. సర్వమత సమానత్వాన్ని చాటిన పుణ్యమూర్తి. అప్పటి గుంటూరు జిల్లా పొన్నూరు తాలుకా మన్నవ గ్రామంలో 1923 మార్చి 28వ తేదీన ఆమె ఈ లోకానికి చ్చారు. అనసూయ అనే పేరును సార్థకం చేసుకుంటూ అన్నార్తులను ఆదరించే అన్నపూర్ణగా మారారు. 1936 మే 5వ తేదీన గుంటూరు జిల్లా బాపట్లకు చెందిన బ్రహ్మాండం నాగేశ్వరరావుతో వివాహమైంది. ఆమెకు కులమతాలు, ధనిక పేద తారతమ్యం లాంటివి లేవు. అందుకే ఆమె నివాసం అందరి ఇల్లయ్యింది. జిల్లెళ్లమూడి ఆమె నివాసమై పవిత్ర క్షేత్రమైంది.



ప్రపంచ ఆధ్యాత్మిక చరిత్రలో ఎందరో మహానుభావులు, మహాత్ములు జన్మించారు. వారి వారి అభిరుచులు, భగవంతుని ఆదేశం మేరకు సేవలను అందించారు. అటువంటి వారిలో అమ్మ ఒకరు. అమ్మ మార్గం భిన్నమైనది. ఆమెలో ఎన్నో విశిష్టతలు కనిపిస్తాయి. 'నీ బిడ్డను నువ్వు ఎలా ప్రేమిస్తావో అందరినీ అలాగే ప్రేమించు. ఆకలితో ఉన్నవారికి పిడికెడు అన్నం పెట్టు' అని ఆమె బోధించారు. ఇంతకు మించిన మానవతా సూత్రం ఏముంటుంది?

ఆమె పుట్టింది సనాతన హిందూ సంప్రదాయ కుటుంబంలో అయినప్పటికీ అన్ని మతాలనూ సమానంగా చూశారు. అమ్మ భక్తులకు సర్వస్వరూపిణి. ఎవరి ఇష్టదైవ రూపాన్ని వారు ఆమెలో చూసుకుంటారు. తన ఐదవ ఏట ఆమె తల్లి గతించారు. తొమ్మిదో ఏట ప్రఖ్యాత పండితులు, పరివ్రాజకులు వాసుదేవాచార్యుల దర్శన భాగ్యం కలిగింది ఆమెకు. వారి బోధనలు ఆమెను ప్రభావితం చేశాయి. అమ్మ ప్రేమ తత్వం తెలుసుకున్న ఎందరో పండితులు, విద్యావేత్తలు, ఆమె మార్గాన్ని అనుసరించారు. ఆమె విద్యాదాత. అందరికీ చదువు అందాలనే సంకల్పంతో అనేక పాఠశాలలను నిర్మించారు. ఆ విద్యాదానం నేటికీ కొనసాగుతోంది.

ఆమె నిలయంలో నిత్యం అన్న సంతర్పణే. అమ్మ శతజయంతి సందర్భంగా మార్చి 28వ తేదీనుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జిల్లెళ్ళమూడిలో ఐదు రోజులపాటు శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సిద్ధేశ్వరానంద భారతీ స్వామి, రమ్యానంద భారతీ స్వామిని, విశ్వయోగి విశ్వంజీ, సీతారామ గురూజీ, కమలానంద భారతీ స్వామీజీ తదితరులు అమ్మ ప్రేమ తత్వాన్ని వినిపించబోతున్నారు. ఉత్సవాలను బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి ప్రారంభిస్తారు.

– మణిమేఖల

(మార్చి 28న జిల్లెళ్లమూడి అమ్మ శతజయంతి ఉత్సవాలు ప్రారంభం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.షష్ఠి రా.7.37 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** రోహిణి సా.5.37 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ఉ.9.17 నుండి 10.55 వరకు, తిరిగి రా.11.35 నుండి 1.19 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.27 నుండి 1.17 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** ప.2.15 నుండి 3.54 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.02, **సూర్యాస్తమయం:** 6.07.

క్లుప్తంగా...

తెలంగాణకు 'స్కోచ్ గోల్డ్ అవార్డు'



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు దక్కింది. ఇ–గవర్నెన్స్ విభాగంలో తెలంగాణ రాష్ట్రం ఇ–ప్రొక్యూర్‌మెంట్ ప్రాజెక్టుకు స్కోచ్ గోల్డ్ అవార్డు లభించింది. ఈ అవార్డును న్యూఢిల్లీలోని ఇండియా హాబిటాట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో స్కోచ్ గ్రూప్ చైర్మన్ సమీర్ కొచ్చర్ అందించారు. ఐటీఈ అండ్ సీ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ పెండ్యాల శ్రీనివాస్.. ఉపాధి టెక్నో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కల్యాణ్ చక్రధర్‌రెడ్డితో కలిసి ఈ అవార్డును అందుకున్నారు.

సాహిత్యపోషణతో సమాజ ఉద్ధరణ

- ఆచార్య ఎన్.గోపి



చింతకింది శ్రీనివాసరావుకు పురస్కారం అందిస్తున్న ఆచార్య ఎన్. గోపి తదితరులు

సిరిసిల్లకల్చరల్: సాహిత్య పోషణ ద్వారా సమాజం ఉద్ధరింపబడుతుందని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, కేంద్ర సాహిత్య అకాడమీ సమన్వయకర్త ఆచార్య ఎన్.గోపి అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా రగుడులోని రంగినేని సుజాత ఎడ్యుకేషన్, చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రంగినేని ఎల్లమ్మ స్మారక సాహిత్య పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గోపి మాట్లాడుతూ సాహిత్య కార్యక్రమాలు, కార్యశాలల నిర్వహణతో ట్రస్టు రాష్ట్రస్థాయిలో ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అనంతరం ఉడుకు బెల్లం కథల సంపుటి రచయిత డాక్టర్ చింతకింది శ్రీనివాసరావుకు పురస్కారం అందించారు. రూ.25 వేల నగదు, శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

కుక్కల దాడిలో మహిళ, చిన్నారికి గాయాలు



ఎల్లమ్మకు అయిన గాయం

కేసముద్రం/హసన్‌పర్తి: రెండు వేర్వేరుచోట్ల జరిగిన కుక్కల దాడిలో ఓ మహిళతోపాటు చిన్నారి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలు మహబూబాబాద్, హనుమకొండ జిల్లాల్లో ఆదివారం చోటు చేసుకున్నాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ధన్నసరికి చెందిన లింగాల ఎల్లమ్మ ఇంట్లో నుంచి బయటకు వెళ్లగా, అటుగా వచ్చిన పిచ్చికుక్క ఆమె కాలుపై కరవడంతో తీవ్ర రక్తస్రావమైంది. దీంతో ఆమెను మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తర్వాత ఆ కుక్క రెండు దూడలపై కూడా దాడి చేసింది. దీంతో స్థానికులు ఆ పిచ్చికుక్క వెంటబడి కొట్టి చంపేశారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామానికి చెందిన తాళ్లపల్లి శ్వేత, చిరంజీవి దంపతుల కూతురు అద్వైత ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా వీధికుక్క దాడి చేసింది. భయంతో చిన్నారి కేకలు వేయగా తల్లిదండ్రులు ఇంట్లోంచి బయటకు వచ్చారు. చిన్నారిని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

రైతుల దెబ్బలకు దొంగ మృత్యువాత



మల్లేశం(ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): ఏళ్లుగా బోర్ల వద్ద వైర్లు, బోరు డబ్బాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు చోరీ చేస్తున్న ఓ దొంగను రైతులు గుర్తించి చితకబాదగా తీవ్ర గాయాలపాలైన అతను మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘటనపై సీఐ వేణుకుమార్ తెలిపిన వివరాలిలా.. గ్రామానికి చెందిన మద్దెల మల్లేశం (24) కొన్నాళ్లుగా చోరీలకు అలవాటు పడ్డాడు. పొలాల వద్ద ఉన్న బోర్లకు సంబంధించిన వైర్లు, ఇతర వస్తువులను చోరీ చేసి అమ్ముకొని జీవనం సాగిస్తున్నాడు. గతంలో చాలాసార్లు మంబాపూర్, గుమ్మడిదల, బొంతపల్లి గ్రామాల్లోని పంట పొలాల వద్ద చోరీ చేస్తూ రైతులకు దొరకడంతో చితకబాది పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా మార్పు రాలేదు. ఆదివారం తెల్లవారుజామున గుమ్మడిదల సమీపంలోని పొలాల వద్ద వైర్లు చోరీ చేయడాన్ని రైతులు గుర్తించి పట్టుకొని దాడి చేశారు. ఉదయం గ్రామంలో పంచాయతీ పెట్టాలని మల్లేశంను రైతు సంఘం భవనం వద్దకు తీసుకువచ్చి తాడుతో కట్టి పడేశారు. అప్పటికే తీవ్రంగా గాయపడ్డ మల్లేశం కొద్ది సేపటికి మృతి చెందాడు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పటాన్‌చెరు డీఎస్పీ భీంరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రామయ్య తలంబ్రాలు
గంటకు 1,500 ప్యాకెట్లు

- గతంలో చేతితో ప్యాకెట్ల తయారీ
- ఇప్పుడు అందుబాటులోకి ప్రత్యేక యంత్రాలు
- వేగంగా ప్యాకెట్లు సిద్ధం.. రవాణా సులభం
- ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే పోస్టల్ శాఖ, ఆర్టీసీ కార్గోల ద్వారా డెలివరీ

భద్రాచలం: భద్రాద్రి సీతారాముల కల్యాణ తలంబ్రాలు సిద్ధమవుతున్నాయి. భద్రాచలంలో కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులకు పంచడంతోపాటు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకునేవారికి సరఫరా చేసేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కువ మంది భక్తులకు తలంబ్రాలు అందించేందుకు వీలుగా ప్రత్యేక యంత్రాల ద్వారా వాటిని ప్యాకింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ తలంబ్రాల తయారీ ప్రక్రియ వేగం పుంజుకుంది. రామయ్య కల్యాణ తలంబ్రాలు కావాలనుకునేవారు మీసేవ కేంద్రాల ద్వారా బుక్ చేసుకోవచ్చు.



ముత్యాల తలంబ్రాలను యంత్రంతో ప్యాక్ చేస్తున్న ఉద్యోగి

ఇన్నాళ్ల ఇబ్బందికి చెక్..

➤ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో ఏటా శ్రీసీతా రాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సీతారాములకు సమర్పించే ముత్యాల తలంబ్రాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. ఆ ముత్యాల తలంబ్రాలను ఇంటికి తీసుకెళితే మంచి జరుగుతుందన్న భావనతో చాలా మంది భక్తులు తీసుకుంటుంటారు. శ్రీరామనవమి రోజున భద్రాచలం వచ్చిన భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచితంగానే ముత్యాల తలంబ్రాలను అందిస్తారు. దూర ప్రాంతాల్లో ఉండి కల్యాణోత్సవానికి హాజరు కాలేని వారితో పాటు బంధువులు, స్నేహితులకు అందజేసేందుకు కావాలనుకునే భక్తుల కోసం దేవస్థానం రెండు ముత్యాలతో కూడిన తలంబ్రాలను విక్రయిస్తోంది. గతంలో ఈ తలంబ్రాలను స్వచ్ఛంద సంస్థ సభ్యులతో ప్యాకింగ్ చేయించేవారు. దీనితో చాలా సమయం పట్టడంతోపాటు ఆ ప్యాకెట్లు రవాణాలో చిరిగిపోయేవి. ఈ క్రమంలోనే వేగంగా ప్యాకింగ్ చేయడం, రవాణాలో దెబ్బతినకుండా ఉండేలా దేవస్థానం అధికారులు ప్యాకింగ్ యంత్రాలపై దృష్టిపెట్టారు.

దాతల చేయూతతో యంత్రాలు..

➤ ముత్యాల తలంబ్రాలు, పులిహోర ప్రసాదం ప్యాకింగ్ యంత్రాల కోసం దేవస్థానం అధికారులు దాతలను సంప్రదించారు. తిరుపతి ఖాదీబండార్‌కు చెందిన కుమార్ కిట్టు యాజమాన్యం రూ.1.40 లక్షలతో తలంబ్రాల ప్యాకింగ్ యంత్రాన్ని, శశి విద్యాసంస్థల యాజమాన్యం రూ.1.50 లక్షల విలువైన ప్యాకింగ్ కవర్లను సమకూర్చాయి. ఇక రూ.1.45 లక్షల విలువైన పులిహోర ప్రసాదం ప్యాకింగ్ యంత్రాన్ని తులసి ఆస్పత్రి యజమాన్యం ఏజేఆర్ సేవా సంస్థ పేరుతో సమకూర్చింది.

గంటకు 1,500 ప్యాకెట్లు

➤ యంత్రంలో తలంబ్రాల నడుమ ముత్యాలు ఉంచి ఆన్ చేస్తే ఆటోమేటిక్‌గా ప్యాకెట్లు తయారై బయటికి వస్తాయి. ఈ యంత్రం ద్వారా నిమిషానికి 25 చొప్పున గంటకు 1,500 ప్యాకెట్లు సిద్ధమవుతున్నాయి. రోజు సుమారు 20 వేల వరకు ప్యాకెట్లు చేస్తున్నారు. ఈ ఏడాది సుమారు 2 లక్షల తలంబ్రాల ప్యాకెట్లను భక్తులకు అందుబాటులో ఉంచాలని అధికారులు నిర్ణయించారు. పులిహోర ప్యాకింగ్ యంత్రం ద్వారా గంటకు 1,400 వరకు ప్యాకెట్లు సిద్ధమవుతున్నాయి. ఇటీవలి వరకు రోజువారీగా విక్రయించే ప్రసాదాన్ని ప్యాక్ చేయాలంటే కార్మికులకు ఒకపూటంతా పట్టేదని.. ఇప్పుడు 2 గంటల్లోనే పని పూర్తవుతోందని అధికారులు చెప్పారు. పోస్టల్ శాఖ, ఆర్టీసీ కార్గో ద్వారా తలంబ్రాలను భక్తులకు చేరవేస్తున్నామని పేర్కొన్నారు.

ఇది 'ప్రకృతి వనం' అట!



పచ్చని ఆలోచనకు నీరుపోస్తే మొక్క అవుతుంది. దానికి పల్లెజనం సంకల్పం తోడైతే 'పల్లె ప్రకృతివనం'గా ఎదుగుతుంది. ఇదివరకే ఉన్న అటవీప్రాంతానికి 'పల్లె ప్రకృతి వనం'అని ఓ బోర్డు తగిలిస్తే అది అధికారులు, సిబ్బంది అలసత్వం అవుతుంది. సర్కారు లక్ష్యంపట్ల వారి నిర్లక్ష్యానికి నిదర్శనమవుతుంది. నేరడిగొండ మండలం వాగ్ధారి పంచాయతీ పరిధిలోని మాదాపూర్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఈ దృశ్యమే దానికి నిలువుటద్దంగా నిలిచింది. పచ్చని సంపదను పెంపొందించేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయకుండానే అటవీ ప్రాంతానికే 'పల్లె ప్రకృతీవనం'అనే బోర్డును తగిలించేసి రికార్డుల్లో నమోదు చేస్తుండటం గమనార్హం. – సాక్షి ఫొటోగ్రాఫర్– ఆదిలాబాద్



జింఖానా గ్రౌండ్లో ఆదివారం జడ్జెస్ 11, ప్రెసిడెంట్ 11 మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ లో జడ్జెస్ 11 విజయం సాధించింది. ఈ పోటీలను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ప్రారంభించారు. జడ్జెస్ లెవెన్ కెప్టెన్ గా జస్టిస్ నవీన్ రావు, ప్రెసిడెంట్ లెవెన్ కెప్టెన్ గా అడ్వొకేట్ మల్లారెడ్డి వ్యవహరించారు.

43 ఏళ్లకి వచ్చావా సత్యంరెడ్డి

- ఇన్నేళ్ల తర్వాత ఇంటికి చేరిన మావోయిస్టు నేత
- ఆయన్ను చూసేందుకు పెద్ద ఎత్తున వచ్చిన జనం



సత్యంరెడ్డి

మిర్యాలగూడ: ఒకటి రెండేళ్లు కాదు.. ఏకంగా 43 ఏళ్ల పాటు సొంతింటికి దూరంగా ఉన్న ఓ మావోయిస్టు నేత ఇన్నేళ్లకి చేరుకున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం సుబ్బారెడ్డిగూడెం గ్రామానికి చెందిన గజ్జల సత్యంరెడ్డి అలియాస్ గోపన్న పీపుల్స్‌వార్ ఉద్యమంలో సుదీర్ఘంగా పనిచేశారు. హైదరాబాద్ ఏవీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న క్రమంలో విప్లవోద్యమానికి ఆకర్షితుడై 1980లో పీపుల్స్ వార్ పార్టీలో చేరిన ఆయన దండకారణ్యంలో మావోయిస్ట్ పార్టీ విస్తరణకు కీలకంగా పని చేశారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా కూడా వ్యవహరించిన సత్యంరెడ్డి 26 ఏళ్లు అడవిలో ఉండి.. 17 ఏళ్లు జైలు జీవితం గడిపారు. పోలీసులు మోపిన అన్ని కేసులనూ కోర్టులు కొట్టివేయడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్ జైలు నుంచి విడుదలయ్యారు. అక్కడి నుంచి తన తమ్ముడితో కలిసి సొంత ఊరైన సుబ్బారెడ్డిగూడెం గ్రామానికి ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. సత్యంరెడ్డి వచ్చిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. అజ్ఞాతంలో ఉండగానే సత్యంరెడ్డి తోటి పార్టీ సభ్యురాలిని వివాహం చేసుకోగా ఆమె ఎన్‌కౌంటర్‌లో మరణించింది. అనంతరం ద్వితీయ వివాహం చేసుకున్నప్పటికీ ఆమె వివరాలు తెలియరాలేదు. సత్యంరెడ్డి తాను పుట్టి పెరిగిన ఊరిని సందర్శించి.. చిన్నప్పుడు తాను తిరిగిన ప్రాంతాలను గ్రామస్తులతో కలిసి గుర్తుచేసుకున్నారు. తాను జైల్లో ఉన్న సమయంలోనే తల్లిదండ్రులు మరణించడంతో వారిని కడసారి చూసుకోలేకపోయానని ఆవేదన చెందారు. అయితే తన అన్నను, తమ్ముడిని, వారి కుటుంబసభ్యులను తిరిగి కలిసినందుకు సంతోషం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను కలుసుకున్న వేళ భావోద్వేగపూరిత వాతావరణంలో కంటతడిపెట్టారు. ఇక మీదట తన జనజీవన స్రవంతిలోనే కొనసాగుతానని, తిరిగి మావోయిస్ట్ పార్టీలోకి వెళ్లేది లేదని సత్యంరెడ్డి చెప్పారు.



సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను వసూలుకు సిబ్బంది వినూత్న మార్గం ఎంచుకున్నారు. గడువు సమీపిస్తుండటంతోపాటు 'ఇంటింటికీ తిరుగుతూ దండం పెడుతూ.. పన్ను చెల్లించండి.. మున్సిపాలిటీ అభివృద్ధికి పాటుపడండి'అంటూ యజమానులను వేడుకుంటున్నారు. – తిరుమలగిరి

విద్యుత్ చార్జీలు పెంచడమంటే ప్రజలను మోసం చేయడమే



సూర్యాపేట: పీక్ లోడ్ అవర్స్‌లో ప్రతి యూనిట్‌కు ఇరవై శాతం అదనపు చార్జీలు వసూలు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి మండి పడ్డారు. ఆదివారం సూర్యాపేటలో మీడియాతో ఆయన మాట్లాడారు. విద్యుత్ చార్జీలు పెంచడమంటే దేశ ఆర్థికాభివృద్ధికి ద్రోహం చేయడమేనని వ్యాఖ్యానించారు. కేంద్ర నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజలపై భారం వేసే ఏ చర్యలకైనా సీఎం కేసీఆర్ మద్దతు ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే ట్రూ అప్ చార్జీల భారం రాష్ట్రం మోస్తోందని వివరించారు. 2014కు ముందు ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్యుత్ ఇస్తామన్న కేంద్రం, నేడు సాధారణ ప్రజలకు విద్యుత్‌ను దూరం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ కేంద్రం చెప్పిన విధంగా మీటర్లు బిగించేందుకు ఒప్పుకోలేదని చెప్పారు.

రైతులకు అండగా ఉంటాం

- లక్షలోపు ఉన్న పేద రైతుల రుణాలను బ్యాంకులకు చెల్లిస్తాం
- ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్‌గౌడ్



సాయం పొందిన రైతుల కుటుంబాలతో ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్, డైరెక్టర్లు

సిద్దిపేట అర్బన్: కౌలు రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన పనులను తాను చేస్తున్నానని ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్ గౌడ్ అన్నారు. దసరా నుంచి సిద్దిపేట నియోజకవర్గంలో పేద రైతులు బ్యాంకులో తీసుకున్న లక్ష లోపు రుణాలను తమ ఫౌండేషన్ తరపున దశల వారీగా చెల్లిస్తామని తెలిపారు. ఆదివారం ఆయన సిద్దిపేట శివారులోని అంజయ్య గార్డెన్‌లో 150 మంది రైతులు, కౌలు రైతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున సాయం అందించారు. ఈ కార్యక్రమంలో చక్రధర్ మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులను పట్టించుకోవడం లేదని, సిద్దిపేట రైతులకు సేవ చేయడానికి వస్తే ఇక్కడి నాయకులు ఓర్వలేక తనపై అక్రమ కేసు పెడుతున్నారని ఆరోపించారు. ఎన్ని కేసులు పెట్టినా రైతులకు సేవ చేయడం మాత్రం ఆపనని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ప్రతీ మహిళకు చక్రధర్ స్త్రీ అభ్యుదయ నిధి ద్వారా ప్రతీ నెల రూ. 500 అందేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రైతులకు తమ ఫౌండేషన్ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు.

4న హైదరాబాద్ ముట్టడి

ఎమ్మార్పీఎస్ పిలుపు




పాదయాత్ర చేస్తున్న గోవిందు నరేశ్

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ డిమాండ్ సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఏప్రిల్ 4న హైదరాబాద్ ముట్టడికి పిలుపునిచ్చింది. బీజేపీ అధికారంలోకి రాక ముందు వర్గీకరణకు పూర్తి మద్దతు ఇచ్చి... ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఈ అంశాన్ని ఏమాత్రం పట్టించుకోకపోవడం పట్ల ఎమ్మార్పీఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ మాదిగలను మోసం చేసిందని, వచ్చే ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా మాదిగలు వేయరని స్పష్టం చేసింది. రిజర్వేషన్ల హక్కుల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా మాదిగల సంగ్రామ యాత్ర చేపట్టినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ తెలిపారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టే వరకు పోరాటం ఆగదన్నారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 4న హైదరాబాద్ ముట్టడి చేపడుతున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్గీకరణను డిమాండ్‌చేస్తూ నరేశ్ మాదిగ మార్చి 2న ప్రారంభించిన మాదిగల సంగ్రామ యాత్ర ఆదివారం మెదక్ జిల్లాలోకి ప్రవేశించింది. ఈ యాత్ర ఏప్రిల్ 4న ముగియనుంది.

బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాకు ముగ్గురు తెలుగు న్యాయవాదుల ఎన్నిక

సాక్షి, న్యూఢిల్లీ: ది బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(బీఏఐ) కమిటీకి జరిగిన ఎన్నికల్లో ముగ్గురు తెలుగు న్యాయవాదులు గెలుపొందారు. 2023–25 కాలానికి గాను ఈ నెల 25న ఎన్నికలు నిర్వహించినట్లు ఎలక్షన్ సబ్ కమిటీ కన్వీనర్ అమర్‌జిత్ తెలిపారు. బీఏఐ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది అమర్‌జిత్ సింగ్ చందోక్, ఉపాధ్యక్షులుగా సీనియర్ న్యాయవాదులు శ్యామ్ దివాన్, సీఎస్ వైద్యనాథన్, జైదీప్ గుప్తా, సంయుక్త ప్రధానకార్యదర్శిగా తన్నీరు శ్రీనివాస్ తదితరులు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులుగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఆర్.శ్రీనివాసు నాయుడు, తెలంగాణ నుంచి నోముల శ్రీనివాస్ ఎన్నికయ్యారని పేర్కొన్నారు.



భువనగిరి పట్టణం విద్యుత్‌కాంతుల్లో వెలిగిపోతోంది. ఓవైపు సాయంత్రం సమయంలో ఆకాశంలో ఎరుపు, నీలి రంగు కనువిందు చేస్తుండగా.. మరో వైపు విద్యుత్ కాంతుల నడుమ కాంతులీనుతోంది. పట్టణం నడిబొడ్డున భువనగిరి ఖిల్లా నలువురంగులో ఉన్న దృశ్యాలు ఆదివారం ప్రజలకు కనువిందు చేశాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, యాదాద్రిభువనగిరి

నేటి నుంచే ఆర్టీసీ స్లీపర్ బస్సులు

- లహరి పేరుతో బస్సులను రోడ్డెక్కిస్తున్న సంస్థ
- బెంగళూరు, చెన్నై, హుబ్లీ, తిరుపతి, విశాఖపట్నంలకు సేవలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీ తొలిసారి ప్రీమియం కేటగిరీ స్లీపర్ బస్సులను ప్రారంభిస్తోంది. లహరి పేరుతో రోడ్డెక్కుతున్న ఈ బస్సుల్లో తొలుత 10 సర్వీసులను సోమవారం ఉదయం ప్రారంభిస్తోంది. మరో ఆరు బస్సులను రెండు మూడు రోజుల్లో నడపనున్నారు. ఇప్పటికే అద్దె ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తుల నుంచి తీసుకున్న సర్వీసులతో పాటు సొంతంగా కొన్న బస్సులను ప్రారంభిస్తోంది. టెండర్ ద్వారా అశోక్ లేలాండ్ కంపెనీ నుంచి ఈ బస్సులను కొన్నారు. ఈ స్లీపర్ బస్సులను తొలుత హైదరాబాద్ నుంచి ఐదు నగరాలకు తిప్పనున్నారు. మియాపూర్, ఎంజీబీఎస్‌ల నుంచి బెంగళూరుకు, హుబ్లీకి, బీహెచ్ఈఎల్, ఎంజీబీఎస్‌ల నుంచి విశాఖపట్నం, తిరుపతి, చెన్నైలకు నడుపుతారు. గరుడ ప్లస్ కంటే ఈ బస్సుల్లో టికెట్ ధర 30 శాతం వరకు ఎక్కువగా ఉండనుంది. రైలు మూడో ఏసీ శ్రేణి టికెట్ ధరకు ఇంచుమించు సమంగా వీటి టికెట్ ధరలను ఖరారు చేశారు. లహరి స్లీపర్ బస్సుల్లో 30 బెర్తులు ఉంటాయి. మంచినీటి సీసా హోల్డర్, మొబైల్ చార్జింగ్ సాకెట్‌తోపాటు ఉచిత వైఫై వసతి ఉంటుంది. ఈ బస్సుల్లో మూడు సీసీ కెమెరాలు, పానిక్ బటన్, రేర్ వ్యూ కెమెరా, ఎల్ఈడీ సూచిక బోర్డులుంటాయి.

ప్రారంభోత్సవ ఆఫర్..

ఈ కొత్త సర్వీసులను ప్రారంభిస్తున్న సందర్భంగా తొలుత కొన్ని రోజుల పాటు టికెట్ ధరల్లో తగ్గింపును అమలు చేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని ప్రాంతాలకు వెళ్లే సర్వీసుల్లో 20 శాతం, ఇతర రూట్లలో తిరిగే బస్సుల్లో 15 శాతం మేర టికెట్ ధరలను తగ్గించనున్నారు.

డైనమిక్ ఫేర్ విధానం ప్రారంభం..

డైనమిక్ టికెట్ ఫేర్ విధానాన్ని కూడా సోమవారం నుంచే ఆర్టీసీ ప్రారంభిస్తోంది. తొలిసారి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తరహాలో డిమాండ్ ఆధారంగా టికెట్ ధరలను సవరిస్తారు. డిమాండ్ ఎక్కువగా ఉండే సమయాల్లో టికెట్ ధర ఎక్కువగా, డిమాండ్ లేని సమయాల్లో తక్కువగా ఉంటుంది. గరిష్టంగా 25 శాతానికి మించకుండా పెంచుతారు, కనిష్టంగా 20 శాతానికి తగ్గకుండా ధరలు తగ్గిస్తారు. తనంతట తానుగా పరిస్థితి ఆధారంగా సిస్టమే ధరలను మార్చుకునే సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేశారు. ఇందుకు ఓ ప్రైవేటు సాఫ్ట్‌వేర్ డెవలపింగ్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. దాదాపు నెల రోజుల కసరత్తు తర్వాత ఆ విధానం సిద్ధం కావటంతో సోమవారం నుంచి దాన్ని ప్రారంభిస్తున్నారు. దీంతో దూరప్రాంతాలకు వెళ్లే సర్వీసుల్లో టికెట్ ధరలు ఇక గంటగంటకు మారనున్నాయి. లహరి స్లీపర్ సర్వీసుల్లో కూడా ఇదే విధానం అమలుకానుంది.

రూట్	టికెట్ ధర
మియాపూర్–బెంగళూరు	రూ.1630
ఎంజీబీఎస్–బెంగళూరు	రూ.1580
మియాపూర్–హుబ్లీ	రూ.1510
ఎంజీబీఎస్–హుబ్లీ	రూ.1460
బీహెచ్ఈఎల్–విశాఖపట్నం	రూ.1920
ఎంజీబీఎస్–విశాఖపట్నం	రూ.1860
బీహెచ్ఈఎల్–తిరుపతి	రూ.1750
ఎంజీబీఎస్–తిరుపతి	రూ.1690
బీహెచ్ఈఎల్–చెన్నై	రూ.1910
ఎంజీబీఎస్–చెన్నై	రూ.1860



క్లుప్తంగా..

ఆ కత్తి.. ఒక కూడలి !



రామ్‌పూర్ (యూపీ): 1980 నాటి బాలీవుడ్ సినిమాల్లో రామ్‌పూర్ కత్తి అంటే ప్రేక్షకులకి ఒక పిడిబాకే. ఆ కత్తితో చేసే విన్యాసాలు హడల్ పుట్టించేవి. ఉత్తరప్రదేశ్‌లోని రామ్‌పూర్ ఒకప్పుడు కత్తులకు, కటార్లకు బాగా ఫేమస్. అత్యంత నాణ్యమైన కత్తులు లభించేవి. ఫోల్డ బుల్ కత్తులు ఎవరికైనా కావాలంటే రామ్‌పూర్ వెళ్లవలసిందే. ఎప్పుడైతే చైనా మార్కెట్ భారత్‌ను ముంచేసి తక్కువ ధరకే చాకులు లభ్యమయ్యాయో ఈ రామ్‌పూర్ చాకుల్ని జనం కొనడం మానేశారు. అయినప్పటికీ దానికుండే క్రేజ్ దానికి ఉంది. అందుకే రామ్‌పూర్ అధికారులు నైనిటాల్ నుంచి రామ్‌పూర్‌కు వచ్చే మార్గంలో ఒక కూడలిలో ఈ కత్తిని ఏర్పాటు చేశారు. దానికి రామ్‌పూర్ చాకు చౌక్ అని పెట్టారు. దాదాపుగా 20 అడుగుల ఎత్తైన రామ్‌పూర్ కత్తి ఇప్పుడు ఠీవీగా కనిపిస్తూ పర్యాటకుల్ని ఆకర్షిస్తోంది. ఒకప్పుడు ఈ కత్తి పేరు చెబితే హడలిపోయేవారే ఇప్పుడు దానినొక కళాకృతి కింద చూడడం విశేషం.

గర్ల్ ఫ్రెండ్‌కి సాయం చేయబోయి పాపం జైలుపాలయ్యాడు

ఫ్లోరిడా: అమెరికాలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినమైన శిక్షలు ఎదుర్కోవాలి. తన గర్ల్‌ఫ్రెండ్‌ని సరైన సమయానికి ఇంటర్వ్యూకి తీసుకువెళ్లాలని గంటకి 160కి.మీ. వేగంతో కారు నడిపిన వ్యక్తి ఇప్పుడు కటకటాలు ఊచలు లెక్కపెడుతున్నాడు. ఫ్లోరిడాకు చెందిన జెవన్ పీర్ జాక్సన్ (22) గంటకి 65కి.మీ. వేగంతో మాత్రమే ప్రయాణించే జోన్‌లో నిబంధనల్ని బేఖాతర్ చేశాడు. ఏకంగా 160 కి.మీ. వేగంతో కారు నడిపాడు. మార్గం మధ్యలో కొన్ని వాహనాలను కూడా ఢీ కొట్టబోయి త్రుటిలో ప్రమాదాన్ని తప్పించుకున్నాడు. జాక్సన్ ఢీ కొట్టబోయిన ఒక వాహనంలో పోలీసు వాహనంతో పాటు ముగ్గురు చిన్నారులున్న మరో వాహనం ఉండడంతో అతని చుట్టూ ఉచ్చు బిగిసింది. ట్రాఫిక్ నిబంధనల్ని ఉల్లంఘించడమే కాకుండా, చిన్న పిల్లలకి హాని జరగబోయిందన్న కేసు పెట్టిన పోలీసులు జాక్సన్ డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేశారు. అరెస్ట్ చేసి జైలుకి తరలించారు.

వీకెండ్ కాపురాలు

పెళ్లంటే రెండు జీవితాల కలయిక. నిండు నూరేళ్ల సావాసం. ఎన్ని కష్టనష్టాలెదురైనా జీవితాంతం ఒకరి చేయి మరొకరు విడిచిపెట్టకూడదు. ఒకేచోట కలిసుంటేనే బంధం బలపడుతుంది...

ఇన్నాళ్లూ పెళ్లికి మనకి ఈ అర్థాలే తెలుసు...
కానీ... నేటి జనరేషన్ జెడ్ పెళ్లికి కొత్త భాష్యాలు చెబుతోంది. 'ఎవరి జీవితం వారిది. ఎవరి ఆర్థిక స్వాతంత్ర్యం వారిది. ఎవరి వ్యక్తిత్వం వారిది. ఒకరి కోసం మరొకరు వాటిని వదులుకోనక్కర్లేదు. అందమైన జీవితాన్ని మూడు ముళ్లతో బంధించి జీవితాంతం రాజీ పడనక్కర్లేదు' వంటి ఆలోచనల నుంచి వీకెండ్ మ్యారేజెస్ కాన్సెప్టు పుట్టుకొచ్చింది. జపాన్లోనైతే ఇవి ట్రెండుగా మారాయి. భారత్‌లోనూ మెల్లిగా తెరపైకి వస్తున్నాయి...

-సాక్షి, నేషనల్ డెస్క్

పాశ్చాత్యదేశాల్లో నయా ట్రెండ్

వారంలో అయిదు రోజులు ఎవరికి వారు	మిగిలిన రెండు రోజులు ఒకరికొకరు	పెళ్లికి జనరేషన్ జెడ్ కొత్త భాష్యం



వీకెండ్ మ్యారేజెస్ అంటే..?

ఇవాళ రేపు ఆడ, మగ ఇద్దరూ సమానమే. ఒకరు తక్కువ మరొకరు ఎక్కువ అని లేదు. భర్త బయట పని చేసి డబ్బు సంపాదిస్తే, భార్య ఇంటిని చక్కదిద్దుకుంటూ గృహిణి జీవితం గడిపే రోజులు పోయాయి. మగవాళ్లతో సమానంగా ఆడవాళ్లు సంపాదిస్తున్నారు. తమ వ్యక్తిత్వాన్ని వదులుకోవడానికి, జీవితంలో సర్దుకుపోవడానికి ససేమిరా అంటున్నారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఊపిరి పీల్చుకోవడానికి కూడా వీల్లేని బిజీ లైఫ్‌లో గడిపేస్తున్నారు. అందుకే పెళ్లి చేసుకొని ఒకే చోట ఉండడం కంటే వీకెండ్స్‌లో కలిసి ఉండాలని ముందే ఒక అవగాహన కుదుర్చుకుంటున్నారు. వారంలో అయిదు రోజులు ఎవరి జీవితం వారిది, మిగిలిన రెండు రోజులు ఒకరికొకరుగా కలిసి జీవిస్తారు. కష్టసుఖాలు కలబోసుకుంటారు. గుండెల నిండా గూడు కట్టుకున్న ప్రేమని పంచుకుంటూ రెండు రోజులు రెండు క్షణాల్లా గడిపేస్తారు.

వీకెండ్ కాపురాలకు కారణాలు

- ఆఫీసులో పని ఒత్తిడితో ఆడ, మగ లైఫ్‌స్టైల్ వేర్వేరుగా ఉంటున్నాయి. ఒకరికి ఉదయం షిఫ్ట్ అయితే మరొకరికి రాత్రి షిఫ్ట్ ఉంటుంది. ఒకరి ఆఫీసు ఊరికి ఒక మూల ఉంటే, మరొకరిది మరో మూల ఉంటుంది. దీంతో ఒకేచోట కలిసుండే పరిస్థితి ఉండడం లేదు
- పెళ్లి చేసుకున్నా ఇద్దరిలో ఎవరికి వారే తాము పుట్టి పెరిగిన వాతావరణాన్ని వదులుకోవడానికి సిద్ధపడడం లేదు.
- ముఖపరిచయం కూడా లేకుండా పెళ్లి చూపుల్లోనే ఒకరినొకరు చూసుకునే జంటలు ఒకరితో ఒకరు ఎంతవరకు జెల్ అవగలరో తెలుసుకోలేకపోతున్నారు. అందుకే ముందుగా వీకెండ్స్‌లో కలిసుంటే ఒకరినొకరు అర్థం చేసుకోవచ్చునని భావిస్తున్నారు.
- భార్యాభర్తలకి ఒకరి నుంచి మరొకరికి ఎక్స్‌పెక్టేషన్‌లు ఉంటాయి. ఆఫీసు నుంచి అలిసిపోయి ఇంటికి వచ్చిన వారికి భాగస్వామి తమకి అనుకూలంగా లేకపోతే చిర్రెత్తుకొచ్చి దెబ్బలాటలకి దారి తీస్తాయి. అదే వీకెండ్స్‌లో మాత్రమే కలిస్తే, కలిసుండేది కాస్త సమయమైనా హాయిగా గడుపుదామని అనిపిస్తుంది. మళ్లీ వారం వరకు చూడలేమన్న ఫీల్‌తో ఒకరిపై మరొకరికి ప్రేమ పొంగుకొస్తుంది. సర్‌ప్రైజ్‌లు, రొమాన్స్‌లు కొత్తగా వింతగా అనిపించి మానసికంగా ఎనలేని సంతృప్తి ఉంటుంది.
- ఆర్థికంగా ఎవరి స్వాతంత్ర్యం వారికుంటుంది. ఎవరికి వారు వాళ్ల ఇళ్లల్లో ఉంటారు కాబట్టి డబ్బుల్ని ఆదా చేసుకునే అవకాశం ఉంటుంది.
- అబ్బాయిలు, అమ్మాయిలు అన్న తేడా లేకుండా ఈ మధ్య అందరూ తమకి మాత్రమే సొంతమైన ఒక స్పేస్ కావాలని బలంగా కోరుకుంటున్నారు. వీకెండ్ కాపురాల్లో ఎవరికి కావల్సినంత స్పేస్ వారికి దొరుకుతుంది.

భారత్‌లో కుదిరే పనేనా..?

వీకెండ్ పెళ్లి పేరుతో వారానికోసారి కలుస్తామంటే అంగీకరించే సామాజిక పరిస్థితులు భారత్‌లో లేవు. ముంబైలాంటి నగరాల్లో కొందరు ప్రయోగాత్మకంగా వీకెండ్ కాపురాలు మొదలుపెట్టారు. ఆఫీసులు చెరో మూల ఉన్నప్పుడు ఇలా వీకెండ్స్‌లో కలవడమే బెటర్ అని నిర్ణయించుకునే జంటలు అక్కడక్కడా కనిపిస్తున్నాయి. రోజంతా ట్రాఫిక్ జామ్‌లో పడి ఏ రాత్రికో ఉసూరంటూ ఇంటికి చేరడానికి బదులుగా ఎవరిళ్లలో వారుంటూ వీకెండ్ వరకు ఎదురు చూడడమే మంచిదన్న అభిప్రాయానికి నేటితరం వస్తున్నా కుటుంబాలైతే అంగీకరించడం లేదు. మన దేశంలో పెళ్లంటే రెండు కుటుంబాల కలయిక. వడం. కనుకొన్ని కట్టుబాట్లు, సంప్రదాయాలు తప్పనిసరి. పెళ్లి చేసుకుంటే ఒక కమిట్‌మెంట్‌తో ఉండాలి. జపాన్, చైనా వంటి దేశాల్లో పెళ్లిళ్లు చేసుకోవడానికి, పిల్లలు కనడానికి యువతరం విముఖంగా ఉంటోంది. ఏళ్ల తరబడి పిల్లల్ని కనొద్దని ప్రభుత్వం పెట్టిన ఆంక్షలే శాపంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో పసిపాపల బోసినవ్వులు కనిపించి ఏళ్లవుతున్నాయి. అందుకే పెళ్లి చేసుకొని వారంలో రెండు రోజులైనా కలిసుంటే చాలన్న స్థితి వచ్చింది. మన దగ్గర ఆలా కాదు. ముఖ్యంగా పిల్లలు పుడితే ఏం చేస్తారు ? తల్లి తండ్రి ఇద్దరి ప్రేమ మధ్య పెరగాల్సిన పిల్లల్ని కూడా వారానికొకరని పంచుకోవడం అసాధ్యం. వ్యక్తిత్వం, ఆర్థిక స్వాతంత్ర్యం పేరుతో వీకెండ్ కాపురాలు చేయాలని యువతరం భావించినా పెద్దలు వారిని అడ్డుకుంటున్నారు. అందుకే భారత దేశంలోని కుటుంబ వ్యవస్థ ఇప్పటికీ ప్రపంచానికి మార్గదర్శకంగా ఉంటోంది.

> "భారత్‌లో పెళ్లికి ఒక పవిత్రత ఉంది. దాన్నో ప్రయోగంగా మార్చాలని ఎవరూ అనుకోరు. ఇద్దరూ వారంలో రెండు రోజులు మాత్రమే కలిసుంటే వారిద్దరి మధ్య పరస్పర నమ్మకం, అవగాహన ఏర్పడడం కష్టం. భాగస్వామిలోనున్న లోపాలను కూడా ప్రేమించగలిగినప్పుడే ఆ వివాహం పదికాలాలు పచ్చగా ఉంటుంది. కానీ లోపాలను కప్పిపుచ్చుకుంటూ మనలో ఉన్న మంచిని మాత్రమే అవతలి వ్యక్తికి చూపించాలనుకున్నప్పుడు పెళ్లి అన్న పదానికే అర్థం లేకుండా పోతుంది"
>
> - శ్రేయా కౌలమ్, సైకాలజిస్ట్

మోదీ పిరికిపంద

అధికారం వెనుక దాక్కుంటున్నాడు: ప్రియాంక

రాహుల్‌ను అవమానించిన వారిపై కేసులేవీ?	దేశం కోసం రక్తం ధార పోసిన కుటుంబం మాది	ఇప్పటికీ అవమానిస్తూనే ఉన్నారని ఆవేదన	దేశవ్యాప్తంగా కాంగ్రెస్ 'సంకల్ప్ సత్యాగ్రహం'

న్యూఢిల్లీ: ''దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ప్రధాని రాజీవ్‌గాంధీ కుమారుడు రాహుల్. దేశ ఐక్యత కోసం వేలాది కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. అలాంటి వ్యక్తి దేశాన్ని ఎందుకు అవమానిస్తారు?'' అని ఆయన సోదరి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ ప్రశ్నించారు. ''బీజేపీ నేతలు రాహుల్‌ను మీరు జాఫర్ అంటూ ఎగతాళి చేశారు. జాతి వ్యతిరేక శక్తి అని నిందించారు. మా తల్లిని అవమానించారు. నెహ్రూ ఇంటిపేరు ఎందుకు పెట్టుకోలేదంటూ మమ్మల్ని ఎద్దేవా చేశారు. మా కుటుంబాన్ని, కశ్మీరీ పండిట్ల సంప్రదాయాన్ని ఆక్షేపించారు. అయినా వారిపై ఎందుకు కేసులు పెట్టలేదు? జైలు శిక్షలు విధించలేదు?'' అని ప్రశ్నించారు. తమ కుటుంబాన్ని ఇప్పటికీ అవమానిస్తూనే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ''హార్వర్డ్, కేంబ్రిడ్జ్ వంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో చదివిన రాహుల్‌ను 'పప్పు' అని ఎగతాళి చేస్తున్నారు. కానీ ఆయన పప్పు కాదని బీజేపీ నాయకులకు తెలిసిపోయింది. అందుకే పార్లమెంటు నుంచి బయటికి పంపించారు'' అంటూ దుయ్యబట్టారు. రాహుల్‌పై అనర్హత వేటుకు నిరసనగా కాంగ్రెస్ ఆదివారం దేశవ్యాప్తంగా 'సంకల్ప్ సత్యాగ్రహ' దీక్షలు చేపట్టింది. ఢిల్లీలో రాజ్‌ఘాట్ వద్ద దీక్షలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తదితర అగ్ర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీపై ప్రియాంక నిప్పులు చెరిగారు. ''మోదీ ఉత్త పిరికిపంద. అధికారం వెనుక దాక్కుంటున్నారు'' అంటూ ఎద్దేవా చేశారు. అహంకారపూరిత మోదీ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం నేర్పించడం తథ్యమన్నారు. అరాచక బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పాల్సిన సమయం వచ్చిందన్నారు. ''మా కుటుంబం ధారపోసిన రక్తం దేశ ప్రజాస్వామ్యానికి ఊతమిచ్చింది. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేనికైనా సిద్ధంగా ఉన్నాం'' అని చెప్పారు. ఇకపై తాము మౌనంగా ఉండే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

'మోదీ'లను విమర్శిస్తే నొప్పెందుకు: ఖర్గే

''ఒక వ్యక్తిని కాపాడడానికి మొత్తం ప్రభుత్వం, కేబినెట్ మంత్రులు, ఎంపీలు ప్రయత్నిస్తున్నారు. అసలు అదానీ ఎవరు? ప్రభుత్వం ఆయనకు ఎందుకు అండగా ఉంటోందో చెప్పాలి'' అని ప్రియాంక నిలదీశారు. ''ప్రజల హక్కుల కోసం రాహుల్ పోరాడుతున్నారు. జోడో యాత్రలో ఆయన వెంట లక్షల మంది నడిచారు'' అన్నారు. అక్రమాలకు పాల్పడి విదేశాలకు పరారైన నీరవ్ మోదీ, లలిత్ మోదీలను విమర్శిస్తే బీజేపీ ప్రభుత్వానికి నొప్పి ఎందుకని ఖర్గే ప్రశ్నించారు.



ఢిల్లీలో కాంగ్రెస్ నిరసన ర్యాలీ (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న ప్రియాంక

'అనర్హత వేటు పడిన ఎంపీ'

ట్విట్టర్ ఖాతాను అప్‌డేట్ చేసిన రాహుల్

లోక్‌సభ సభ్యుడిగా తనపై అనర్హత వేటు పడిన నేపథ్యంలో రాహుల్ ఆదివారం తన ట్విట్టర్ ఖాతాను అప్‌డేట్ చేశారు. బయోడేటాను 'అనర్హత వేటుపడిన ఎంపీ'గా మార్చారు. తన అధికారిక వయనాడ్ ట్విట్టర్ ఖాతాలోనూ 'డిస్‌క్వాలిఫైడ్ ఎంపీ' అని రాశారు.

సత్యాగ్రహం పేరిట కాంగ్రెస్ దీక్ష చేయడం సిగ్గుచేటని బీజేపీ దుయ్యబట్టింది. దానికి ఆ అధికారమే లేదని బీజేపీ నేత సుధాంశు త్రివేది అన్నారు.

కృత్రిమ ఉపగ్రహ కాంతితో భూమికి ముప్పు!

జీవుల అలవాట్లు, ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం



ఆధునిక సాంకేతిక యుగంలో మనుషుల మనుగడ కృత్రిమ ఉపగ్రహాల (శాటిలైట్లు)పై ఆధారపడి ఉందంటే అతిశయోక్తి కాదు. అన్ని రంగాల్లోనూ వీటి అవసరం పెరిగిపోతోంది. అయితే ఈ ఉపగ్రహాల కాంతి, విద్యుత్ బల్బుల వెలుగుతో పుడమికి పెద్ద ముప్పు వాటిల్లుతున్నట్లు ఇటలీ, చిలీ, గలీసియా శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో తేలింది. అధ్యయనం వివరాలను 'నేచర్ అస్ట్రానమీ' పత్రికలో ప్రచురించారు.

రానున్న రోజుల్లో విపరిణామాలే: భూగోళం చుట్టూ ప్రస్తుతం 8,000కు పైగా శాటిలైట్లు చక్కర్లు కొడుతున్నాయి. ఇవి భూమిపై ప్రతి అంగుళాన్ని కవర్ చేస్తున్నాయి. స్పేస్‌ఎక్స్ సంస్థ 3,000కు పైగా చిన్నపాటి ఇంటర్నెట్ శాటిలైట్లను ప్రయోగించింది. వన్‌వెబ్ కూడా వందలాది కృత్రిమ ఉపగ్రహాలను నింగిలోకి పంపింది. దేశాల మధ్య పోటీ నేపథ్యంలో భవిష్యత్తులోనూ వీటి సంఖ్య పెరగడమే తప్ప తగ్గే అవకాశాలు కనిపించడం లేదు. మరోవైపు విద్యుత్ లైట్ల అవసరం పెరుగుతూనే ఉంది. శాటిలైట్ల నుంచి వెలువడే కాంతి, కరెంటు దీపాల నుంచి కాంతి వల్ల భూమిపై ప్రకృతికి విఘాతం వాటిల్లుతున్నట్లు సైంటిస్టులు గుర్తించారు. వీటివల్ల రాత్రిపూట ఆకాశం స్పష్టంగా కనిపించడం లేదని తేల్చారు. ''అంతేగాక ఖగోళ శాస్త్రవేత్తల విధులకూ ఆటంకం కలుగుతోంది. అస్ట్రానామికల్ అబ్జర్వేటరీల పనితీరు మందగిస్తున్నట్లు తేలింది. ఈ కాంతి కాలుష్యం కారణంగా రాత్రివేళలో అనంతమైన విశ్వాన్ని కళ్లతో, పరికరాలతో స్పష్టంగా చూడగలిగే అవకాశం తగ్గుతోంది. అంతేగాక భూమిపై జీవుల అలవాట్లలో, ఆరోగ్యంలో ప్రతికూల మార్పులు వస్తున్నాయి'' అని వెల్లడించారు. దీనికి అడ్డుకట్ట వేసి సహజ ప్రకృతిని పరిరక్షించుకొనే దిశగా దృష్టి పెట్టాలని సూచించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

పరిష్కారం ఏమిటి?

కాంతి కాలుష్యానికి ఇప్పటికిప్పుడు పూర్తిస్థాయి పరిష్కార మార్గం లేదని నిపుణులు అంటున్నారు. దాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టడం మేలు. ''శాటిలైట్లలో బ్రైట్‌నెస్ తగ్గించాలి. టెలిస్కోప్ పరికరాల్లోని షట్టర్లను కాసేపు మూసేయడం ద్వారా కాంతి తీవ్రతను తగ్గించవచ్చు'' అని సూచిస్తున్నారు. కృత్రిమ ఉపగ్రహాలతో కాంతి కాలుష్యమే గాక మరెన్నో సమస్యలున్నాయి. కాలం తీరిన శాటిలైట్లు అంతరిక్షంలోనే వ్యర్థాలుగా పోగుపడుతున్నాయి. అంతరిక్ష కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. పైగా వీటినుంచి ప్రమాదకర విషవాయువులు వెలువడుతుంటాయి. ఆర్బిటాల్ ట్రాఫిక్ మరో పెను సమస్య.

మళ్లీ పేట్రేగిపోయిన ఖలిస్తానీ మూకలు

అమెరికాలో భారత ఎంబసీపై దాడికి విఫలయత్నం



న్యూఢిల్లీ/వాషింగ్టన్: ఖలిస్తానీ మూకలు మళ్లీ పేట్రేగాయి. ఈసారి అమెరికాలో వాషింగ్టన్‌లోని భారత దౌత్య కార్యాలయాన్ని లక్ష్యం చేసుకున్నాయి. దానిపై దాడికి ఖలిస్తానీ మద్దతుదారులు చేసిన యత్నాన్ని సీక్రెట్ సర్వీస్ పోలీసులు విఫలం చేశారు. ఎంబసీ ఎదుట వారు హింసను ప్రేరేపించేలా ప్రసంగించారు. ఆ సమయంలో కార్యాలయంలో లేని దౌత్యాధికారి తరన్‌జిత్ సంధును బహిరంగంగానే బెదిరించారు! ఎంబసీ కిటికీలు, అద్దాలు పగులగొట్టేందుకు కర్రలను తెచ్చిపెట్టుకున్నారు. నిరసనలను కవర్ చేస్తున్న పీటీఐ ప్రతినిధినీ దూషించారు. ఆయన్ను నెట్టేస్తూ, ఖలిస్తానీ జెండా కర్రలతో కొట్టేందుకు ప్రయత్నించారు. దాంతో ఆయన పోలీసులకు ఫోన్ చేశారు. సీక్రెట్ సర్వీస్, స్థానిక పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు. త్రివర్ణ పతాకమున్న పోల్‌ను విరగ్గొట్టేందుకు చేసిన ప్రయత్నాలను వమ్ము చేశారు. ఈ ఘటనను భారత దౌత్య కార్యాలయం తీవ్రంగా ఖండించింది. శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత్ కాన్సులేట్, లండన్‌లోని భారత హైకమిషన్ వద్ద కూడా ఖలిస్తానీ మూకలు గొడవలకు దిగడం తెలిసిందే. కెనడాలోని తమ దౌత్య కార్యాలయాలు, కాన్సులేట్లపై తీవ్రవాద, వేర్పాటువాద శక్తుల దాడులపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. కెనడా హైకమిషనర్‌కు సమన్లు జారీ చేసింది.

అవయవదానానికి ముందుకు రండి: మోదీ

న్యూఢిల్లీ: అవయవదానానికి ముందుకు రావాలని ప్రజలను ప్రధాని నరేంద్ర మోదీ కోరారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెరగడం సంతృప్తి కలిగిస్తోందన్నారు. ఆదివారం ఆయన 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో మాట్లాడారు. 2013లో అవయవ దానాలు 5 వేల లోపే ఉండగా 2022లో 15వేలకు పెరగడం హర్షణీయమన్నారు. సౌర శక్తి వినియోగంలో దేశం దూసుకుపోతోందన్నారు. పలు రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతోందంటూ లోకో పైలట్ సురేఖా యాదవ్ పేరును ప్రస్తావించారు.

భోజ్‌పురి నటి ఆకాంక్ష దుబే ఆత్మహత్య



వారణాసి: ప్రముఖ భోజ్‌పురి నటి ఆకాంక్ష దుబే(25) ఆదివారం వారణాసిలోని ఓ హోటల్ గదిలో చనిపోయారు. యూపీలోని భదోహికి చెందిన ఆకాంక్ష ఓ సినిమా షూటింగ్ నిమిత్తం వారణాసి వచ్చారు. సార్‌నాథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో బస చేశారు. ఆదివారం ఉదయం ఆమె తన గది నుంచి బయటకు రాలేదు. దీంతో ఆమె సహచరుల సమక్షంలో హోటల్ సిబ్బంది గది తలుపులు తెరిచారు. గదిలోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించారు. ఆమె అప్పటికే చనిపోయారు. ''ముంబైలో ఉంటున్న ఆమె కుటుంబసభ్యులకు సమాచారం అందించాం. గదిలో ఎటువంటి సూసైడ్ నోట్ లభించలేదు'' అని పోలీసులు తెలిపారు.

బెలారస్‌లో అణ్వాయుధాలు: పుతిన్

మాస్కో: రష్యా తన వ్యూహాత్మక అణ్వాయుధాలను పొరుగున ఉన్న బెలారస్‌కు తరలించనుంది. ఈ మేరకు ఒప్పందం కుదిరిందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు. 1990ల తర్వాత రష్యా తన కీలక ఆయుధ సంపత్తిని దేశం వెలుపలికి తరలించడం ఇదే తొలిసారి! దీనిపై ఉక్రెయిన్ తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. ఐరాస అత్యవసరంగా సమావేశమై దీనిపై చర్చించాలని కోరింది.

కిస్కా కథ అలా ముగిసింది..!

ప్రపంచంలోనే అత్యంత ఒంటరి తిమింగలంగా పేరు	శాంక్చువరీలోనే 40 ఏళ్లు ఖైదు.. ఇటీవలే తుదిశ్వాస



ఒంటారియో: కిస్కా. ఓర్కా రకం కిల్లర్ వేల్. ప్రపంచంలోనే అత్యంత ఒంటరి తిమింగలం. దాదాపు 40 ఏళ్లపాటు నీళ్ల ట్యాంకులో ఒంటరిగా బతుకీడ్చింది. చోటు మార్చాలని జంతువుల హక్కుల సంఘాలు చేసిన ప్రయత్నాలు విఫలం కాగా, అనారోగ్యంతో ఇటీవలే కన్నుమూసింది. ఐస్‌ల్యాండ్ సమీపంలోని సముద్ర జలాల్లో ఏడేళ్ల వయస్సున్నప్పుడు ఈ కిల్లర్ వేల్ పట్టుబడింది. దీనిని ఒంటారియోలోని నయాగరా జలపాతం వద్ద ఉన్న మెరైన్‌ల్యాండ్ జూ పార్క్‌కు అమ్మేశారు. 40 ఏళ్ల పాటు కిస్కా ఓ నీళ్ల ట్యాంకుకే పరిమితమైపోయింది. ప్రపంచంలోనే అత్యంత ఒంటరి తిమింగలంగా ముద్రపడింది. ఇటీవలే సుమారు 47 ఏళ్ల వయస్సులో కిస్కా చనిపోయింది. 'కిస్కా మృతి పట్ల విచారిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఓర్కా రకం తిమింగలాలు బందీలుగా ఉన్నాయి. కెనడా ప్రభుత్వం నోవాస్కోటియాలో వందెకరాల్లో వేల్ శాంక్చువరీ ప్రాజెక్టు ఏర్పాటు పనుల్లో ఉంది. ఇది పూర్తయితే ట్యాంకుల్లో కన్నా స్వేచ్ఛగా, మెరుగైన సురక్షిత వాతావరణంలో పట్టుబడిన తిమింగలాలు, డాల్ఫిన్లను ఉంచడానికి అవకాశం ఏర్పడుతుంది'అని ఏనిమల్ జస్టిస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెమిల్లె లబ్చుక్ అన్నారు. తిమింగలాల్లో అత్యంత బలమైన ఈ ఓర్కాల ఆయుర్దాయం 50 నుంచి 90 ఏళ్లు.

బ్రిటన్ హిందువుల ఆరోగ్యం భేష్ !

లండన్: ఆరోగ్యమే మహాభాగ్యమని మన పెద్దలు అంటారు. దానికి తగ్గట్టుగానే ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో హిందువులకి మించిన వారు లేరని బ్రిటన్‌లోని ఒక సర్వేలో తేలింది. బ్రిటన్‌లో నివసించే హిందువులు అత్యంత ఆరోగ్యవంతులు , విద్యాధికులని తేలితే, సిక్కులందరికీ దాదాపుగా సొంతిల్లు ఉందని వెల్లడైంది. ఇంగ్లండ్, వేల్స్‌లోని జనగణన సందర్భంగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. యూకేలో ఆఫీస్ ఫర్ నేషనల్ స్టేటస్టిక్స్ (ఒఎన్ఎస్) ఈ జనగణన వివరాలను విడుదల చేసింది. ''2021లో మార్చిలో జరిపిన ఈ సర్వేలో హిందువుల్లో ఆరోగ్యంగా ఉన్నవారు 87.8% ఉంటే, మొత్తంగా జనాభాలో 82%మంది ఆరోగ్యంతో ఉన్నారు. ఇక ఉన్నత విద్యనభ్యసించిన హిందువులు 54.8% ఉంటే, మొత్తం బ్రిటన్ జనాభాలో 33.8% ఉన్నారు. ఇక సిక్కుల్లో 77.7% మంది సొంతిళ్లలో నివసిస్తున్నారు.ఉద్యోగాల్లేక అవస్తలు పడుతున్న వారిలో ముస్లింలు ఎక్కువ మంది ఉన్నారు. బ్రిటన్‌లో నివసిస్తున్న 16–64 ఏళ్ల మధ్య వయసున్న ముస్లింలలో 51% మందే ఉద్యోగాలు చేస్తున్నారు'' అని సర్వే నివేదిక వివరించింది.

ఇస్రో కీర్తి కిరీటంలో... మరో వాణిజ్య విజయం

- దిగ్విజయంగా వన్‌వెబ్ ఇండియా-2 ఉపగ్రహాల ప్రయోగం
- విజయవంతంగా కక్ష్యలోకి 36 సమాచార ఉపగ్రహాలు



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): ఇస్రో మరో అద్భుత వాణిజ్య విజయాన్ని సొంతం చేసుకుంది. మొత్తం 36 వన్‌వెబ్ ఇండియా–2 ఇంటర్నెట్ సమాచార ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించింది. శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి అత్యంత బరువైన ఎల్‌వీఎం3–ఎం3 బాహుబలి రాకెట్ వాటిని తీసుకుని ఆదివారం ఉదయం 9.00 గంటలకు నిప్పులు చిమ్ముతూ దూసుకెళ్లింది. బ్రిటన్‌కు చెందిన నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేట్ లిమిటెడ్, ఇండియన్ భారతి ఎంటర్‌ప్రైజెస్ సంయుక్తంగా రూపొందించిన 5,805 కిలోలు బరువున్న ఈ ఉపగ్రహాలను భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టింది. ఈ 36 ఉపగ్రహాలను 97 నిమిషాల వ్యవధిలో ఒక్కోసారి నాలుగేసి ఉపగ్రహాల చొప్పున 9 విడుతలుగా భూమికి అతి తక్కువ దూరంలో లోయర్ ఎర్త్ లియో అర్బిట్‌లోకి ప్రవేశపెట్టారు. అవన్నీ కక్ష్యలోకి చేరాయని, అంటార్కిటికా గ్రౌండ్‌స్టేషన్ నుంచి సిగ్నల్స్ అందాయని ఇస్రో ప్రకటించింది. వన్‌వెబ్ ఇండియా–1 పేరిట 2022 అక్టోబర్ 23న తొలి బ్యాచ్‌లో 36 ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించడం తెలిసిందే. తాజా ప్రయోగంతో మొత్తం 72 ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపారు.

ఇస్రో స్థాయి పెరిగింది: చైర్మన్ సోమనాథ్

ప్రయోగం విజయవంతం కాగానే మిషన్ కంట్రోల్ సెంటర్‌లో శాస్త్రవేత్తలు పరస్పరం ఆలింగనం చేసుకుని ఆనందం పంచుకున్నారు. రాకెట్‌లోని అన్ని దశలు అద్భుతంగా పనిచేసినట్టు ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ చెప్పారు. ''ఇది టీం వర్క్. ప్రపంచంలోనే అద్భుతమైన విజయంతో ఇస్రో కీర్తి ప్రతిష్టలను పెంచినందుకు సంతోషంగా ఉంది. ఈ ప్రయోగం చరిత్రాత్మకమైనది. దీనివల్ల ఇస్రో వాణిజ్యపరమైన ప్రయోగాల ప్రయోజనాలకు మరింత బలం చేకూరింది. ఇదే ఊపులో పీఎస్ఎల్‌వీ సీ55 రాకెట్ ద్వారా ఏప్రిల్‌లో సింగపూర్‌కు చెందిన ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నాం. ఈ ఏడాది చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1తో పాటు మరో నాలుగు ప్రయోగాలు చేసే అవకాశముంది'' అని చెప్పారు. వాణిజ్య ప్రయోగాలకు ఎల్‌వీఎం3 రాకెట్ ఎంతో ఉపయోగకారి అని న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ సీఎండీ డి.రాధాకృష్ణన్, మిషన్ డైరెక్టర్ ఎస్.మోహన్‌కుమార్ చెప్పారు.

ఆత్మనిర్భరతకు తార్కాణం

ప్రధాని మోదీ అభినందనలు

వన్‌వెబ్ ఇండియా–2 ప్రయోగం దిగ్విజయం కావడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వెలిబుచ్చారు. ఇస్రోకు అభినందనలు తెలిపారు. ''వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాల్లో అంతర్జాతీయంగా భారత్ పై చేయిని ఈ ప్రయోగం మరింత దృఢపరిచింది. ఆత్మనిర్భరత స్ఫూర్తిని ఎలుగెత్తి చాటింది'' అని ప్రశంసిస్తూ ట్వీట్ చేశారు.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 27 । మార్చి । 2023



మీ ఆరోగ్యం ఎలా ఉంది?

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల ఆరోగ్యం పట్ల ఆ సంస్థ జాగ్రత్తలు తీసుకుంటోంది. డిపోల్లో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద ఆరోగ్య కార్యకర్తల సేవలు సత్ఫలితాలనిస్తున్నాయి. -8లో




ఆదివాసీలపై దాడులు ఆపాలి

దండకారణ్యంలోని ఆదివాసీ గ్రామాలపై కేంద్ర ప్రభుత్వ వైమానిక దాడులను తక్షణమే నిలిపి వేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. -8లో

రాజకీయ అజాత శత్రువు బొమ్మగాని



రాజకీయ పార్టీలకు అతీతంగా గౌరవం పొందే నాయకుడు, అజాత శత్రువు బొమ్మగాని ధర్మ భిక్షం అని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. -8లో



న్యూస్‌రీల్

టీ హబ్‌ను సందర్శించిన వెస్టర్న్ ఆస్ట్రేలియా మంత్రి

మూడు ఒప్పందాలపై సంతకాలు



హఫీజ్‌పేట్: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌ను ఆదివారం వెస్టర్న్ ఆస్ట్రేలియా అత్యవసర సేవల మంత్రి స్టీఫెన్ డాసన్ సందర్శించారు. అధికారులతో సమావేశమై భవన నిర్మాణం, స్టార్టప్‌ల వివరాలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఇది భారతదేశం యొక్క మార్గదర్శక ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్, ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్‌గా గుర్తింపు పొందిందని టీహబ్ అధికారులు ఆయనకు వివరించారు. సైబర్ సెక్యూరిటీ పరిశోధన ఆవిష్కరణలో వెస్టర్న్ ఆస్ట్రేలియా ముందంజలో ఉందని స్టీఫెన్ డాసన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వెస్టర్న్ ఆస్ట్రేలియా ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడ్ కమిషనర్ నషీదా చౌదరి, టీహబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనీష్ అంథోని, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సీఈఓ డాక్టర్ శ్రీరామ్‌తో పాటు ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. కాగా.. సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఎడిత్ కోవాన్ విశ్వవిద్యాలయం మధ్య అవగాహనా ఒప్పందం జరిగింది.

నడకతో ఆరోగ్యం



ఖైరతాబాద్: నడకతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అవగాహన కల్పిస్తూ కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన వాక్ నిర్వహించారు. జలవిహార్ వేదికగా ఆదివారం కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వాక్ ఎ మైల్ టు స్టాప్ క్లాట్ పేరుతో నిర్వహించిన అవగాహన వాక్‌లో సినీనటి మంచు లక్ష్మి, కిమ్స్ హాస్పిటల్స్ గ్రూప్ సీఎండీ డాక్టర్ బొల్లినేని భాస్కరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో కిమ్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ వాస్క్యులర్, ఎండోవాస్క్యులర్ సర్జన్ డాక్టర్ నరేంద్రనాథ్ మేడా, యువతీ యువకులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం..

గాంధీ సూపరింటెండెంట్ రాజారావు



గాంధీఆస్పత్రి: మరోసారి విజృంభిస్తున్న కోవిడ్ వైరస్ పట్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండి ధైర్యంగా ఎదుర్కొందామని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు సూచించారు. కరోనా కొత్త వేరియంట్లు పెద్దగా ప్రభావం చూపడం లేదని, తెలంగాణ వ్యాప్తంగా ఎక్స్‌బీబీ సబ్‌వేరియంట్ ఎక్కువగా ఉన్నట్లు గాంధీ వైరాలజీ ల్యాబ్‌లో నిర్వహిస్తున్న జీనోమ్ సీక్వెన్సింగ్‌లో నిర్ధారణ అయిందన్నారు. చిన్నారులు, 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దీర్ఘకాల రుగ్మతలతో బాధపడుతున్న వారు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న సబ్ వేరియంట్ల వల్ల సాధారణ కరోనా లక్షణాలతో పాటు వీక్‌నెస్ ఎక్కువగా ఉన్నట్లు తమ పరిశీలనలో తేలిందని, కోవిడ్ నోడల్ సెంటర్ గాంధీఆస్పత్రిలో ముగ్గురు బాధితులకు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. కోవిడ్ మరో వేవ్ రూపంలో వచ్చే అవకాశాలు తక్కువని, ఒకవేళ వస్తే సమర్థంగా ఎదుర్కొనేందుకు గాంధీ వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. గాంధీలో అత్యవసర, సాధారణ, పడకలు, వెంటిలేటర్లుతో పాటు ఆక్సిజన్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. రానున్న మూడు వారాల పాటు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు.



నూతన సచివాలయ నిర్మాణం తుది దశకు చేరింది. త్వరలో ప్రారంభం కానుంది. ధవళ కాంతుల్లో ధగధగా మెరిసిపోతున్న నయా సెక్రటేరియట్ భవనం నగరవాసులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. దీని అందాలకు ముగ్ధులైన వారు ఇక్కడ సెల్ఫీలు దిగుతున్నారు. ఆదివారం పలువురు కొత్త సచివాలయం ఎదుట సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు.

సెల్ఫీ విత్ సెక్రటేరియట్

కుటుంబ పాలనను తరిమికొడదాం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

చంచల్‌గూడ: రాష్ట్రంలో కుటుంబ పాలనను తరిమికొట్టే విధంగా ప్రజలు ముందడుగు వేస్తున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష పత్రం లీక్ వ్యవహారంలో నిరసన తెలిపిన బీజేవైఎం అధ్యక్షుడు భానుప్రకాశ్‌తో పాటు మరి కొందరు నాయకులను అరెస్టు చేసి చంచల్‌గూడ జైలు తరలించిన విషయం తెలిసిందే. జైల్లో ఉన్న భానుప్రకాశ్, ఇతర నాయకులను ఆదివారం కిషన్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలను రాష్ట్ర ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. ఎన్నో కష్టనష్టాలకోర్చి పోటీ పరీక్ష రాస్తే ఫలితాలు వచ్చే సమయానికి ప్రశ్నపత్రం లీక్ కావడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం పట్ల అన్ని జిల్లాల్లో యువత తీవ్ర ఆక్రోశంతో ఉన్నారని ఆయన చెప్పారు. ఎన్ని అక్రమాలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకోవడం లేదన్నారు. ప్రశ్నపత్రాల లీక్‌పై ఉన్నత స్థాయి దర్యాప్తు జరపాల్సిన అవసరముందన్నారు. కుంభకోణంపై నిరసన తెలిపిన బీజేవైఎం నాయకులను అక్రమంగా అరెస్టు చేసి జైలు తరలించడం అన్యాయమన్నారు. కిషన్ రెడ్డి వెంట మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, శ్యామ్‌సుందర్ తదితరులు ఉన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

డేటా లీక్ సిటీతో లింక్



- తెలుగు రాష్ట్రాల ప్రజల వ్యక్తిగత సమాచారం సైతం చౌర్యం
- నేరగాళ్ల చేతుల్లో బ్యాంకు ఖాతాదారుల వివరాలు
- నగరానికి చెందిన ఓ వ్యక్తి ప్రమేయంపై అనుమానం
- లోతుగా ఆరా తీస్తున్న సైబరాబాద్ పోలీసులు
- త్వరలోనే జస్ట్ డయల్, గూగుల్, పలు కంపెనీలకు నోటీసులు
- సాంకేతిక నిపుణుల సహాయంతో దర్యాప్తు ముమ్మరం
- రక్షణ శాఖ వివరాల తస్కరణపై ఆరా తీసిన ఆర్మీ, ఢిల్లీ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన డేటా లీక్ కేసు తీగ లాగితే డొంక కదులుతోంది. ఉత్తరాది రాష్ట్రాలతో పాటు హైదరాబాద్‌తోనూ లింకులు ఉన్నట్లు సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. రక్షణ శాఖ, టెలికం విభాగం, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు, గృహిణులు ఇలా.. 138 విభాగాలకు చెందిన 16.8 కోట్ల మంది వ్యక్తిగత వివరాలను చౌర్యం చేసి, విక్రయిస్తున్న ఏడుగురు అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తొలుత నోయిడా, ఢిల్లీ వంటి ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ప్రజల వ్యక్తిగత సమాచారం మాత్రమే ఉందని పోలీసులు భావించినప్పటికీ.. దర్యాప్తు చేస్తున్న కొద్దీ కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి.

థర్డ్ పార్టీ ఏజెన్సీల నుంచేనా?

డేటాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ప్రజల వ్యక్తిగత వివరాలు సైతం ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇప్పటికే నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డేటాను సైబరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ పోలీసు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ సైబర్ సేఫ్టీ (టీఎస్‌పీసీసీ) ద్వారా పోలీసులు విశ్లేషిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన బ్యాంకు డెబిట్, క్రెడిట్ కార్డు ఖాతాదారుల వివరాలు తస్కరణకు గురైనట్లు పోలీసులు గుర్తించారు. డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు, పిన్, సీవీవీ నంబర్లతో సహా ఫోన్ నంబర్లు, చిరునామా వంటి సమాచారం ఉన్నట్లు తెలిసింది. డేటా లీక్‌పై హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లోతుగా ఆరా తీస్తోంది. రక్షణ శాఖకు చెందిన 2.6 లక్షల మంది వ్యక్తిగత వివరాలు సైతం నిందితులు చౌర్యం చేసిన నేపథ్యంలో.. ఆర్మీ విభాగం, ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయా వివరాలను విశ్లేషించేందుకు సంబంధిత విభాగాల ఉన్నతాధికారులు సైబరాబాద్ పోలీసులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ విభాగాల నుంచి కాకుండా థర్డ్ పార్టీ ఏజెన్సీల నుంచే ఈ సమాచారం బహిర్గతమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

సాంకేతిక నిపుణుల సహాయంతో...

సైబరాబాద్ డీసీపీ కల్మేశ్వర్ శింగేన్వర్ నేతృత్వంలో 9 మంది పోలీసులతో ఏర్పాటైన సిట్.. ఈ కేసును 360 డిగ్రీల కోణంలో దర్యాప్తు చేస్తోంది. డేటా ఎలా లీకైంది? ఎవరెవరికి విక్రయించారు? ఈ డేటాతో ఎలాంటి మోసాలకు పాల్పడుతున్నారు? విదేశాలకు డేటా తరలించారా? వంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. ఈ కేసు పూర్తిగా సాంకేతిక అంశంపైనే ఆధారపడి ఉండటంతో సైబరాబాద్ పోలీసులు సాంకేతిక నిపుణుల సహాయాన్ని తీసుకుంటున్నారు. తస్కరించిన డేటాను నిందితులు జస్ట్ డయల్‌లో డేటా ప్రొవైడర్ల పేర్లతో రూ.2 వేలకు 50 వేల మంది ప్రజల సమాచారాన్ని విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో బయటపడింది. దీంతో తొలి దశలో జస్ట్ డయల్, గూగుల్, ఫేస్‌బుక్, వాట్సాప్ కంపెనీలతో పాటు బ్యాంకులు, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులను విచారించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ క్రమంలో త్వరలోనే ఆయా కంపెనీలకు నోటీసులు జారీ చేయనున్నామని ఓ పోలీసు ఉన్నతాధికారి తెలిపారు. గొలుసుకట్టు మార్కెటింగ్ తరహాలో ఉండటంతో అనేక మందికి ఈ కేసుతో సంబంధాలుండే అవకాశం ఉందని, త్వరలోనే మరికొందరిని అరెస్టు చేస్తామని దర్యాప్తు అధికారి ఒకరు తెలిపారు.

'చార్మినార్' నుంచే ఎక్కువ!

- నకిలీ బర్త్/డెత్ సర్టిఫికెట్ల జారీ
- దర్యాప్తు ప్రారంభించిన సిటీ సీసీఎస్
- సిద్ధమవుతున్న ప్లాన్ ఆఫ్ యాక్షన్
- మొత్తం 22,954 'సర్టిఫికెట్ల' గుర్తింపు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో జనన, మరణ ధ్రువీకరణ నకిలీ పత్రాలు అత్యధికంగా చార్మినార్ ప్రాంతం నుంచే జారీ అయినట్లు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) అధికారులు గుర్తించారు. జీహెచ్‌ఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ కె.పద్మజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఏసీపీ ఎం.సందీప్‌రెడ్డి నేతృత్వంలోని బృందం దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసులో ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై సమగ్ర ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేస్తోంది. ఈ స్కామ్‌పై అంతర్గత విచారణ చేపట్టిన జీహెచ్‌ఎంసీ విజిలెన్స్ విభాగం ప్రాథమికంగా 50 కంటే ఎక్కువ జనన, 100 కంటే ఎక్కువ మరణ నకిలీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన ఈ-సేవ, మీ-సేవ కేంద్రాల పైనే దృష్టి పెట్టారు. అఫ్జల్‌గంజ్, అంబర్‌పేట్, ఆసిఫ్‌నగర్, బహదూర్‌పుర, బోయిన్‌పల్లి, చార్మినార్, చిక్కడపల్లి, చిలకలగూడ, గోల్కొండ, కాచిగూడ, మొఘల్‌పుర, ముషీరాబాద్, నల్లకుంట, సైదాబాద్, సైఫాబాద్, షాహినాయత్‌గంజ్, యాకత్‌పురల్లోని 25 కేంద్రాల నిర్వాహకులు ఇన్‌స్టంట్ అప్రూవల్ విధానాన్ని దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. వీళ్లు ఎలాంటి ధ్రువీకరణ లేని వారితో తెల్లకాగితాలు అప్‌లోడ్ చేయించి జనన, మరణ ధ్రువీకరణలు జారీ చేశారని తేలింది.

శివార్లను కలిపితే మరింత అధికం..

- మొత్తం 22,954 నకిలీ సర్టిఫికెట్లకుగాను చార్మినార్ ప్రాంతంలోని నాలుగు కేంద్రాల నుంచే 4512 (19.65 శాతం) జారీ అయినట్లు వెలుగులోకి వచ్చింది. అత్యధికంగా ఓవైసీ బిల్డింగ్‌లో ఉన్న కేంద్రం నుంచి 2913 జారీ కాగా... ముషీరాబాద్ ఎక్స్ రోడ్‌లోని కేంద్రం నుంచి 969 నకిలీ ధ్రువీకరణ పత్రాలు జారీ అయ్యాయి. 50, 100 కంటే ఎక్కువ జారీ చేసిన కేంద్రల సంఖ్య సిటీలోనే 25గా ఉందని, శివార్లతో కలిపితే ఈ సంఖ్య మరింత పెరుగుతుందని ఓ అధికారి వ్యాఖ్యానించారు. వీటి కంటే తక్కువ సంఖ్యలో జారీ చేసిన ఈ-సేవ, మీ-సేవ కేంద్రాల వివరాలను ఆరా తీస్తామని ఆయన స్పష్టం చేశారు.
- గతేడాది ఏప్రిల్ నుంచి మొత్తం 31,454 దరఖాస్తులు అప్‌లోడ్ కాగా.. 22,954 నకిలీ సర్టిఫికెట్లు జారీ అయ్యాయని, వీటిలో 21,085 జనన, 1869 మరణ ధ్రువీకరణ పత్రాలు ఉన్నట్లు పోలీసులు తేల్చారు. ఈ తరహా దందా రాష్ట్ర వ్యాప్తంగా సాగినట్లు సీసీఎస్ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ స్కామ్ దర్యాప్తు కోసం రంగంలోకి దిగిన అధికారులు ఎలా ముందుకు వెళ్లాలనే అంశానికి సంబంధించి ప్లాన్ ఆఫ్ యాక్షన్ సిద్ధం చేస్తున్నారు. దీన్ని ఉన్నతాధికారులకు సమర్పించడం ద్వారా వారి అప్రూవల్ తీసుకోనున్నారు. ఈ కుంభకోణంపై జీహెచ్‌ఎంసీ అధికారులు ఇప్పటికే ఈ-సేవ, మీ-సేవ కేంద్రాల ఈఎస్‌డీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో వారి స్పందనను పోలీసులు పరిగణలోకి తీసుకోనున్నారు. వచ్చే వారం నుంచి ఆయా కేంద్రాల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసి విచారణ ప్రారంభించనున్నారు.

విశ్రాంత ఐపీఎస్ అధికారి ఇంట్లో భారీ చోరీ

- 30 తులాల బంగారు ఆభరణాలు.. 20 కిలోల వెండి వస్తువులు అపహరణ



ఆనందయ్య ఇంట్లో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

బంజారాహిల్స్: విశ్రాంత ఐపీఎస్ అధికారి ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి తన కుమారుడి వద్దకు వెళ్లిన సమయంలో.. దొంగలు ఇంటికి కన్నం వేసి బంగారు, వెండి వస్తువులను అపహరించారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. జూబ్లీహిల్స్ రోడ్ నెం.72లోని ప్రశాసన్‌నగర్‌లో నివసించే విశ్రాంత ఐపీఎస్ అధికారి కొమ్మి ఆనందయ్య ఈ నెల 16న ఇంటికి తాళం వేసి తన భార్యతో కలిసి కాకినాడలో నివసించే కుమారుడు, కాకినాడ మున్సిపల్ కమిషనర్ కె. రమేష్ ఇంటికి వెళ్లారు. ఈ నెల 25న ఉదయం ఆయన డ్రైవర్ ఫోన్ చేసి ఇంట్లోని బంగారు ఆభరణాలు చోరీ అయిన విషయాన్ని తెలిపాడు. హుటాహుటిన కాకినాడ నుంచి శనివారం హైదరాబాద్‌కు చేరుకున్న ఆనందయ్య ఇంట్లోకి వచ్చి చూడగా రెండు బెడ్రూంల తలుపులు తెరిచి ఉన్నాయి. ఓ బెడ్రూంమ్‌లో అల్మరా పగులగొట్టి ఉంది. అందులోని 30 తులాల బంగారు ఆభరణాలు, పూజా మందిరంలోని 20 కిలోల వెండి వస్తువులు, రూ.40 వేల నగదు, 500 యూఎస్ డాలర్లు, ఆరు లేడీస్ బ్రాండెడ్ వాచీలు, రెండు జెంట్స్ బ్రాండెడ్ వాచీలు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అర్ధరాత్రి 1.33 గంటల వేళ..

జూబ్లీహిల్స్ క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. ఆనందయ్య ఇంటి ముందు ఉన్న సీసీ ఫుటేజీ పరిశీలించగా శుక్రవారం అర్ధరాత్రి 1.33 గంటల ప్రాంతంలో 25 సంవత్సరాల వయసున్న యువకుడు ఇంటి పైభాగంలోకి వెళ్లి తలుపులు గట్టిగా నొక్కడంతో అవి తెరుచుకున్నాయని అక్కడి నుంచి మెట్ల మీదుగా మొదటి అంతస్తులో ఉన్న బెడ్రూం వరకు వెళ్లినట్లుగా గుర్తించారు. తనతో పాటు తెచ్చుకున్న రాడ్‌తో బెడ్రూం తాళాలు తెరిచి అందులో ఉన్న నగదు, ఆభరణాలు, వెండి వస్తువులు, కిచెన్‌లో ఉన్న వెండి ప్లేట్లు బ్యాగులో వేసుకొని గంట వ్యవధిలోనే బయటికి వచ్చినట్లుగా గుర్తించారు. ప్రశాసన్‌నగర్ నుంచి ఫిలిం చాంబర్ రోడ్డు వరకు నడుచుకుంటూ వచ్చిన నిందితుడు అక్కడి నుంచి ఓ స్కూటరిస్ట్‌ను లిఫ్ట్ అడిగి.. కొద్దిసేపటికే మరో స్కూటరిస్ట్‌ను లిఫ్ట్ అడిగి రోడ్ నెం. 45 వైపు వెళ్లిన దృశ్యాలు సీసీ ఫుటేజీల్లో నమోదయ్యాయి. ఈ మేరకు పోలీసులు నిందితుడి కోసం లోతుగా విచారణ చేపట్టారు. ఫింగర్ ప్రింట్స్ తీసుకున్నారు. సీసీ ఫుటేజీల్లో దొంగకు సంబంధించిన ఊహా చిత్రాన్ని నమోదు చేశారు. నాలుగు బృందాలు గాలింపు చేపట్టాయి. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

'ప్రైవేటు' గాలం!

పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు



- మరోవైపు ఇళ్లకు కాలేజీల పీఆర్‌ఓలు
- డిజిటల్, ఇంటర్నేషనల్ విద్య పేరిట ప్రలోభాలు
- ముందస్తుగా చేరిస్తే ఫీజులో రాయితీలు
- ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల దూకుడు
- ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలు బేఖాతరు

సాక్షి, సిటీబ్యూరో: ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు జోరందుకున్నాయి. ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలు బేఖాతరు చేస్తున్నాయి. పదో తరగతి పరీక్షలు ప్రారంభం కాకముందే కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థల్లో 70 శాతానికి పైగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేయగా, మరికొన్ని ప్రైవేటు కాలేజీ అడ్మిషన్ల కోసం విద్యార్థుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులకు ఫోన్లు చేసి బంగారు భవిష్యత్తు అందిస్తామంటూ ప్రలోభాలకు గురి చేస్తున్నాయి. అడ్మిషన్ల కోసం ప్రతిభ పరీక్షలు ప్రత్యేక స్కాలర్ షిప్‌తో ఫీజులో రాయితీ ప్రకటిస్తున్నాయి. ఒక్కసారి కాలేజీని సందర్శించడంటూ పదే పదే టెలికాలర్స్ ద్వారా ఫోన్లు చేయించడం షరా మామూలుగా మారింది. మరోవైపు పదో తరగతి పరీక్షలకు ఆన్‌లైన్ గైడెన్స్ అంటూ గాలం వేస్తున్నాయి. వాస్తవంగా 2023-24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల కాకుండానే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించవద్దని ఇటీవల ఇంటర్మీడిట్ బోర్డు హెచ్చరికలు జారీ చేసిన విషయం విదితమే.

అడ్డుకట్ట పడదా?

- ప్రైవేటు కళాశాలల ఇష్టారాజ్యంపై అడ్డు వేస్తామనే అధికారుల హెచ్చరికలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. కళాశాలల నియంత్రణపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు ప్రతిపాదనలకు కూడా మోక్షం లభించడం లేదు. కాలేజీల ఫీజుల విషయం పక్కకు పెడితే కనీసం ఇంటర్ బోర్డు జారీ చేసే అడ్మిషన్ల షెడ్యూల్‌తో సంబంధం లేకుండానే పీఆర్‌ఓ వ్యవస్థ ద్వారా ఆయా కళాశాలలు తమ అడ్మిషన్లను ముందుగానే పూర్తి చేసుకోవడం విస్మయానికి గురిచేస్తోంది.
- ప్రతిసారీ ప్రభుత్వ ఆలోచన సైతం ఆచరణలో అమలు కావడం లేదు. తాజాగా ఫలితాల వెల్లడి సమయంలో విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా ఆయా కళాశాలలు భారీగా ప్రకటనలు ఇస్తూ ఆకర్షించడం సర్వసాధారణంగా తయారైంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ర్యాంకుల పేరిట ప్రకటనలు ఇవ్వకూడదు.
- కళాశాలల పేరిట కూడా నేరుగా ప్రకటనలు ఇవ్వడానికి అవకాశం లేదు. ఇవేవీ పట్టించుకోకుండా కళాశాలలు ప్రతిసారీ భారీ ఎత్తున ప్రకటనలు జారీ చేస్తున్నాయి. ఈసారి కూడా అదే పరిస్థితి పునరావృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

సీపీఎం ఆధ్వర్యంలో జీపుజాత



బంజారాహిల్స్: పెరిగిన ధరలు, కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా మార్చి 29న ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన సీపీఎం జనచైతన్య బస్సు యాత్రల ముగింపు సభను జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం ఖైరతాబాద్‌లో 'జీపు జాత' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. శ్రీనివాసరావు, జోన్ కార్యదర్శి గోపాస్ కిరణ్, ఈ కార్యక్రమంలో జోన్ నాయకులు శ్రీనివాస్, రాధిక, మాధవి, రాము, కృష్ణ, పెంటయ్య, శివరాజ్, తదితరులు పాల్గొన్నారు. సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మీ ఆరోగ్యం ఎలా ఉంది?

- ఆర్టీసీ డిపోల్లో ఆరోగ్య సలహాదారులు
- సిబ్బంది యోగక్షేమాలపైన పరామర్శలు
- అనారోగ్యంగా ఉంటే ఆసుపత్రికి తరలింపు

సాక్షి, సిటీబ్యూరో: డిపో నుంచి బస్సు బయటకు తీస్తే తిరిగి డిపోకు చేరుకొనే వరకు ఒత్తిడితో కూడిన విధి నిర్వహణ. ఒకవైపు ట్రాఫిక్ రద్దీ, మరోవైపు గంటల తరబడి డ్రైవింగ్. బస్సు ఏ మాత్రం ఆలస్యమైనా అటు ప్రయాణికుల నుంచి ఇటు పైఅధికారుల నుంచి మరో విధమైన ఒత్తిడిని ఎదుర్కోవలసి ఉంటుంది. దీంతో సహజంగానే ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు అనారోగ్యానికి గురవుతున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, సయాటికా వంటి జీవనశైలి వ్యాధులతో పాటు ఇటీవల కాలంలో గుండెజబ్బుల బారిన పడుతున్న వారి సంఖ్య కూడా ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో సిబ్బంది ఆరోగ్యం పట్ల ఆర్టీసీ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటోంది. ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యం గురించి తెలుసుకొనేందుకు డిపోల్లో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద ఆరోగ్యకార్యకర్తల సేవలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చొరవతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి డిపోలో ఆరోగ్య కార్యకర్తలను ఏర్పాటు చేశారు.



ఒక డిపోలో సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

నిరంతర పర్యవేక్షణ...

గ్రేటర్ హైదరాబాద్‌లోని 28 డిపోల్లో సుమారు 20 వేల మందికి పైగా డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో డిపోలో సగటున 600 నుంచి 1100 మంది వరకు పని చేస్తున్నారు. ఆర్టీసీలో కార్మిక సంఘాలను రద్దు చేసిన అనంతరం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంక్షేమ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు డ్రైవర్లు, కండక్టర్లు తదితర సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయవలసి ఉంటుంది. ఈ సంక్షేమ కమిటీల తరహాలోనే ప్రతి డిపోలో ఇద్దరు లేదా, ముగ్గురు సిబ్బందిని హెల్త్ వాలంటీర్‌లుగా ఏర్పాటు చేశారు. ఈ స్వచ్ఛంద కార్యకర్తలు సిబ్బందికి ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా వెంటనే తార్నాకలోని ఆసుపత్రికి తీసుకెళ్తారు. సంబంధిత డాక్టర్‌లు పరీక్షించిన అనంతరం మందులు ఇప్పించి ఇంటికి పంపిస్తారు.డిపోకు, తార్నాకాలోని ఆర్టీసీ ఆసుపత్రికి మధ్య ఆరోగ్యకార్యకర్తలు సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని డిపో మేనేజర్ ఒకరు తెలిపారు. 'సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం ఆరోగ్య కార్యకర్తల సేవలు ఎంతో దోహదం చేస్తున్నాయ'న్నారు.

ముప్పు ఎక్కువే...

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర సిబ్బంది ఆరోగ్యం గురించి తెలుసుకొనేందుకు ఇటీవల తార్నాక ఆసుపత్రిలో పెద్ద ఎత్తున వైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సిబ్బందికి అవసరమైన వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఇప్పటికే కొందరు గుండెజబ్బులతో బాధపడుతుండగా ఆ ముప్పు ఉన్నవారి సంఖ్య కూడా అక్కడక్కడా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. దీంతో తరచుగా వైద్య పరీక్షలు చేసుకోవాలని సూచించారు. అప్పటి నుంచి సిబ్బంది ఆరోగ్యం పట్ల ఎండీ సజ్జనార్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని తెలుసుకొనేందుకు డిపో స్థాయిలోనే ఏర్పాట్లు ఉంటే బాగుంటుందని భావించారు. అందుకనుగుణంగా వాలంటీర్ల సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఈ వాలంటీర్లు ఎప్పటికప్పుడు సిబ్బంది ఆరోగ్యం గురించి ఆరా తీస్తూనే అవసరమైన వారిని ఆసుపత్రికి తీసుకెళ్తారు. ఆరోగ్యం పట్ల స్పృహను పెంచేందుకు ఈ ఏర్పాటు ఎంతో బాగుందని ఆర్టీసీ సిబ్బంది సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఉచిత శస్త్రచికిత్సలు

- ఆకార్ ఆశ ఆస్పత్రితో సంస్థ ఒప్పందం



సాక్షి, హైదరాబాద్: కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కార్యక్రమాల్లో భాగంగా జన్మతః అంగవైకల్యం పుట్టిన వారు, ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ఉచితంగా రికంస్ట్రక్టివ్(ఆర్థోపెడిక్) శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు హైదరాబాద్‌లోని ఎన్టీపీసీ దక్షిణాది విభాగం ముందుకు వచ్చింది. నగరంలోని నర్సింగ్ స్ప్రైన్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని ఆకార్ ఆశ ఆస్పత్రి, ఎన్టీపీసీల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెం జిల్లాలోని గుట్టుమల గ్రామంలో ఈ మేరకు బాధితులను గుర్తించేందుకు స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. రూ.12.20 లక్షల వ్యయంతో 34 మంది బాధితులకు రికంస్ట్రక్టివ్ శస్త్రచికిత్సల కోసం ఆకార్ ఆశ ఆస్పత్రితో ఈ నెల 24న ఎన్టీపీసీ ఒప్పందం కుదుర్చుకుంది. ఎన్టీపీసీ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ దెబాషిశ్ చటోపాధ్యాయ్ సమక్షంలో సంస్థ అధికారి బద్రుద్దీన్, ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ భారతెందు స్ప్రైన్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీ జీఎం సూర్యనారాయణ పాణిగ్రహి, సీనియర్ మేనేజర్ సహదేవ్ సేతి పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలి

శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాష్ ముదిరాజ్

సైదాబాద్: సమాచార హక్కు చట్టంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం సైదాబాద్‌లో సమాచార హక్కు పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో పాశుపతాస్త్రంలా పనిచేస్తుందన్నారు. ప్రభుత్వాలు కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టే వివిధ పథకాల అమలు సక్రమంగా ఉండేందుకు, నిధులు దుర్వినియోగం కాకుండా చూసేందుకు అందరికీ సహ చట్టం ద్వారా సమాచారం తెలుసుకునే హక్కు ఉందని వివరించారు. సమాచార హక్కు చట్టం మాజీ చీఫ్ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాచారం దాచిపెడితే ఎన్నో అనుమానాలు వస్తాయని, వాటిని ప్రజలకు అందుబాటులో ఉంచితే అనుమానాలకు తావు లేకుండా పారదర్శకంగా ఉంటుందని వివరించారు. సమితి సభ్యులు క్షేత్రస్థాయిలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని కోరారు. ఎస్‌హెచ్‌పీఎస్ జాతీయ చైర్మన్ బి.కేశవులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్యుడి దరికి చేరినప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. త్వరలో తెలంగాణలో అన్ని జిల్లాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు కన్నెబోయిన ఉషారాణి, గుండ్లపల్లి శ్రీనివాస్, వెంకటలక్ష్మి, సంధ్య, యాదగిరి, ఉమాకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులతో కలిసి తెలుగు నూతన సంవత్సర కేలండర్‌ను బండా ప్రకాష్‌ముదిరాజ్ ఆవిష్కరించారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ప్రకాష్ ముదిరాజ్ తదితరులు

మద్యం మత్తులో యువతి పట్ల అసభ్య ప్రవర్తన

ఇద్దరు యువకులపై కేసు నమోదు

బంజారాహిల్స్: స్నేహితులతో కలిసి హోటల్‌కు డిన్నర్‌కు వెళ్తున్న ఓ యువతిని మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు అడ్డగించి ఆమెపట్ల అసభ్యంగా ప్రవర్తించి గాయపరిచిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చదువుకుంటూ ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని (21) ఈ నెల 24వ తేదీ రాత్రి 10.15 గంటలకు తన ఆరుగురు స్నేహితులు యశ్వంత్, షేక్ యూనస్, సిహెచ్.పూర్ణచందర్‌రావు, షేక్ సాజిద్, షేక్ ఫరూఖ్‌తో పాటు మరో స్నేహితురాలితో కలిసి బైక్‌లపై బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని బిర్యానీవాలా రెస్టారెంట్‌కు విందుకోసం పంజగుట్ట రోడ్డు నుంచి వెళ్తుండగా అక్కడ మద్యం మత్తులో ఉన్న ఇద్దరు యువకులు ఆమె వెళ్తున్న బైక్‌ను అనుసరించి అడ్డుకున్నారు. ఆమెపట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఈ క్రమంలో యువతి తప్పించుకోవడానికి యత్నించి కిందపడింది. అక్కడే ఉన్న కర్రతో ఆమెను కొట్టడమే కాకుండా ఆమె జుట్టు పట్టుకొని కొద్ది దూరం ఈడ్చుకెళ్ళారు. ఈ ఘటనలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా వెంటనే సమీపంలోని స్టార్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. ఆమెపట్ల అసభ్యంగా ప్రవర్తించిన నిందితుల గురించి ఆరా తీయగా ఇందులో ఒకరు పంజగుట్టకు చెందిన కొండా ఏసుదాస్ (24), పోచమ్మ బస్తీకి చెందిన పుణ్య సాయి కళ్యాణ్ (25)గా గుర్తించారు. వీరిద్దరిపై బంజారాహిల్స్ పోలీసలు ఐపీసీ సెక్షన్ 324, 341, 354 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పబ్‌లో యువకుడిపై దాడి..గొలుసు చోరీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని చీర్స్ పబ్‌కు వచ్చిన బిజినెస్‌మెన్ టి.హరీష్‌రెడ్డి (29) మద్యం సేవిస్తుండగా రాత్రి 11.35 గంటల ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆయన సీటు వద్దకు వచ్చి అకారణంగా గొడవపడి తీవ్ర వాగ్వాదానికి దిగాడు. అంతే కాకుండా హరీష్‌రెడ్డిపై చేయి చేసుకున్నాడు. ఆ కొద్దిసేపటికే ఆగంతకుడికి చెందిన మరో పది మంది స్నేహితులు అక్కడికి వచ్చి హరీష్‌ను తీవ్రంగా కొట్టారు. పిడిగుద్దులు బాదడంతో ఆయన కడుపులో, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. ఈ క్రమంలోనే హరీష్ రెడ్డి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును తస్కరించారు. గాయాలపాలైన బాధితుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటక రంగానికి పూర్వ వైభవం రావాలి

విశ్రాంత డీజీపీ హెచ్‌జే దొర

గన్‌ఫౌండ్రీ: నాటకరంగం గొప్ప కళాప్రక్రియ అని, ఈ ప్రక్రియను పరిరక్షించేందుకు కృషి చేయాలని విశ్రాంత డీజీపీ హెచ్‌జే దొర అన్నారు. ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావాల్సిన అవసరం ఎంతగానో ఉందని చెప్పారు. ఆదివారం రవీంద్రభారతిలో రసరంజని సంస్థ 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న నాటకోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రేక్షకులను నాటక రంగం వైపు ఆసక్తిని పెంచేలా రచనలు చేయాలని సూచించారు. అనంతరం ప్రముఖ రంగస్థల దర్శకుడు మోహన్ సేనాపతి దర్శకత్వంలో ప్రదర్శించిన 'సిరిమింగిన వెలగపండు'నాటకాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, రంగస్థల నటుడు డీఎస్ఎన్ మూర్తి, రంగస్థల దర్శకుడు బీఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాటక ప్రదర్శనలో ఓ దృశ్యం



తిలకిస్తున్న రమణాచారి తదితరులు

అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తే అరెస్టులే

- స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్న సైబరాబాద్ పోలీసులు
- వీకెండ్‌లో ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లు, గెస్ట్ హౌస్‌లలో తనిఖీలు
- 48 మంది అరెస్టు, సొత్తు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న లాడ్జీలు, ఓయో రూమ్స్, దాబాలు, పబ్‌లు, గెస్ట్ హౌస్‌లు, రిసార్ట్‌లు, ఫామ్ హౌస్‌లపై సైబరాబాద్ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. వీకెండ్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పేట్‌బషీరాబాద్, కేపీహెచ్‌బీ, షామీర్‌పేట, మొయినాబాద్, శంషాబాద్ పరిధిలోని 39 ప్రాపర్టీలలో సోదాలు చేసి 48 మందిని అరెస్టు చేశారు. పేట్ బషీరాబాద్‌లోని లక్ష్మీ విల్లా గెస్ట్ హౌస్, షామీర్‌పేటలోని జాస్మిన్ ఫామ్ హౌస్‌లలో గంజాయి, అక్రమ మద్యం, కేపీహెచ్‌బీలోని హోటల్ కార్తికేయ రెసిడెన్సీలో వ్యభిచారం, శంషాబాద్‌లో అక్రియేషన్ ఫామ్‌హౌస్ హుక్కా, మొయినాబాద్‌లో మ్యాంగో వుడ్ ఫామ్‌లో ముజ్రా పార్టీ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో నిర్వాహకులు, యజమానులు, కస్టమర్లపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి అక్రమ మద్యం, హుక్కా ప్లాట్లు, గంజాయి తదితర సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా.. కార్తికేయ రెసిడెన్సీ నిర్వాహకుడు రాజు, సహ నిర్వాహకుడు నరేష్, జాస్మిన్ ఫామ్‌హౌస్ యజమాని మహ్మద్ ముస్తఫా అలీ, మ్యాంగో వుడ్ ఫామ్‌లోని విల్లా నంబరు-12 యజమాని నితిన్ అగర్వాల్, ట్రినిటీ విల్లా ఓనర్ అభిజిత్‌లు పరారీలో ఉన్నారు.

'టైటాన్' ఆధ్వర్యంలో గార్మిన్ రన్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లో నూతనంగా హీలియోస్ షోరూం ప్రారంభించిన సందర్భంగా టైటాన్- హీలియోస్ ప్రీమియం వాచెస్ స్టోర్ ఆధ్వర్యంలో 'గార్మిన్ రన్'ను నిర్వహించారు. 5కే, 10కే విభాగాల్లో ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న 300 మందికిపైగా నగరవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. హీలియోస్ స్టోర్‌లో 40కిపైగా ఇంటర్నేషనల్ బ్రాండ్ వాచెస్ ఉన్నాయని.. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని టైటాన్ తెలంగాణ, ఏపీ ఏరియా బిజినెస్ మేనేజర్ రాజేష్ ఇమ్మాడి తెలిపారు. గార్మిన్ రన్ యాక్టివిటీలో పాల్గొన్న వారందరికీ ప్రత్యేకమైన ఆఫర్లు అందజేస్తామని ఆయన తెలిపారు.

ఆదివాసీలపై వైమానిక దాడులు ఆపాలి

పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.లక్ష్మణ్ డిమాండ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దండకారణ్యంలోని ఆదివాసీ గ్రామాలపై కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వైమానిక దాడులను తక్షణమే నిలిపి వేయాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. దండకారణ్య ఆదివాసీలపై గగనతల దాడులను ఆపాలని డిమాండ్ చేస్తూ పౌర హక్కుల సంఘం, ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఆదివారంసభ జరిగింది. లక్ష్మణ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన పాలకులు ప్రజల ప్రాథమిక హక్కులను అణచి వేయడంలో పోటీ పడుతున్నారని విమర్శించారు. మన దేశ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, పాలకులు బహుళ జాతి కంపెనీల గుప్పిట్లో బందీలుగా మారాయని పేర్కొన్నారు. ప్రముఖ సామాజికవేత్త హిమాంశ్ కుమార్, ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ నాయకురాలు హిడ్మే మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాలపై కేంద్ర సాయుధ బలగాలు దాడి చేయడమే కాకుండా, మహిళలను హత్య చేస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టు ఉద్యమాన్ని సాకుగా చూపి అడవిలో ఆదివాసీలు లేకుండా చేసి ఇక్కడి భూగర్భ గనులను బహుళజాతి కంపెనీలకు అప్పజెప్పేందుకు కేంద్రం కుట్ర చేస్తోందన్నారు. ఆదివాసీలను వైమానిక దాడుల నుంచి కాపాడేందుకు ప్రజాస్వామ్య వాదులు గొంతు విప్పాలన్నారు. కార్యక్రమంలో హక్కుల సంఘాల నేతలు ఎన్.నారాయణ రావు, చిలుక చంద్రశేఖర్, ఆదివాసీ నాయకులు మంగ్లు తదితరులు పాల్గొన్నారు. సభలో ప్రజాకళామండలి కళాకారులు ఆదివాసీ ఉద్యమ గీతాలను ఆలపించారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మణ్

రాజకీయ అజాత శత్రువు బొమ్మగాని

సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా

హిమాయత్‌నగర్: రాజకీయ పార్టీలకు అతీతంగా గౌరవించబడే నాయకుడు, అజాత శత్రువు బొమ్మగాని ధర్మభిక్షం అని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు, గీత పనివారల ఉద్యమ నిర్మాత, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం వర్ధంతి హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అజీజ్ పాషా మాట్లాడుతూ నాటి నిజాం కాలంలో రావి నారాయణ రెడ్డి తర్వాత అంతటి ముఖ్య కమ్యూనిస్టు నాయకులలో ధర్మభిక్షం ఒకరని గుర్తు చేశారు. హైదరాబాద్ రాష్ట్ర మొదటి ఎన్నికలలో ఆయనకు రాష్ట్రంలోనే అత్యధిక ఓట్లు లభించాయని, మూడు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు ఎంపీగా గెలుపొందారన్నారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ ఆర్యసమాజం, వందేమాతరం, ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాల నుండి వచ్చిన నాయకుడు ధర్మభిక్షం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అయిప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీఎల్, గీత పనివారల సంఘం కేంద్ర కార్యదర్శి బి.నాగభూషణం, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు కరుణ కుమారి, సిపిఐ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి గోవింద్, శ్రీరాములు, కె.శ్రీనివాస్, ఈ.శ్రీధర్ బొమ్మగాని సాకేత్ తదితరులు పాల్గొన్నారు.



బొమ్మగాని చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

త్వరలో ప్రజల కష్టాలన్నీ తొలగిపోతాయి


ప్రేమ్‌నగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న విజయారెడ్డి

పంజగుట్ట: త్వరలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ప్రజలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న కష్టాలన్నీ తొలగిపోతాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె ప్రేమ్‌నగర్‌లో పర్యటించారు. స్థానికులను వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాహుల్‌గాంధీ హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో ఇచ్చిన సందేశాన్ని వారికి వివరించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎన్నో సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని ఆరోపించారు. కార్యక్రమంలో మురళి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న భక్తులు

ఫిలింనగర్: ఫిలింనగర్ రోడ్ నం. 1లోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో వసంత పంచమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు ఉగాది తర్వాత వచ్చే పంచమిని వసంత పంచమిగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ముందు సహస్ర పాఠ్యపుస్తకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఈ పుస్తకాలను, పెన్నులను విద్యార్థులకు అందించారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే

వెంగళరావునగర్ : యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు పట్టాలు అందుకొని సందడి చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్కూల్ మేనేజింగ్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ జయంతి వెంకట్‌రామన్ మాట్లాడుతూ, చిన్నారులకు విద్యతో పాటు దేశభక్తి, క్రీడలు, క్రమశిక్షణ, సమాజంపై అవగాహన కల్పించడం వల్ల భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా పేరు తెచ్చుకుంటారన్నారు. స్కూల్ వ్యవస్థాపకులు, చైర్మన్ శిరీష శంకర్, ప్రధానోపాధ్యాయులు ఉష మీనాక్షి, ఇతర టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు, స్టూడెంట్స్ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ఫిలింనగర్: ఫిలింనగర్ వినాయక నగర్‌లోని శ్రీ నలంద విద్యానికేతన్ పాఠశాల 10వ వార్షికోత్సవం కనుల పండువగా జరిగింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించి వారిని అభినందించారు. పిల్లల భవిష్యత్‌ను చక్కగా తీర్చిదిద్దాలని ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యానికి సూచించారు. క్రమశిక్షణతో నడుచుకునేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజలు బుద్ధి చెబుతారు: రోహిణ్‌రెడ్డి



సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న రోహిణ్‌రెడ్డి

బంజారాహిల్స్: ఏఐసీసీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేసినందుకు నిరసనగా ఆదివారం గాంధీభవన్‌లో ఏఐసీసీ ఆదేశాల మేరకు చేపట్టిన సత్యాగ్రహ దీక్షలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు సి.రోహిణ్‌రెడ్డితో పాటు నియోజక వర్గ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాహుల్ గాంధీకి మద్దతుగా ప్లకార్డులు ప్రదర్శించారు రాహుల్‌గాంధీకి అండగా ఉంటామని నినాదాలు చేశారు. ప్రధాని మోదీ తన చర్యలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రోహిణ్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సన్నద్ధమవుతున్నారని ఆయన అన్నారు.

నాటకం.. ప్రేక్షక పరవశం

- రంజింపజేస్తున్న పద్య నాటకాలు
- కళాకారులను ప్రోత్సహిస్తున్న కళాభిమానులు


పల్నాటి యుద్ధం నాటికలోని సన్నివేశం

బంజారాహిల్స్: 'తెర'మరుగవుతున్న కళలను వెలుగులోకి తీసుకురావడం, నేటి తరానికి పద్యనాటకాలను పరిచయం చేయడం, నాటకాలపై బతుకుతున్న కళాకారులకు ప్రోత్సాహం అందించడం లక్ష్యంగా ఫిలింనగర్‌లోని డి.రామానాయుడు కళామండపంలో ప్రదర్శిస్తున్న నాటకాలు ప్రేక్షకులను రంజింపజేస్తున్నాయి. నాటకాలు అంటే తెలియని నేటి తరానికి వాటి గొప్పతనాన్ని తెలియజేసేందుకు ఫిలింనగర్ కల్చరల్ సెంటర్ ఉగాది నాటకోత్సవాల పేరిట ప్రతియేటా నాటక ప్రదర్శన ఏర్పాటు చేస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నాటక సమాజాల కళాకారులు ఈ వేదికపై తమ ప్రతిభా పాటవాలను చక్కగా ప్రదర్శిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు.


ఆదివారం ప్రదర్శించిన కురుక్షేత్రం నాటకంలోని సన్నివేశం

- ఒకప్పుడు సురభి నాటకాలకు ఉన్నంత ఆదరణ ప్రస్తుతం ఇక్కడ ప్రదర్శిస్తున్న నాటకాలకు కూడా లభిస్తుండటంతో కళాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయా దృశ్యాలకు అనుగుణంగా సెట్టింగ్‌లు ప్రధాన ఆకర్షణగా నిలుస్తున్నాయి.
- ఈ ఏడాది ఉగాది సందర్భంగా ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ నాటకాల్లో మెదక్ జిల్లా పటాన్‌చెరుకు చెందిన టీబీఆర్ ఆర్ట్స్ థియేటర్స్ నాటక సమాజం ప్రదర్శించిన శ్రీకృష్ణ తులాభారం విశేషంగా ఆకట్టుకుంది.
- అలాగే ఖమ్మం జిల్లాకు చెందిన సుమిత్రా యూత్ అసోసియేషన్ నాటక సమాజం ప్రదర్శించిన యయాతి పద్యనాటకం, ఈ నెల 24న ఇబ్రహీంపట్నంకు చెందిన శ్రీ షణ్ముఖ నాట్యమండలి ప్రదర్శించిన తులసీ జలంధర నాటకం కళాభిమానులను రంజింపజేశాయి.
- గుంటూరు జిల్లాకు చెందిన సమతా నాటక గురుకుల నాట్యమండలి ప్రదర్శించిన పల్నాటి యుద్ధం చారిత్రక నాటిక సినిమా సన్నివేశాలను తలపించింది. నాలుగు గంటల పాటు కొనసాగిన ఈ నాటకాన్ని కళాభిమానులు ఆదరించారు.
- కేవలం కళాకారులతోనే సరిపెట్టకుండా వీరికి ఆయా పాత్రలకు అనుగుణమైన డ్రెస్సింగ్‌లు, మేకప్, కిరీటాలు లైటింగ్.. ఇలా అన్నింట్లోనూ ప్రత్యేక శ్రద్ధకనబరుస్తున్నారు.
- నాటకాల్లో నటిస్తున్న కళాకారులంతా దేశవ్యాప్త కీర్తిప్రతిష్ఠలు పొందిన వారే కాకుండా నంది అవార్డు గ్రహీతలు కూడా కావడం విశేషం. కళాకారుల ఆలపిస్తున్న పద్యాలు ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్తున్నాయి.


వేదికపై నటులు విజయ్‌చందర్, శివాజీరాజా

40 రకాల వేషాలు



పల్నాడు జిల్లాకు చెందిన నేను 1984 నుంచి నాటకాల్లో పాల్గొంటున్నాను. కృష్ణుడు, అర్జునుడు, ధర్మరాజు, గయుడు ఇలా 40 రకాల పాత్రలు పోషిస్తున్నాను. ఇప్పటికి 800 ప్రదర్శనలు ఇచ్చాను. విజయవాడ రేడియోలో కూడా పద్యాలు పాడుతుంటాను. జాతీయ స్థాయిలో ఉత్తమ సహాయ నటుడి అవార్డు కూడా పొందాను. హైదరాబాద్ లాంటి నగరంలో నాటకాలను ప్రదర్శించడమే గొప్ప అనుకుంటే వాటిని తిలకించడానికి ప్రేక్షకులు కూడా పెద్ద సంఖ్యలో వస్తుండటం ఆత్మ సంతృప్తిని కలిగిస్తోంది. ఫిలింనగర్ వేదికపై నాటకాలు ప్రదర్శించడం గొప్ప విషయం.

– బలిజేపల్లి అంజిరెడ్డి, కళాకారుడు

1963 నుంచి నాటకాలు



నేను 1963 నుంచి నాటక ప్రదర్శనలు ఇస్తున్నాను. కృష్ణుడు, శ్రీరాముడు, హరిశ్చంద్రుడు, భవానీశంకరుడు.. ఇలా 50 కిపైగా పౌరాణిక పాత్రలు పోషిస్తుంటాను. ఇప్పటికి 8 వేల ప్రదర్శనలు ఇచ్చాను. బంగారు కిరీటదారిగా పేరుంది. నాటక రంగానికి ఆదరణ తగ్గిపోయిందని చెప్పాలి. అయితే రామానాయుడు కళామండపంపై ఇలాంటి నాటికలు ప్రదర్శించడానికి మమ్మల్ని ఆహ్వానించడం, ప్రోత్సహించడం ఆనందంగా ఉంది. పొత్తూరి వెంకట సుబ్బారావు లాంటివారు ఇంకొందరు ముందుకు వస్తే మాకు మరింత ప్రోత్సాహం లభిస్తుంది.

– ఉప్పలపాడు సైదులు, కళాకారుడు

మరికొందరు ఆదుకోవాలి



నేను ఇప్పటి వరకు 500 ప్రదర్శనలు ఇచ్చాను. పద్యనాటకాలు బతకాలంటే ఇంకొందరు ముందుకు వచ్చి ఇలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. ఆత్మసంతృప్తితో పాటు కొంత ప్రోత్సాహం కూడా ఈ నాటకాల ద్వారా లభిస్తున్నది. మేము ఈ నాటకాలు కాకుండా ఇంకే పనీ చేయలేం. ఎందుకంటే ఒక్కసారి ముఖానికి రంగు వేసుకుంటే కాటికిపోయేదాకా ఇక ఆ వృత్తికే అంకితం కావాల్సి ఉంటుంది. రామానాయుడు కళామండపంలో సుబ్బారావులాంటి వారు ఈ నాటకాలు ఏర్పాటు చేయించడం మాలాంటి వాళ్లను బతికిస్తున్నది. ఇలాగే మరికొందరు ప్రదర్శనలు ఇప్పించి కళాకారులను ఆదుకోవాలి

– శివప్రసాద్, కళాకారుడు

బీఆర్ఎస్‌లోనే మహిళలకు గుర్తింపు


ఎమ్మెల్యే గోపీనాథ్ సమక్షంలో పార్టీలో చేరుతున్న మహిళలు

రహమత్‌నగర్: కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను చూసి వివిధ పార్టీల కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బోరబండ డివిజన్‌లోని వివిధ పార్టీలకు చెందిన వంద మంది మహిళలు ఎమ్మెల్యే సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలోనే మహిళలకు సరైన ఆదరణ, గుర్తింపు లభిస్తోందన్నారు. బోరబండ డివిజన్ అభివృద్ధిపై తాను ప్రత్యేక దృష్టి సారించానన్నారు. డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సయ్యద్ సిరాజ్, కో ఆర్డినేటర్ విజయసింహ, జూబ్లీహిల్స్ మైనారిటీ నాయకుడు తన్నూఖాన్, విజయ్ కుమార్, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

తీగల తొలగింపు పనులు ప్రారంభం

బోరబండ డివిజన్ బంజారానగర్‌లో సుమారు రూ.17 లక్షలతో చేపట్టనున్న విద్యుత్ తీగల తొలగింపు పనులను ఆదివారం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ప్రారంభించారు. దశాబ్దాల కల నేరవేరినందుకు బస్తీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బస్తీ అధ్యక్షుడు యాదయ్య, నవీన్, మహేందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు నిర్ణయంపై హర్షం

లిబర్టీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని పంజగుట్టలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు దళిత సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాజువస్తాద్ అన్నారు. ఆదివారం జేఏసీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పంజగుట్టలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతిస్తూ మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలు ఇవ్వడం అభినందనీయమన్నారు. పంజగుట్ట చౌరస్తాలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గతంలో ఏర్పాటు చేస్తే జీహెచ్ఎంసీ యంత్రాంగం గోషామహల్‌కు తరలించిందని, ఈ అంశంపై అప్పుడు తాము అన్ని దళిత సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం చేశామని ఈ సందర్భంగా రాజువస్తాద్ గుర్తు చేశారు.

హిమాయత్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ హిమాయత్‌నగర్ డివిజన్ ఉపాధ్యక్షుడిగా కొలుకుల శ్రీకాంత్ నియమితులయ్యారు. పార్టీ నగర్ ఎస్సీ సెల్ విభాగంలో చురుకైన పాత్ర పోషిస్తున్న శ్రీకాంత్ ఎన్నో ఏళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. గత ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థుల తరపున పని చేశారు. తనను డివిజన్ ఉపాధ్యక్షుడిగా నియమించిన పార్టీకి శ్రీకాంత్ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ముందుకు సాగుతానని వెల్లడించారు.

బస్తీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి

రహమత్‌నగర్: బస్తీల్లోని ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి స్పష్టం చేశారు. రహమత్‌నగర్ బంగారు మైసమ్మ ఆలయ ప్రాంతంలో ఆదివారం పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బంగారు మైసమ్మ ఆలయం వద్ద సీవరేజ్ సమస్య ఉందని స్థానికులు తనకు ఫిర్యాదు చేశారని, రెండు రోజుల్లో దానిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను కార్పొరేటర్ కోరారు. బీఆర్ఎస్ నాయకుడు గడ్డం శ్రీధర్, విజయ్‌కిరణ్, లింగమూర్తి, పూజారి రఘు, అర్కే,తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరం


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పరిధి గాయత్రిహిల్స్‌లోని లిటిల్ స్టార్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ క్యాపిటల్, సనత్‌నగర్ టీమ్, గ్రేటర్ బంజారా సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశాయి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ముఖ్య అతిథిగా విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి వైద్య శిబిరాలు స్థానికులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. బస్తీ, కాలనీ సంక్షేమ సంఘాలు ఇలాంటి ప్రజోపయోగ కార్యక్రమాలు మరిన్ని చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. స్థానికులు సుమారు వెయ్యి మందికి పైగా తరలి రావడం చూస్తుంటే ఈ శిబిరాల అవసరం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. విరించి ఆస్పత్రి, ఎంఎన్‌జే, ఆర్ఎస్‌పీ ఆస్పత్రుల డాక్టర్లు పాల్గొని కంటి, కేన్సర్, బీపీ, షుగర్, దంత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో లయన్ రమాదేవిరెడ్డి, డాక్టర్ ప్రఫుల్లారెడ్డి, గాయత్రిహిల్స్ అధ్యక్షుడు కె. రాఘవులు, వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులతో మతసామరస్యం


ఇఫ్తార్ విందులో పాల్గొన్న సిరాజ్ తదితరులు

రహమత్‌నగర్: రంజాన్ ఉపవాస దీక్షల నేపథ్యంలో మూడవ రోజైన ఆదివారం బోరబండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఇన్‌చార్జ్ సయ్యద్ సిరాజ్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు మహ్మద్ షఫీయుద్దీన్, అయాజ్, అహ్మద్, సల్మాన్, ముజీబ్‌లతో పాటు ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు. శ్రీరాంనగర్‌లోని ప్రపంచ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ రాష్ట్ర నాయకుడు మామిండ్ల నాగేష్ నేతృత్వంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ మేరాజ్‌అలీ, డాక్టర్ జమీల్ హసన్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

కులమతాల పేరుతో రెచ్చగొడుతున్నారు

బీజేపీపై బీఆర్ఎస్ నేత దాసోజు ఫైర్

హిమాయత్‌నగర్: కులమతాల పేర్లతో ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలకు భారతీయ జనతా పార్టీ పాల్పడుతోందని బీఆర్ఎస్ పార్టీ సిటీ ఇన్‌ఛార్జి దాసోజు శ్రావణ్ ఆరోపించారు. నరేంద్రమోదీ ప్రధాని అవ్వకముందు విదేశాల్లో ఉన్న నల్లడబ్బు తెస్తానంటూ ఊదరగొట్టి గెలిచాక దాని ఊసెత్తడం లేదని మండిపడ్డారు. ఆదివారం కింగ్‌కోఠిలోని ఈడెన్‌గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ స్థాయి ఆత్మీయ సమ్మేళనాన్ని మొదటిసారిగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దాసోజు శ్రావణ్ మాట్లాడుతూ.. ఉద్యమాల గడ్డగా ఖైరతాబాద్ నియోజకవర్గానికి పేరుందని, అందులో హిమాయత్‌నగర్‌కు ప్రత్యేక విశిష్టత ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం వంటగ్యాస్ మొదలు నిత్యావసర సరుకుల వరకు ప్రతిదీ ధరలను పెంచేసి పేద, మధ్య తరగతి వారిపై భారం మోపిందన్నారు. బీజేపీ పలు విధాలుగా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుంటే ఆ పార్టీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి ఓట్లు అడిగేందుకు ప్రజల వద్దకు ఏ విధంగా వస్తారో సమాధానం చెప్పాలన్నారు. బీజేపీలో చేరకపోతే ఈడీతో దాడులు చేసే స్థాయికి ఆ పార్టీ దిగజారిందన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ..ఏప్రిల్ నెల చివరికల్లా దళితబంధు డివిజన్‌లో ఎక్కువ మందికి వచ్చేలా చేస్తానన్నారు. మహిళలకు వడ్డీలేని రుణాలు ఇచ్చేందుకు తాను సీఎంతో మాట్లాడానని, త్వరలోనే ఆ రుణాలు వస్తాయన్నారు. ఇదిలా ఉండగా, బీఆర్ఎస్ పార్టీ కోసం ఎందరో మహిళలు కష్టపడుతున్నా పార్టీ గుర్తించడం లేదని మాజీ కార్పొరేటర్ హేమలత యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రిసోర్స్ పర్సన్ రమాదేవి మాట్లాడుతూ..ప్రభుత్వం నిర్వహించే అన్ని కార్యక్రమాల్లో తాము పాల్గొంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని, అయినా..తమకు జీతాలు రూ.4 వేలు ఇవ్వడం అత్యంత దారుణమన్నారు. రిసోర్స్ పర్సన్స్ జీతాలను పెంచాలని కోరుతూ ఆమె వినతి పత్రం అందజేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో అన్యాయం జరుగుతోందని, తమను ఎవ్వరూ పట్టించుకోవడంలేదని కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. దళితబంధును పేదలకు ఇవ్వాలని, కేవలం పార్టీ నాయకులు, తెలిసినవారికే కాదన్నారు.

స్టేజ్ ఎక్కుతూ కిందపడిన ఎమ్మెల్యే

హిమాయత్‌నగర్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే దానం సేజ్‌పైకి ఎక్కుతూ కిందపడ్డారు. సేజ్ పై మెట్టు ఎక్కిన తర్వాత కార్పెట్ కాళ్లకు అడ్డు తగలడంతో ఒక్కసారిగా కింద పడిపోయారు. వెంటనే ఆయనను కార్యకర్తలు పైకి లేపారు. అదృష్టవశాత్తు ఎలాంటి గాయాలు కాలేదు.



ఎమ్మెల్యే నాగేందర్, దాసోజు శ్రావణ్‌లకు వినతి పత్రం అందజేస్తున్న రిసోర్స్ పర్సన్స్

బాలికల ఉజ్వల భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టి

బంజారాహిల్స్: బాలికల ఉజ్వల భవిష్యత్‌పై ప్రత్యేక దృష్టి సారించామని బిల్డింగ్ బ్లాక్స్ గ్రూప్ చైర్మన్, ఎండీ ఎంవీ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. ఆడపిల్లలను శక్తివంతం చేయడం ద్వారా నిజమైన సంపదను సృష్టించే ఉద్దేశం నెరవేరుతుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల్లో సురక్షా, స్వశక్తి, ఆహ్లాద, ప్రేరణ అనే నాలుగు కార్యక్రమాల ద్వారా లక్షా 50 వేల మంది ఆడపిల్లల జీవితాలను మార్చడంలో తమ గ్రూప్ ముందుండటం గర్వించదగ్గ విషయమన్నారు. శంషాబాద్, భువనగిరిలలో భరోసా కేంద్రాలు నిర్మించామన్నారు. భరోసా అనేది మహిళలు, పిల్లల రక్షణ కోసం ఏర్పాటైన సంఘం అన్నారు. హింసకు గురైన మహిళలు, పిల్లలకు సమగ్ర సహాయం, మద్దతు అందించడం ఈ సంఘం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇంటిగ్రేటెడ్ సేవల ద్వారా మహిళలకు మెరుగైన రక్షణ, జీవన నాణ్యతను మెరుగుపర్చడంలో దోహదపడుతున్నామన్నారు. ఈ కేంద్రాల్లో కాన్ఫరెన్స్ హాళ్లు, కౌన్సెలింగ్ రూమ్‌లు, మెడికల్ కౌన్సెలింగ్ రూమ్ కూడా ఉంటాయని తెలిపారన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నం. 4లోని గాంధీపుర బస్తీలో శ్రీ పోచమ్మ–ఎల్లమ్మ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో నాల్గవ రోజైన ఆదివారం ఉదయం హోమం, మండపదేవతాపూజలు, క్షీరాధివాసం, సాయంత్రం శయ్యాధివాసం తదితర వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి ఈ కార్యక్రమాలను తిలకించి అమ్మవార్ల విగ్రహాలకు పూజలు చేశారు.


హోమంలో పాల్గొన్న బస్తీవాసులు

ముదిరాజ్‌లను బీసీ–'ఎ'లోకి మార్చాలి



డైరీని ఆవిష్కరిస్తున్న మెపా ప్రతినిధులు

పంజగుట్ట: ముదిరాజ్‌లను బీసీ–'డి' నుంచి బీసీ–'ఎ' లోకి మార్చాలని ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్ర జనాభాలో 14 నుంచి 16 శాతం ఉన్న ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో తీవ్ర వెనుకబాటుతనంలో ఉన్నారని మెపా నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మెపా డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రధానకార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ .. ముదిరాజ్‌లను బీసీ–'ఎ' లో కలపాలన్న అంశం సుప్రీకోర్టు నుంచి రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చి 166 రోజులైనా ఇప్పటివరకు ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెంకట రమణ, మధు, కట్ట శ్రీనివాస్, మహిళా విభాగం కన్వీనర్ రమాదేవి, సురేష్ ముదిరాజ్, పిట్ట నగేష్, జగన్ మోహన్ ముదిరాజ్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలు ఇంట్లోకి చొరబడి.. నగలు, నగదుతో ఉడాయింపు

చిన్నారులను మభ్యపెట్టి ఎత్తుకెళ్లిన దుండగుడు

బంజారాహిల్స్: పట్టపగలు ఇంట్లోకి ప్రవేశించిన ఓ యువకుడు ఇద్దరు చిన్నారులను మభ్యపెట్టి బంగారు ఆభరణాలు, నగదుతో ఉడాయించాడు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్‌లో నివసించే బోయిని నాగార్జున తన భార్యతో కలిసి ఉదయం 9 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. మధ్యాహ్నం 12.30కి కొడుకు, కూతురు స్కూల్ నుంచి ఇంటికి వచ్చి తలుపులు తెరిచారు. కొద్దిసేపట్లోనే ఓ యువకుడు వచ్చి దుస్తులు తీసుకురావాలని మీ నాన్న పంపించాడని ఆ ఇద్దరు చిన్నారులకు చెప్పాడు. వారిలో బాలుడికి రూ.10 ఇచ్చి బిస్కెట్ ప్యాకెట్ తీసుకురమ్మని బయటికి పంపాడు. కొద్దిసేపట్లోనే బెడ్‌రూమ్‌లోని అల్మారా తెరిచి అందులో ఉన్న బంగారు ఆభరణాలతో పాటు రూ. 55 వేల నగదు మూటగట్టుకొని ఉడాయించాడు. బిస్కెట్ ప్యాకెట్ తీసుకొని ఇంట్లోకి వచ్చిన బాలుడికి ఆ ఆగంతకుడు కనిపించలేదు. అల్మారాలో ఉన్న వస్తువులను వెతుకుతుండగా తాను చూశానని బాధితుడి కూతురు తెలిపింది. హుటాహుటిన ఇంటికి వచ్చిన నాగార్జున అల్మారాలో పరిశీలించగా బంగారు, ఆభరణాలు, నగదు కనిపించలేదు. అతడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇండియన్ ప్రజా కాంగ్రెస్‌లో పలువురి నియామకం

లిబర్టీ: ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవుల్లో పలువురిని నూతన నాయకత్వం నియమించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ ఆదేశాల మేరకు ఆదివారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసుదేవరావు ఆదేశాలు జారీ చేశారు. ఇండియన్ ప్రజా కాంగ్రెస్ జాతీయ సంయుక్త కార్యదర్శిగా పి.అరుణరెడ్డి, జాతీయ సమన్వయకర్తగా పి.రామ సుబ్బారెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ ఇన్‌చార్జ్‌గా ఎం.జగదీష్, గ్రేటర్ హైదరాబాద్ పార్టీ అధ్యక్షుడిగా నాగిళ్ల నవీన్, పార్టీ ప్రచార కార్యదర్శిగా కె.బాలాజీ, పార్టీ యువన విభాగం కార్యదర్శిగా మానసను నియమించారు. పదవులు పొందిన వారంతా పార్టీ బలోపేతానికి పాటుపడాలని వాసుదేవరావు అన్నారు.

'ప్రతిపక్షాలపై కేంద్రం కక్ష సాధింపు'

లిబర్టీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను పావులుగా వాడుకుంటూ ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి ఆరోపించారు. ఆదివారం దళ్ కార్యాలయంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను మోదీ ప్రభుత్వం అపహాస్యం చేస్తోందని ఆరోపించారు. ఇప్పటి వరకు ఈడీ, ఐటీ, సీబీఐ వంటి సంస్థలను వినియోగించి పలు విపక్ష పార్టీ నేతలపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురి చేసిన మోదీ ప్రభుత్వం తాజాగా, లోక్‌సభ సచివాలయాన్ని ఉపయోగించుకొని రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసిందని ఆరోపించారు. సమావేశంలో నవ్య, సుభాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బేరసారాలు నిజమే!

- టీడీపీ నుంచి నాకు ఆఫర్ ఇచ్చారు: రాజోలు ఎమ్మెల్యే రాపాక



సఖినేటిపల్లి/మలికిపురం: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయాలంటూ ఆ పార్టీ నుంచి తనకు భారీ ఆఫర్ అందినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు శాసనసభ్యుడు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు వెల్లడించారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. దీనిపై ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. నీతి, నిజాయితీతో పని చేయాలని, అవినీతికి పాల్పడకూడదని కార్యకర్తలకు తాను సూచించినట్లు చెప్పారు. తాను అక్రమాలకు పాల్పడాలనుకుంటే, తప్పుగా ఓటు వేస్తే కనీసం రూ.10 కోట్లు వచ్చేవని చెప్పానన్నారు. 'నాకు టీడీపీ నుంచి ఆఫర్ వచ్చింది. పార్టీలో మంచి భవిష్యత్తు ఉంటుందని, ఫైనాన్షియల్ మేటర్ మాట్లాడదామని ఉండి ఎమ్మెల్యే రామరాజు నాతో చెప్పారు. నేను వెంటనే తిరస్కరించా. క్రాస్ ఓటు చేయబోనని చెప్పాను. దాని గురించి నాతో మాట్లాడవద్దని స్పష్టం చేశా. అంతకుముందు రోజు నా స్నేహితుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు కేఎస్ఎన్ రాజుతో కూడా ఆయన ఇదే విషయం ప్రస్తావించారు. మీ ఎమ్మెల్యే మాకు అనుకూలంగా ఓటేస్తే మేం అన్ని రకాలుగా చూసుకుంటామని చెప్పారు. అయితే కేఎస్ఎన్ రాజు.. ఈ విషయం మా ఎమ్మెల్యే(రాపాక)తో చెప్పబోనని, ఇలాంటి వాటికి ఆయన ఒప్పుకోరని స్పష్టం చేశారు. తరువాత రామరాజు నన్ను నేరుగా అప్రోచ్ కావడంతో క్రాస్ ఓటు చేయబోనని తేల్చి చెప్పా' అని ఎమ్మెల్యే రాపాక వెల్లడించారు.

విజయవాడ-షిర్డీ విమాన సర్వీసులు ప్రారంభం

విమానాశ్రయం(గన్నవరం): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం) నుంచి ప్రముఖ పుణ్యక్షేత్రమైన షిర్డీకి ఇండిగో సంస్థ ఆదివారం నుంచి విమాన సర్వీసులను ప్రారంభించింది. మధ్యాహ్నం 12.25 గంటలకు సుమారు 70 మంది ప్రయాణికులతో విమానం షిర్డీకి బయల్దేరి వెళ్లింది. అక్కడి నుంచి 66 మంది ప్రయాణికులతో విమానం తిరిగి సాయంత్రం 4.35 గంటలకు గన్నవరం చేరుకుంది. రోజూ అందుబాటులో ఉండే ఈ విమాన సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఇండిగో ప్రతినిధులు కోరారు.

కథ.. స్క్రీన్‌ప్లే.. దర్శకత్వం.. నారా చంద్రబాబునాయుడు

ఓటుకు కోట్లు 2.0

పోలింగ్ రోజు ఏపీ అసెంబ్లీ లాబీ వేదికగా కొనసాగిన ప్రలోభాల పర్వం



సాక్షి, అమరావతి:

చెప్పులు రుచి మరిగిన కుక్కకు
చెరకు తీపి రుచిస్తుందా?
పుట్టుకతో వచ్చిన గుణం
పుడమిలో కలిసేదాకా పోదు కదా!
బేరసారాలే ఊపిరిగా బతికే
నేతల నైజం కూడా అంతే!
కుమ్మక్కు రాజకీయాలు,
కొనుగోళ్లే వారి లక్షణం.. లక్ష్యం!

ఎనిమిదేళ్ల క్రితం.. తెలంగాణ శాసన మండలికి 2015లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేల కొనుగోళ్లకు ప్రయత్నించి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు ఏపీ శాసన మండలి ఎన్నికల్లోనూ అదే విధానాన్ని నమ్ముకుంది. ఓటుకు కోట్లను ఎర వేసింది. సంఖ్యాబలం లేకపోయినా బేరసారాలకు దిగి నిస్సిగ్గుగా క్రాస్ ఓటింగ్‌ను ప్రోత్సహించింది. ఆది నుంచి తాను నమ్ముకున్న కొనుగోళ్లు, కుమ్మక్కు రాజకీయాలనే మరోసారి అనుసరించింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించడంలో విఫలమైన వారితోపాటు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ టికెట్ దక్కదనే సంకేతాలున్న వారిని ప్రలోభాలకు గురి చేసి అనైతిక చర్యలకు పాల్పడింది. రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ వాస్తవాలను వెల్లడించడంతో చంద్రబాబు స్క్రిప్టు ప్రకారం అమలైన 'ఓటుకు కోట్లు స్కాం 2.0' బహిర్గతమైంది.

- **బలం లేదని స్పష్టంగా తెలిసినా..**

ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అయిన ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు తాజాగా జరిగిన ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ ద్వారా టీడీపీ తన అభ్యర్థి పంచుమర్తి అనూరాధను గట్టెక్కించుకోగలిగింది. శాసనసభలో మొత్తం సభ్యుల సంఖ్య 175 కాగా వైఎస్సార్‌సీపీకి 151 మంది సభ్యులున్నారు. టీడీపీ తరఫున గెలిచిన 23 మందిలో నలుగురు ఆదిలోనే ఆ పార్టీకి దూరంగా జరగడంతో సాంకేతికంగా ఉన్న సభ్యులు 19 మంది మాత్రమే. జనసేన నుంచి గెలిచిన ఎమ్మెల్యే రాపాక కూడా ఆ పార్టీకి దూరంగానే ఉంటున్నారు. టీడీపీ, జనసేన విధానాలతో విభేదించిన ఆ ఐదుగురు ఎమ్మెల్యేలూ వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తున్నారు. అంటే అధికార పార్టీకి సాంకేతికంగా ఉన్న సభ్యులు 156 అని స్పష్టమవుతోంది. ఒక్కో ఎమ్మెల్సీ స్థానాన్ని గెలుపొందాలంటే 22 మంది ఎమ్మెల్యేల ప్రథమ ప్రాధాన్యత ఓట్లు అవసరం. వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన ఆధిక్యత ఉన్నందున ఖాళీ అయిన ఏడు స్థానాలకు తన అభ్యర్థులను బరిలోకి దించింది. గెలిచేందుకు తగిన బలం లేకపోయినప్పటికీ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఆ పార్టీ అభ్యర్థిని పోటీకి పెట్టారు. తగిన బలం లేకుండా టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించడాన్ని బట్టి చూస్తుంటే తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల తరహాలోనే రూ.కోట్లు ఎర వేసి బేరసారాలకు చంద్రబాబు వ్యూహం రచించినట్లు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డితోపాటు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు ఆదిలోనే చెప్పారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ.పది కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకూ వెదజల్లి కొనుగోలు చేసి టీడీపీ అభ్యర్థిని చంద్రబాబు గెలిపించుకున్నారని సజ్జలతోపాటు పార్టీ నేతలు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే రాపాక వాస్తవాలను వెల్లడించడంతో ఓటుకు కోట్లు స్కాం 2.0 బట్టబయలైంది.

- **అసెంబ్లీ లాబీ వేదికగా పదేపదే ప్రలోభాలు..**

రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ జనసేన నుంచి గెలుపొందినా పవన్ కల్యాణ్ పోకడలను నిరసిస్తూ ఆ పార్టీకి దూరంగా ఉంటున్నారు. సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో సామాజిక విప్లవాన్ని ఆవిష్కరించిన సీఎం వైఎస్ జగన్ వెంట ప్రజాభీష్టం ప్రకారం నడుస్తున్నారు. తాజాగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాపాకను ప్రలోభాలకు గురి చేసి తమ వైపునకు తిప్పుకునేందుకు ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే మంతెన రామరాజును చంద్రబాబు బరిలోకి దించారు. తన మిత్రుడు కేఎస్ఎన్ రాజు ద్వారా టీడీపీ ఎమ్మెల్యే మంతెన రామరాజు ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించినట్లు ఎమ్మెల్యే రాపాక తాజాగా మీడియాకు బహిర్గతం చేశారు. టీడీపీ అభ్యర్థికి ఓటు వేస్తే పెద్ద ఎత్తున డబ్బులతో పాటు పార్టీలో మంచి స్థానం కల్పిస్తామని రామరాజు తనకు ప్రతిపాదన పంపారని వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ రోజు కూడా లాబీల్లో టీడీపీ ఎమ్మెల్యే మంతెన రామరాజు తనను పక్కకు పిలిచి మరోసారి ప్రలోభపెట్టారని రాపాక చెప్పారు. తనను పదేపదే ప్రలోభాలకు గురి చేసినా డబ్బులకు అమ్ముడుపోయి వ్యక్తిత్వాన్ని పోగొట్టుకోలేనని మరోసారి తేల్చి చెప్పినట్లు రాపాక పేర్కొన్నారు. అనంతరం మరో ఇద్దరు ఎమ్మెల్యేలను కూడా టీడీపీ ప్రలోభాలకు గురిచేసిన విషయం తెలిసిందన్నారు. కాగా ఈ అంశంపై ఉండి ఎమ్మెల్యే రామరాజు మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ లాబీల్లో ఎమ్మెల్యే రాపాకను కలసి మాట్లాడిన విషయం వాస్తవమేనని అంగీకరించడం గమనార్హం. అయితే రాపాకను ప్రలోభపెట్టలేదంటూ దాటవేసే యత్నం చేశారు.

ప్రలోభాలకు ఆదిగురువు

రాజకీయాల్లో ప్రలోభాల పర్వం చంద్రబాబుతోనే మొదలైందని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలు ఎన్నుకున్న ఎన్టీఆర్‌కు 1995లో వెన్నుపోటు పొడిచి టీడీపీ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురి చేసి చంద్రబాబు అధికారం చేజిక్కించుకున్న వైనాన్ని గుర్తుచేస్తున్నారు. ఇక రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ శాసన మండలికి 2015లో ఎమ్మెల్యేల కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంఖ్యాబలం లేకపోయినా టీడీపీ అభ్యర్థి వేం నరేంద్రరెడ్డిని చంద్రబాబు బరిలోకి దించారు. రూ.కోట్లు ఎర వేసి ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు తన శిష్యుడు రేవంత్‌రెడ్డిని పురమాయించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు డబ్బుల కట్టలతో కూడిన బ్యాగ్‌ను అందచేస్తుండగా తెలంగాణ ఏసీబీ సాక్ష్యాధారాలతో రెడ్ హ్యాండెడ్‌గా 2015 మే 31న పట్టుకుంది. ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు రాష్ట్ర ప్రయోజనాలను తెలంగాణ సర్కార్‌కు తాకట్టుపెట్టి మరీ రాత్రికి రాత్రే చంద్రబాబు హైదరాబాద్ నుంచి పరారై కృష్ణా కరకట్టపై ఉండవల్లి వద్ద ఉన్న అక్రమ నివాసానికి చేరుకున్నారు. తాజాగా శాసనమండలికి ఎమ్మెల్యేల కోటాలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇదే రీతిలో ఓటుకు నోట్లు కుంభకోణానికి చంద్రబాబు పాల్పడటం గమనార్హం. అందుకే పుట్టుకతో వచ్చిన గుణం చచ్చే దాకా పోదనే నానుడి ఆయనకు అతికినట్లు సరిపోతుందని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

బదిలీ నిబంధనపై గుబులు

- ఒకేచోట మూడేళ్లు దాటితే బదిలీ తప్పదన్న ఈపీఎఫ్‌ఓ
- క్లరికల్ ఉద్యోగుల్లో ఆందోళన
- పిల్లల చదువులు ఇబ్బందుల్లో పడతాయని ఆవేదన

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ) పరిధిలో ఉద్యోగులకు సంబంధించి సంస్థ తీసుకొచ్చిన నూతన బదిలీ విధానం-2022 క్లరికల్ స్థాయి ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈపీఎఫ్‌ఓలో క్లర్క్(సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్) లేదా సీనియర్ క్లర్క్ (సీనియర్ సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్) ఒకేచోట మూడు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకుంటే వెంటనే ఇతర కార్యాలయానికి బదిలీ చేయాలనేది పాలసీలోని ప్రధానాంశం. ఈపీఎఫ్‌ఓ కార్యక్రమాల అమలులో పారదర్శకత పాటించడంతో పాటు పనుల్లో వేగం పెంచేందుకు ఈ తరహా మార్పు తప్పనిసరి అని సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు గతేడాది డిసెంబర్ 12న కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి ఏటా నిర్వహించే బదిలీలకు సంబంధించిన నిబంధనలను వివరించింది. అయితే ఎలాంటి నిర్ణయాధికారాలు లేని క్లర్క్ స్థాయి ఉద్యోగికి కూడా ఈ నిబంధన వర్తింపజేసి మూడేళ్లకోసారి బదిలీ చేయడం వల్ల వారి కుటుంబాల భవిష్యత్ ఇబ్బందికరంగా మారుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

కావాలంటే సెక్షన్లు మార్చండి..

ఈపీఎఫ్‌ఓకు సంబంధించి తెలంగాణలో ఎనిమిది చోట్ల కార్యాలయాలున్నాయి. హైదరాబాద్‌లోని బర్కత్‌పురా, మాదాపూర్, కూకట్‌పల్లి, పటాన్‌చెరుతో పాటు నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, సిద్దిపేటలో ఇవి కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కడప, విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరులో ఈ కార్యాలయాలున్నాయి. రెండు రాష్ట్రాల్లో కలిపి దాదాపు 2 వేల వరకు క్లరికల్ ఉద్యోగులుంటారు. కాగా ఈపీఎఫ్‌ఓ తాజా నిబంధనతో వీరు ఆ రాష్ట్ర పరిధిలోని ఏ కార్యాలయానికైనా బదిలీ అయ్యే అవకాశం ఏర్పడింది. దీన్ని అమలు చేస్తే తమ పిల్లల చదువులు తీవ్ర ఇబ్బందుల్లో పడతాయని, భవిష్యత్తులో స్థానికత అంశం పెద్ద సమస్యగా మారుతుందని ఆందోళ వ్యక్తం చేస్తున్నారు. బదిలీ చేయాలనుకుంటే ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి కాకుండా.. ప్రస్తుతం పనిచేస్తున్న కార్యాలయంలోనే సెక్షన్ల మార్పు చేస్తే ఉద్యోగికి వెసులుబాటు ఉంటుందని అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

దీనివల్ల ఉద్యోగికి బదిలీ సమయంలో ఇచ్చే ఒక నెల అదనపు వేతనానికి సంబంధించిన నిధులు కూడా సంస్థకు మిగులుతాయని చెబుతున్నారు. ఈ మేరకు క్లరికల్ కేడర్ ఉద్యోగులు ప్రభుత్వానికి వినతులు సమర్పిస్తున్నారు. మరోవైపు నూతన పాలసీ అమల్లోకి వచ్చి రెండు నెలలు కావస్తుండటం, త్వరలోనే బదిలీలు చేసే అవకాశం ఉండటంతో.. ఉద్యోగుల సంఘం న్యాయ పోరాటానికి కూడా సిద్ధమవుతోంది.

సాయుధ బలగాల సంక్షేమం.. మోదీ ప్రభుత్వ ప్రాధాన్యం

రేపు హకీంపేటలో ఎక్స్‌సర్వీస్‌మెన్ జాబ్‌మేళా: కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: దేశ సరిహద్దుల రక్షణ కోసం సర్వస్వాన్ని త్యాగం చేసే భద్రతాబలగాల సంక్షేమం కోసం కేంద్రం కృతనిశ్చయంతో పనిచేస్తోందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఈనెల 28న హకీంపేటలో ఎక్స్‌సర్వీస్‌మెన్ కోసం భారీ స్థాయిలో జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రక్షణ శాఖ విభాగమైన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీసెటిల్‌మెంట్, రిటైర్ అయిన సాయుధ బలగాల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా సెమినార్లు, జాబ్‌మేళాలు నిర్వహిస్తోందన్నారు. సుశిక్షితులైన, క్రమశిక్షణ కలిగిన ఎక్స్‌సర్వీస్‌మెన్‌కు కార్పొరేట్ కంపెనీలు, పీఎస్‌యూలకు ఈ సెమినార్లు వారధిగా పనిచేస్తున్నాయని తెలిపారు. జాబ్ మేళాల ద్వారా ఇటు మాజీ సైనిక ఉద్యోగులకు, కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూరుతుందని కిషన్ రెడ్డి చెప్పారు. 'ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ, పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థలను డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీసెటిల్మెంట్ సమన్వయ పరుస్తోంది. రక్షణ శాఖ కూడా ఆత్మనిర్భర్ భారత్ నినాదంతో స్వయం సమృద్ధి సాధన దిశగా ముందుకెళ్తోంది. తెలంగాణలోని యువత, స్టార్టప్ కంపెనీలు కూడా ఈ అవకాశాలను సద్వినియోగపరుచుకుంటున్నాయి. రక్షణ రంగంలో ఎగుమతుల ప్రోత్సాహానికి సరికొత్త ప్రాజెక్టులు వస్తున్నాయి. ఇన్నాళ్లుగా కొత్త తరం మిస్సైళ్లు, ట్యాంకులు, ఆధునిక ఆయుధ వ్యవస్థ, కమ్యూనికేషన్ సిస్టమ్, ఎయిర్ క్రాఫ్ట్స్, ఫ్రిగేట్స్, సిమ్యులేటర్స్, రాడార్ వంటి వాటిని వినియోగించిన ఎక్స్‌సర్వీస్‌మెన్.. ఈ కంపెనీల అవసరాలకు సరిపోతారు' అని వివరించారు. అడ్మినిస్ట్రేటివ్ నైపుణ్యం, జనరల్ మేనేజ్‌మెంట్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్, ఎక్విప్‌మెంట్ టెక్నికల్ హ్యాండ్లింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, డేటా హ్యాండ్లింగ్, కమ్యూనికేషన్ స్పెక్ట్రమ్ మేనేజ్‌మెంట్ స్కిల్స్ వంటి రంగాల్లో మాజీ సైనిక ఉద్యోగులకు విస్తృత అవకాశాలుంటాయన్నారు. మరోవైపు, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీసెటిల్మెంట్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ జాబ్‌మేళా ద్వారా రిటైర్ అయిన, రిటైర్ అవుతున్న సైనికఉద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపింది. త్రివిధదళాల్లో పనిచేసిన వారు 37 నుంచి 57 ఏళ్ల లోపు వారు ఈ ఉద్యోగాలకోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. ఈ మేళాలో పాల్గొనాల్సిన వారు. dgrindia.gov.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది.

నగర వార్తలు

పద్మశాలీల అభ్యున్నతికి కృషి చేద్దాం



తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం అవిర్భావ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎల్.రమణ

కాచిగూడ: రాజ్‌మోహల్ల పద్మశాలి సంఘాలకే గుర్తింపు ఉంటుందని, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ నిర్మించిన సంఘం నుండే పద్మశాలీల అభ్యున్నతికి అందరం ఐక్యంగా కృషి చేద్దామని ఎమ్మెల్సీ ఎల్.రమణ పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం నారాయణగూడ రాజ్‌మోహల్లలోని పద్మశాలీ భవన్‌లో అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం కన్వీనర్‌గా మచ్చ ప్రభాకర్ రావును నియమించారు. పద్మశాలీల అభ్యున్నతిని కాంక్షించే ప్రతి ఒక్కరూ పద్మశాలి భవన్ కేంద్రంగా పనిచేసే సంఘాలలో పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వరంగల్ మేయర్ గుండు సుధారాణి, పవర్ లూమ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ పాల్గొన్నారు.

'పార్టీలో కార్యకర్తలందరికీ సముచితస్థానం'



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి

బాలానగర్: బీజేపీలో కార్యకర్తలందరికీ సముచిత స్థానం లభిస్తుందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి అన్నారు. ఆదివారం బాలానగర్‌లోని తెలంగాణ గార్డెన్స్‌లో నిర్వహించిన సమావేశంలో కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి సుమారు 500 మందికి పైగా వివిధ పార్టీల నుంచి కార్యకర్తలు, నాయకులు బీజేపీలో వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయశాంతి మాట్లాడుతూ తెలంగాణలో అవినీతి పాలన నడుస్తుందన్నారు. బ్రోకర్, లిక్కర్, లీకేజిలతో స్కామ్‌లతో భ్రష్టు పట్టిందని అన్నారు. బీజేపీ పాలనలోనే భారతదేశం విశ్వగురువుగా అవతరించిందని అభివర్ణించారు. మేడ్చల్ జిల్లా అర్బన్ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, నారాయణపేట జిల్లా ఇన్‌చార్జి మాధవరం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో వరల్డ్ స్పారో డే



బర్డ్‌వాక్‌ను ప్రారంభిస్తున్న అధికారులు



వీక్షకులను అలరించిన పక్షులు

మణికొండ: హైదరాబాద్ వాసులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, వినోదాన్ని పంచేందుకు తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో ఆదివారం వరల్డ్ స్పారో డే సందర్భంగా బర్డ్ వాక్‌ను నిర్వహించారు. దాంతో తరలివచ్చిన పక్షి ప్రేమికులు వాటిని వీక్షించటంతో పాటు ఫొటోలను తీసుకున్నారు. మొదటి సారిగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని టీఎస్‌టీడీసీ, ఎకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ జి.స్కైలాబ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కును.. ఎంతో ఆకర్షణీయంగా, పక్షుల ఆవాసానికి అనువుగా ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ కార్పొరేషన్ అనేక చర్యలు తీసుకుంటుందన్నారు. పార్కును వీక్షించేందుకు వచ్చే వారికి ట్రెక్కింగ్ రూట్స్, వాకింగ్‌పాత్, గజేబోలు, రచ్చబండలు, ఓపెన్‌జిమ్ లాంటి సౌకర్యాలను కల్పించామన్నారు. వైస్ చైర్మెన్, ఎండీ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమ అటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్న ప్రతి పార్కులో పక్షులు, జంతువులకు ఆవాసంగా తీర్చిదిద్దటంతో పాటు విజిటర్స్‌కు అనుగుణంగా అనేక సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో బాగా నీడను ఇచ్చే మొక్కలనే ఎక్కువగా నాటామన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎఫ్‌డీసీ, ఎకో టూరిజం ప్రాజెక్ట్ మేనేజర్ కె.సుమన్, రేంజ్ అధికారులు లక్ష్మారెడ్డి, మధు, సూపర్‌వైజర్లు శ్రీకాంత్, బర్డింగ్ పాల్స్ కల్యాణ్, విజయ్, స్వాతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 30 రకాల పక్షులను వాకర్స్ గుర్తించారు.



పక్షుల ఫొటోలు తీసుకుంటున్న పక్షి ప్రేమికులు

క్రమబద్ధీకరణపై రక్షణ శాఖ కొర్రీ

సాక్షి, సిటీబ్యూరో : పూర్వ నిజాం సైన్యానికి చెందిన మాజీ సైనికుల కుటుంబాల రెసిడెన్షియల్ క్వార్టర్స్ క్రమబద్ధీకరణపై మరోమారు ఆర్మీ కొర్రీ వేసింది. దశాబ్దాల కాలంగా ఉంటున్న నివాస గృహాలపై యాజమాన్య హక్కు వర్తింపు ప్రక్రియ ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు. తాజాగా జీవో 118 కింద క్వార్టర్స్ క్రమబద్ధీకరణపై ఆర్మీ అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని మాజీ సైనిక కుటుంబాలకు గృహాలపై హక్కులు కల్పించినప్పటి ఆర్మీ అభ్యంతరంతో ప్రక్రియకు మధ్యలో బ్రేక్ పడింది. తాజాగా అదే పరిస్థితి పునరావృతమవుతున్నట్లు తెలుస్తోంది.

ఐదు ప్రాంతాల్లో..

నిజాం పాలనలో అప్పటి సైనిక కుటుంబాలకు నగరంలోని ఐదు ప్రాంతాల్లో నివాస గృహాలను కేటాయించారు. 1948లో పోలీసు చర్య, హైదరాబాద్ స్టేట్ విలీనం తర్వాత భారత ప్రభుత్వం అప్పటి సైన్యం విభాగం ఆస్తులను సైతం స్వాధీనం చేసుకుంది. నగరంలోని బంజారా దర్వాజా (పాతలాయం, గోల్కొండ), బ్యాండ్ లైన్స్(ఫతే మైదాన్, నాంపల్లి), మహమ్మదీ లైన్స్ (2వ లాన్సర్, షేక్‌పేట్), మాసబ్ లైన్స్ (ఆసిఫ్‌నగర్), సైఫాబాద్ లైన్స్ (ఆసిఫ్‌నగర్)లో సుమారు 800 పైగా మాజీ సైనికుల కుటుంబాలు ఉండగా వారిని క్వార్టర్స్‌లో తాత్కాలికంగా అద్దె ప్రాతిపదికన పునరావాసం కల్పించింది. ఆ తర్వాత మాజీ సైనికుల కుటుంబాలు ఐక్యకార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసుకొని క్వార్టర్స్‌పై యాజమాన్య హక్కులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ వస్తున్నాయి.

ఉమ్మడి ఏపీలో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో క్వార్టర్స్ క్రమబద్ధీకరణ కోసం జీవో నం. 264, 166 జారీ చేసి దరఖాస్తులు స్వీకరించారు. అప్పట్లో సుమారు 527 దరఖాస్తులు రాగా అందులో కేవలం 497 నివాసితులు మాత్రమే అద్దె స్లిప్పులు, ఓటర్ ఐడీ ఆధారంగా దరఖాస్తులను చేసుకున్నాయి. నివాసితులు సమర్పించిన కార్డులు, ఇతర పత్రాలు పరిశీలించి 486 దరఖాస్తులను ఆమోదించారు అందులో 117 క్వార్టర్ల క్రమబద్ధీకరణ (టైటిల్ బదిలీ) పత్రాలను జారీ చేయగా, 366 మందికి పత్రాలు సిద్ధమవుతుండగా, మిలటరీ అధికారులు క్వార్టర్స్ ఆర్మీ ఆస్తులని క్రమబద్ధీకరణపై అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో క్రమబద్ధీకరణ ప్రక్రియ అర్ధంతరంగా ఆగిపోయింది.

తాజాగా 695 దరఖాస్తులు

రాష్ట్ర ప్రభుత్వం మరోమారు క్వార్టర్స్ క్రమబద్ధీకరణకు వెసులుబాటు కల్పించడంతో జీవో 118 జారీ చేసింది. నగరంలోని ఐదు కాలనీలోని సుమారు 815 కుటుంబాలు నుంచి దరఖాస్తులు రావచ్చని రెవెన్యూ యంత్రాంగం భావించగా 695 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. అందులో 89 దరఖాస్తులపై క్షేత్ర స్థాయి విచారణ జరగగా, 606 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. క్షేత్ర స్థాయి విచారణ పూర్తయిన దరఖాస్తులను సీసీఎల్ఏకు సిఫార్సు చేశారు. తిరిగి మిలటరీ అధికారుల అభ్యంతరంతో ప్రక్రియ మళ్లీ పెండింగ్‌లో పడినట్లు తెలుస్తోంది.

రజకుల సమస్యలను పరిష్కరించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: రజకుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి ఎంబీసీ చైర్మన్‌ని రజకులకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం విద్యానగర్ బీసీ భవన్‌లో తెలంగాణ గాడ్గే రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పెద్దపూరే బ్రహ్మయ్యను ఆర్.కృష్ణయ్య ఎన్నుకొని నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య, పెద్దవైరే బ్రహ్మయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా రజకులకు ప్రభుత్వం వల్ల పూర్తిగా న్యాయం జరగలేదని రజకుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో కార్యాచరణ రూపొందించుకొని ఉద్యమాల బాట చేపడితే గానీ సమస్యలు పరిష్కారం కావని అన్నారు. తెలంగాణ గాడ్గే రజక సంఘం ఉపాధ్యక్షుడిగా గుండ్రనరం చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా వడినాల మడివేలు, ట్రెజరుగా నిరంజన్, జాయింట్ సెక్రటరీగా మహేందర్ తదితరులను ఎన్నుకున్నారు.

సాంకేతిక మార్పులతో శస్త్రచికిత్సలు సులభం



జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న బూర నర్సయ్యగౌడ్

రాయదుర్గం: వైద్య రంగంలో ప్రస్తుతం వస్తున్న సాంకేతిక మార్పులతో నేటి తరం వారికి శస్త్ర చికిత్సలు చేయడం సులభంగా మారిందని సీనియర్ సర్జికల్ గ్రాస్ట్రోంట్రోలజిస్ట్, మాజీ పార్లమెంటు సభ్యులు బూర నర్సయ్యగౌడ్ పేర్కొన్నారు. నల్లగండ్లలోని సిటిజన్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నానక్‌రాంగూడ లోని షరటాన్‌హోటల్‌లో 'పునరావృత్త ఇన్సిషినల్ హెర్నియా' అనే అంశంపై 4వ జాతీయ లైవ్ వర్క్‌షాప్‌ను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వైద్యాధికారులు డాక్టర్ జగదీశ్వర్‌గౌడ్, డాక్టర్ దీపక్‌శర్మ పాల్గొన్నారు.

వకీలుగా వక్ఫ్ బోర్డు బాధితులకు సహాయం చేస్తా

ఎమ్మెల్యే రఘునందన్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

బోడుప్పల్: అధికార పార్టీ అనాలోచిత నిర్ణయాలతో రోడ్డున పడిన 7 వేల కుటుంబాలకు తమ పార్టీ తరుపున మద్దుతు ఉండడంతోపాటు వకీలుగా వక్ఫ్ బోర్డు బాధితులకు సహాయం చేస్తానని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. బోడుప్పల్‌లో బొమ్మక్ వివి ఎస్ గార్డెన్‌లో ఆదివారం వక్ఫ్ బోర్డు బాధితుల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 40 ఏళ్లలో 7వేల కుటుంబాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్థలాలు కొనుక్కొని అనుమతులు తీసుకుని ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. కొంత మంది దుర్మార్గపు ఆలోచనల వల్ల లేని సమస్యను ఉన్నట్లు సృష్టించారన్నారు. మున్సిపల్ శాఖను కేటీఆర్ నిర్వహిస్తున్నాడు కాబట్టి ఈసమస్యను ఆయనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ చాడ సురేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

గ్లోబల్ అవకాశాలతో నగర అభివృద్ధి



సాక్షి, సిటీ బ్యూరో: నగరం వేదికగా పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి చూపిస్తున్నారని టి-హబ్ హైదరాబాద్ సీఈవో మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. కార్పొరేట్ కనెక్షన్స్ సంస్థ (సీసీ హైదరాబాద్-1) ఆధ్వర్యంలో మొట్టమొదటి నగరంలో ప్రారంభించింది. ఆదివారం ఫలక్ నూమా ప్యాలెస్ వేదికగా జరిగిన ఈ ప్రారంభ కార్యక్రమంలో మహంకాళి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ..., మహమ్మారి సమయంలో విశేష సేవలందించిన నగరం ప్రపంచానికి టీకాల రాజధానిగా అవతరించిందని అన్నారు. . ఇక్కడి వాతావరణం, ప్రజల ఆత్మీయత బెంగళూరును సైతం వెనక్కు నెట్టిందని అన్నారు. కార్యక్రమంలో భాగంగా లైవ్ సూఫీ బృందం ఆలపించిన పాటలు ఆకట్టుకున్నాయి.



5కే మెగా హార్ట్ రన్


మాదాపూర్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో హెల్తీ హార్ట్‌కేర్ పట్ల అవగాహన కల్పించడానికి రన్‌ను ఏర్పాటు చేసినట్టు యశోద హస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ గోరుగంటి రవీందర్‌రావు పేర్కొన్నారు. మాదాపూర్ యశోద హస్పిటల్ వద్ద శనివారం టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో 5కే మెగా హార్ట్ రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవగాహన రన్ యశోద హస్పిటల్ హైటెక్‌సిటీ నుంచి టీసీఎస్ డెక్కన్ పార్కు వరకు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ భరత్‌పురోహిత్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజన్నతో పాటు ఐటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సన్నిధి

గురువాణి

ఆగు! జవాబు చెప్పి ముందుకు కదులు!!!

ఏదయినా ఒక ముఖ్యమైన పని చేద్దామనుకున్నప్పుడు మనలోంచి అనేక భావాలు ఒక్కసారి బయటికి వస్తాయి. ఎలా అంటే... మండుతున్న కట్టెను నేలకేసి కొడితే చెలరేగే నిప్పురవ్వల్లాగా అవి లేస్తాయి. అప్పుడు మనలో ఘర్షణ మొదలవుతుంది. ఈ ఘర్షణ మీలో ఉన్న మిమ్మల్ని ఐదు ప్రశ్నలతో నిలదీస్తుందనీ, వాటిలో ఏది మీరు ఎంచుకుంటారో దాన్ని బట్టి మీ స్వభావాన్ని సమాజం అంచనా కడుతుంది. మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం కూడా తన స్వీయరచన 'ఇండామిటబుల్ స్పిరిట్'లో ఇదే చెప్పారు.



మీరేదయినా పని సంకల్పించుకుని దాని అమలుపై మీమాంసలో ఉన్నప్పుడు మొదట మీలోని పిరికితనం ఒక ప్రశ్న వేస్తుంది..ఇది నీకు ప్రమాదకరం కాదు కదా! అని... అంటే 'నాకు ఏ ఇబ్బందీ లేదు, నా క్షేమానికి భంగపాటు కలగదు' అని జవాబు ఇచ్చుకుని ముందుకు సాగారనుకోండి. ఎప్పుడూ తన క్షేమం గురించే చూసుకొనేవాడు...ఇతరుల క్షేమం గురించి పట్టించుకోడని సమాజం అర్థం చేసుకుంటుంది.

మీలో ఉన్న దురాశ మిమ్మల్ని ఆపి 'ఈ పని చేస్తే మనకేమిటి లాభం? మనకేమయినా మిగులుతుందా?' అంటుంది. 'నాకు బాగా కలిసొస్తుంది. బాగా వెనకేసుకోవచ్చు కూడా' అని జవాబిచ్చారనుకోండి. ఇంత ఆశబోతు, ప్రతిదానికీ నాకేమిటని చూసుకునేవాడివల్ల నలుగురికీ ఉపయోగం లేకపోయినా వీడితో జాగ్రత్తగా ఉండాలనుకుంటుంది సమాజం.

వెంటనే గర్వం మీ దారికి అడ్డు తగిలి 'క్షేమం, లాభంసంగతి దేముడెరుగు. కనీసం నీకు పేరయినా వస్తుందా.. నిన్ను గురించి నలుగురు మంచిగా చెప్పుకుంటారా?' అని అడుగుతుంది. ఎంతసేపూ పేరుకోసం ఆరాటపడతాడు తప్ప మిగిలినవి పట్టించుకోడు... అని సమాజం అనుకుని మిమ్మల్ని దూరంగా ఉంచుతుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

దాటుకుని పోబోతున్న మీకు మీ ఆకాంక్ష అడ్డుతగులుతుంది. ''అవన్నీ వస్తాయో రావో నాకు తెలియదు. కనీసం సుఖపడతావా.. నీ శరీరానికికానీ, మనసుకు కానీ సుఖం లభిస్తుందా?' అంటుంది. 'తన వరకు సుఖంగా ఉంటేచాలనుకుంటాడు.. మిగతావారు ఎటుబోయినా నాకేమిటి అనుకుంటాడు.' అనుకుని ఇరుగూ పొరుగూ కూడా ఎవరూ దగ్గరకు రానీయరు.

చివరగా తనవంతుకోసం వేచి చూస్తూ ఉన్న అంతరాత్మ అప్పుడు కాస్తగట్టిగానే అడుగుతుంది ''నీవు చేస్తున్న పని సరైనదేనా, ధర్మమేనా..ఆలోచించు'' అంటుంది. 'ఎందుకు ఆ పని చేస్తావు, తప్పుకదా, నీకు నాలుగు డబ్బులు మిగలొచ్చు, నీకు సుఖమివ్వవచ్చు, పేరు కూడా రావచ్చేమో.. కానీ దానివల్ల ఎంతమందికి నష్టం, ఎందరికి కడుపుకోత..? ఆలోచించు, తొందరపడకు' అని పదేపదే హెచ్చరిస్తుంది.

నీవు జీవితంలో ఎవ్వరికీ జవాబుదారీ కాకపోవచ్చు. కానీ నీ అంతరాత్మను దాటుకుని, దాని మాటలు ఖాతరు చేయకుండా పోయిననాడు... అపరాధభావంతో నలుగురిలో ఉన్నా ఒంటరివైపోతావు...అది ఎప్పుడూ శాపమే. అంతరాత్మ ప్రబోధం విని నడుచుకున్న నాడు, నీవు ముందుంటావు, సమాజం నీ వెనుక నడుస్తుంటుంది, నిన్ను అనుసరిస్తూ, నీకు బాసటగా కూడా.

మంచి మాట



దాటవలసిన మనోభావాలు

సత్యాలు వేరు; మనోభావాలు వేరు. ఎవరి మనోభావాలు వాళ్లవి. మనోభావాలు వ్యక్తులకు సంబంధించినవి; మనోభావాలు లేకుండా ఎవరూ ఉండరు. మనిషి అన్నాక మనోభావాలు తప్పకుండా ఉంటాయి. మనోభావాలు అనేవి వ్యక్తిగతమైనవి మాత్రమే. సత్యాలు సార్వజనీనమైనవి. మనోభావాల మత్తులో సత్యాల్ని కాదనుకోవడం, అందుకోలేకపోవడం, వదిలేసుకోవడం అనర్థదాయకం, అపాయకరం. మనోభావాలు కాదు సత్యాలు మాత్రమే అవసరమైనవి ఆపై ప్రయోజనకరమైనవి.

మనోభావాలు దెబ్బతింటాయి లేదా దెబ్బతింటున్నాయి అనే మాటను మనం వింటూ ఉంటాం. మనోభావాలు దెబ్బతినడం అంటూ ఉండదు. వ్యక్తులలో ఉండే మనోభావాలు ఉన్నంత కాలం ఉంటాయి. కాలక్రమంలో పోతూ ఉంటాయి. మనోభావాలు అనేవి ప్రతి వ్యక్తికి వయసుతోపాటు మారిపోతూ ఉంటాయి. ఏ వ్యక్తికైనా ఐదేళ్లప్పుడు ఉన్న మనోభావాలు పదేళ్లప్పుడు ఉండవు. పదేళ్లప్పటివి ఇరవై యేళ్లప్పుడు ఉండవు. వ్యక్తుల మానసిక స్థితిని బట్టి, తెలివిని బట్టి, తెలివిడిని బట్టి మనోభావాలు అన్నవి వేరువేరుగా ఉంటాయి.

విద్య, సామాజిక, రాజకీయ, వైజ్ఞానిక, శాస్త్రీయ విషయాల్లోనూ, కళల్లోనూ, సార్వత్రికమైన విషయాల్లోనూ మనోభావాలు అనేవి అవసరం అయినవి కావు. సంఘ, ప్రపంచ ప్రయోజనాలపరంగా మనోభావాలు అనేవి ఎంత మాత్రమూ పనికిరావు. మానవ ప్రయోజనాలపరంగా సత్యాలను మాత్రమే తీసుకోవాల్సి ఉంటుంది. మనోభావాలు చర్చనీయమూ, పరిగణనీయమూ అవవు. ఒక వ్యక్తి మనోభావాలు మరో వ్యక్తికి, సమాజానికి అక్కర్లేనివి. మనోభావాలు, మనోభావాలు అని అంటూ ఉండడమూ, తమ మనోభావాలు ముఖ్యమైనవి లేదా విలువైనవి అని అనుకుంటూ ఉండడం మధ్యతరగతి జాడ్యం.

మనోభావాలు ప్రాతిపదికగా వ్యవహారాలు, సంఘం, ప్రపంచం నడవవు. ఈ విజ్ఞత ప్రతివ్యక్తికి తప్పనిసరిగా ఉండాలి. మనం మన మనోభావాలవల్ల మనకు, సంఘానికి సమస్యలం కాకూడదు. మన మనోభావాలు మనల్నే అడ్డగించే గోడలుకాకూడదు. మన మనోభావాలకు మనమే గుద్దుకోకూడదు. మనోభావాలు మనుగడ మునుసాగడాన్ని ఆపెయ్యకూడదు.

మనిషి జీవితంలో ఒక మేరకు వరకే మనోభావాలకు స్థానాన్ని, ప్రాముఖ్యతను ఇవ్వాలి. మనోభావాలకు అతీతంగా మనుగడను ముందుకు తీసుకువెళ్లడం మనిషి నేర్చుకోవాలి. మనోభావాలకు కట్టుబడి ఉండడం ఒక మనిషి జీవనంలో జరుగుతున్న తప్పుల్లో ప్రధానమైంది. స్వేచ్ఛగా సత్యాల్లోకి వెళ్లడం, వాటివల్ల స్వేచ్ఛను పొందడం ప్రతిమనిషికి ఎంతో ముఖ్యం. సత్యాలవల్ల వచ్చే స్వేచ్ఛ దాన్ని అనుభవిస్తున్నప్పుడు మాత్రమే తెలుస్తుంది. తమ మనోభావాల్ని అధిగమించినవాళ్లే సత్యాలలోకి వెళ్లగలరు. సత్యాలను ఆకళింపు చేసుకోగలిగితే మనోభావాలు, మనోభావాలవల్ల కలిగే కష్ట, నష్టాలు చెరిగిపోతాయి. మతం, కులం, ప్రాంతీయత, ఉగ్రవాదం వంటివాటి వల్ల జరుగుతున్న హానికి, అల్లకల్లోలానికి మనోభావాలే కారణం. మనిషికి సత్యాలపై తెలివిడి వచ్చేస్తే ఈ తరహా దుస్థితి, దుర్గతి ఉండవు. హిట్లర్ మనోభావాల కారణంగా ప్రపంచయుద్ధమే వచ్చి ప్రపంచానికి పెనుచేటు జరిగింది. మనోభావాలకు అతీతంగా సత్యాలపై ఆలోచన, అవగాహన హిట్లర్‌కు, మరికొంతమందికి ఉండి ఉంటే రెండో ప్రపంచయుద్ధం జరిగేదే కాదు. మనోభావాల వల్ల కుటుంబాల్లోనూ, సమాజంలోనూ, దేశంలోనూ, ప్రపంచంలోనూ ఎన్నో దారుణాలు, ఘోరాలు, నేరాలు జరిగాయి, జరుగుతున్నాయి. చరిత్రను, సమాజాన్ని, మనచుట్టూ ఉన్న కుటుంబాల్ని పరిశీలిస్తే ఈ సంగతి తెలియవస్తుంది.

మన మనోభావాలను మనవరకే మనం పరిమితం చేసుకోవాలి. మన మనోభావాలకు తగ్గట్టు విషయాల్ని, ఇతరుల్ని, సమాజాన్ని, ప్రపంచాన్ని పరిగణనలోకి తీసుకోకూడదు. మన మనోభావాల ప్రాధాన్యతకు ఉన్న హద్దుల్ని మనం సరిగ్గా తెలుసుకోవాలి.

మనోభావాలను దాటి సత్యాల ఆవశ్యకతను తెలుసుకుందాం; సత్యాలను ఆకళింపు చేసుకుందాం; సత్యాల వల్ల సత్ఫలితాలను పొందుదాం. సత్యాల సత్వంతో సరైన, సఫలమైన జీవనం చేస్తూ ఉందాం.

– రోచిష్మాన్

అమృత బిందువులు

- మంచి మనుషుల్ని కలుసుకోవడానికి ఎంత దూరం అయినా వెళ్ళాలి. మంచి మనసుల్ని తలుచుకోవడానికి ఎంత గతంలోకి అయినా వెళ్ళాలి. ఆ ఆనందం, సంతోషమే వేరు.
- ఇతరుల మీద గెలవడం వేరు. ఇతరుల మదిలో నిలవడం వేరు.
- ఒకటి ఇబ్బందిపెట్టి లొంగ దీసుకోవడం. రెండవది ప్రేమగా మనసులో నిలిచిపోవడం. ఒకరి మదిలో నిలిచిపోతే, మనం వెళ్ళిపోయినా వారికి గుర్తుండి పోతాము.
- అప్పుడు అప్పుడు అయినా పలకరింపు లేకపోతే ఏ బంధం, ఏ స్నేహం అయినా మరుగున పడుతుంది.

ఈ అనంత లోకంలో నువ్వు వెతికే ప్రతీ సమస్యకి సమాధానం ఎక్కడుందో తెల్సా? నీలోనే ఉంది. అవును నిజంగా నీలోనే. అద్భుతమైన మేధస్సు నీలోనే ఉంది. పదును పెట్టు. అపారమైన తెలివితేటలు నీలోనే ఉన్నాయి. వాటిని ఉపయోగించు. అద్వితీయమైన జ్ఞానం నీ సొంతం. అనిర్వచనీయమైన వివేకం నీ సొంతం. ఇన్ని సుగుణాల కలబోత అయిన నీవు సమస్య వస్తే చతికిలపడిపోతే ఎలా?

బౌద్ధవాణి

ఏ గూటి చిలకకు ఆ గూటి పలుకులు

మనిషి శుద్ధిగా ఉండాలంటే... పరిసరాలు, సమాజం, బంధుగణం, మిత్రజనం శుద్ధిగా ఉండాలి. పరిసరాల్లో ధార్మిక కాలుష్యం లేకుండా ఉంటే... మనిషి నిర్మలంగానే రూపొందుతాడు– అని బుద్ధుడు చెప్పిన కథ ఇది.



ఉత్తర పాంచాల రాజ్య సరిహద్దులో ఒక మలబరీ వనం ఉంది. అందులో ఒక పెద్ద చెట్టు మీద చిలుకల జంట ఉంది. వాటికి రెండు పిల్లలు ఉన్నాయి. ఒక రోజున పెను గాలి రేగింది. సుడి తిరిగింది. చిలుకల గూడు ఆకాశంలోకి లేచింది. కొంత దూరం పోయాక ఆ రెండు చిలుక పిల్లల్లో ఒకటి అడవి మధ్యలో ఉన్న ఒక చిన్న గ్రామంలో పడింది. రెండోది పోయి ఆ అడవికి మరో వైపున ఉన్న పర్ణశాలలో పడింది.

మొదటి పిల్ల పడిన గ్రామం దొంగల గ్రామం. ఆ పిల్లను దొంగల నాయకుడు పెంచసాగాడు. ఆ పిల్లకు శక్తి అని పేరు పెట్టాడు. అలా ఆ శక్తి నిరంతరం కత్తులు, గొడ్డళ్ళ మధ్య కఠోర మాటలు వింటూ పెరిగింది. దాని మనస్సు, ఆలోచనలు క్రూరంగా తయారయ్యాయి.

ఇక రెండో పిల్ల తాను ఉంటున్న పర్ణశాలలో సాధుజనుల మధ్య పెరిగింది. అక్కడ భిక్షువులు పలికే ధర్మ వచనాలు వినడం వల్ల దాని మనస్సు, ఆలోచనలు సాత్వికంగా తయారయ్యాయి. అందమైన పుష్పాల మీద వాలుతూ తిరిగే దానికి అక్కడి భిక్షువులు 'పుష్ప' అని పేరు పెట్టారు.

ఒకరోజు పాంచాల రాజు అడవికి వేటకు వెళ్ళి దారి తప్పాడు. అతని వెంట ఒకే ఒక్క రక్షకుడు మిగిలాడు. వారు అలా పోయి పోయి రాత్రి వేళకు దొంగల గ్రామం దగ్గరలోకి చేరి ఒక పెద్ద చెట్టు కింద ఆగి, నిద్రకు ఉపక్రమించారు.

ఆ సమయానికి శక్తి చిలుక తన మిత్రునితో కలిసి అక్కడికి వచ్చి, రాజును చూసి...

''మిత్రమా! ఇతను చాలా ధనవంతునిలా ఉన్నాడు. వంటి నిండా బంగారు, రత్న ఆభరణాలు ఉన్నాయి. పదునైన చురకత్తిని నోట కరిచి తెచ్చి ఇతగాని కంఠం మీద వదిలి, చంపాలి. అప్పుడు ఈ ఆభరణాలన్నీ మనకు చెందుతాయి'' అంది. రాజుకి పక్షి భాష తెలుసు. చిలుక పలుకులు విన్న రాజుకి భయం కలిగింది. ఇది నిద్రించడానికి తగిన ప్రదేశం కాదనుకుని లేచి అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

తెల్లవారేసరికి ఆ అడవిలో మరో చివరన ఉన్న పర్ణశాలకు చేరాడు. రాజు అక్కడికి చేరేసరికి అక్కడి భిక్షువులు ఆహారం కోసం అడవిలోకి వెళ్ళారు. రాజు బాగా అలసిపోయాడు. నీరసించి ఒక చెట్టుకింద కూర్చున్నాడు. వెంటనే అక్కడ ఉన్న పుష్ప అనే చిలుక వారిని చూసింది. మంచినీటి పాత్ర కాళ్ళతో పట్టి తెచ్చి వారి ముందు ఉంచింది. నోట కరచి పండ్లు, దుంపలు తెచ్చి ఇచ్చింది. అతిథి మర్యాదలు చేసింది.

ఒకేరోజు ఆ రెండు చిలుకల ప్రవర్తనలు రాజుకి వింత గొలిపాయి. తన వెంట ఉన్న వానితో ...

''చూశావా! దొంగలూ, హంతకుల దగ్గర పెరిగిన చిలుక క్రూరంగా ఆలోచించింది. కఠినంగా పలికింది. సాధుజనుల చెంత పెరిగిన చిలుక సహాయం చేసింది. సహృదయత చూపింది. సౌమ్యంగా పలికింది. మనిషి కూడా అంతే..

ఎలాంటి వానితో చెలిమి చేస్తే అలాంటి వారుగా మారతాడు. అందుకే.. సజ్జన సాంగత్యం మేలు, దుర్జన సాంగత్యం కీడు కలిగిస్తాయంటారు. నీటిలో చక్కెర కలిపితే తియ్యగా ఉంటుంది. ఉప్పు కలిపితే ఉప్పగా ఉంటుంది.'' అని చెప్పి చిలుకను దగ్గరకు తీసుకున్నాడు. అది కిలకిల రావాలు చేస్తూ రాజు భుజం మీదకు చేరింది. బుద్ధుడు చెప్పిన ఈ కథ ఎప్పటికీ కాలదోషం పట్టనిది.

ఎలాంటి వానితో చెలిమి చేస్తే అలాంటి వారుగా మారతాడు. అందుకే.. సజ్జన సాంగత్యం మేలు. దుర్జన సాంగత్యం కీడు కలిగిస్తాయంటారు. నీటిలో చక్కెర కలిపితే తియ్యగా ఉంటుంది. ఉప్పు కలిపితే ఉప్పగా ఉంటుంది.



– డా. బొర్రా గోవర్ధన్

సినిమా



ప్రభాస్

నైట్ మోడ్

'సలార్' యూనిట్ ప్రస్తుతం నైట్ మోడ్‌లో ఉంది. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'సలార్'. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్న ఈ సినిమాలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాను సెప్టెంబరు 28న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఆల్రెడీ ప్రకటించింది. దీంతో అనుకున్న సమయానికి సినిమాను విడుదల చేయాలని 'సలార్' టీమ్ షూటింగ్ షెడ్యూల్స్‌ని పక్కాగా ప్లాన్ చేసి, గ్యాప్ రాకుండా చూసుకుంటోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. నైట్ షూట్ జరుపుతున్నారు. జగపతిబాబు, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు సంగీతం: రవి బస్రూర్.



రజనీకాంత్

కొచ్చిలో జైలర్

కొచ్చికి మకాం మార్చారు 'జైలర్'. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జైలర్'. శివ రాజ్‌కుమార్, సునీల్, రమ్యకృష్ణ, తమన్నా కీలక పాత్రధారులుగా, ఓ అతిథి పాత్రలో మోహన్‌లాల్ నటిస్తున్నారు. 'జైలర్' సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఇటీవల కొచ్చిలో ప్రారంభమైంది. రజనీకాంత్ పాల్గొనగా కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. మరో పది రోజులు ఈ షెడ్యూల్ కొనసాగుతుందని సమాచారం. ఈ సినిమాను ఈ ఏడాదే విడుదల చేయాలనుకుంటున్నారు.



మహేశ్‌బాబు

సంక్రాంతికి సై

సంక్రాంతికి సై అంటున్నారు మహేశ్‌బాబు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్‌బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పూజా హెగ్డే, శ్రీలీల హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్. రాధాకృష్ణ (చినబాబు) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాను సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు ఆదివారం రిలీజ్ డేట్‌ను ప్రకటించి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా రిలీజ్ చేశారు మేకర్స్. ''డేట్ (13.01.2024) సేవ్ చేసుకోండి' అంటూ ట్వీట్ చేశారు మహేశ్‌బాబు. సినిమాలో ఓ యాక్షన్ సీక్వెన్స్ తర్వాత మాస్ అవతారంలో మహేశ్ కనిపిస్తున్న లుక్‌గా ఫస్ట్ లుక్ పోస్టర్ కనిపిస్తోంది. ఈ సినిమాకు సంగీతం: తమన్, కెమెరా: పి.ఎస్. వినోద్.



రాశీ ఖన్నా

పీరియాడికల్ డ్రామాలో...

కోలీవుడ్ నుంచి మళ్లీ కబురు అందుకున్నారు రాశీ ఖన్నా. ఇప్పటికే తమిళంలో అరడజను చిత్రాలకు పైగా చేసిన ఈ బ్యూటీ తాజాగా హీరో జీవా సరసన నటించనున్నారని టాక్. దర్శకుడు పా. విజయ్ తెరకెక్కించనున్న సినిమాలో జీవా హీరోగా, ప్రధాన పాత్రలో అర్జున్ నటించనున్నారు. ఈ పీరియాడికల్ డ్రామా షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. ఈ చిత్రంలోనే రాశీ ఖన్నా హీరోయిన్‌గా నటించనున్నారని తెలిసింది. ''జీవా, అర్జున్‌గార్ల కాంబినేషన్‌లో గతంలో నేను ఓ సినిమా ప్లాన్ చేశాను. కానీ కుదర్లేదు. ఇప్పుడు నా కొత్త సినిమాకు ఈ ఇద్దరూ ఓకే కావడం హ్యాపీగా ఉంది. మా సినిమా కోసం హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో సెట్ వేస్తున్నాం. సెట్ పూర్తి కాగానే షూటింగ్ ప్రారంభిస్తాం. ఆ తర్వాత ఊటీ, కొడైకెనాల్‌లో చిత్రీకరణ ప్లాన్ చేశాం'' అని పేర్కొన్నారు పా. విజయ్. అయితే రాశీ ఖన్నా విషయంపై విజయ్ క్లారిటీ ఇవ్వలేదు. త్వరలో అధికారికంగా ప్రకటించాలని అనుకుంటున్నారట.

కష్టపడితే ఫేమస్ అవుతాం

\- మంత్రి మల్లారెడ్డి



శరత్, మల్లారెడ్డి, సుమంత్ ప్రభాస్, చంద్రు మనోహరన్, అనురాగ్

''పాలు అమ్ముకునే నేను ఈ రోజు మంత్రినయ్యాను. యువత కష్టపడే తత్వాన్ని అలవరుచుకోవాలి. కష్టపడితే ఆటోమేటిక్‌గా ఫేమస్ అవుతాం. 'మేమ్ ఫేమస్' ట్రైలర్ బాగుంది.. సినిమా హిట్టవుతుంది'' అని తెలంగాణ రాష్ట్ర మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సుమంత్ ప్రభాస్ ప్రధాన పాత్ర పోషించడంతో పాటు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మేమ్ ఫేమస్'. మణి ఏగుర్ల, మౌర్య చౌదరి, సార్య, సిరి రాశి ఇతర కీలక పాత్రధారులు. అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ నిర్మిస్తున్న ఈ సినిమా జూన్ 2న రిలీజ్ కానుంది. ఈ చిత్రం టీజర్‌ని చామకూర మల్లారెడ్డి రిలీజ్ చేశారు. ''కాలేజీలో ఉన్నప్పుడు 'పిల్ల పిల్లగా' అనే వెబ్ సిరీస్ చేశాను. నేను సినిమా చేయగలనని నమ్మి, చాన్స్ ఇచ్చిన నిర్మాతలకు రుణపడి ఉంటా'' అన్నారు సుమంత్ ప్రభాస్. ''మా 'రైటర్ పద్మభూషణ్' సినిమాలా 'మేమ్ ఫేమస్'ని కూడా ఆదరించాలి'' అన్నారు నిర్మాతలు.

పడిపోతున్నా నిన్ను చూస్తూ...



మధుబాల

గీతానంద్, నేహా సోలంకి జంటగా, మధుబాల, ఆదిత్య మీనన్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. అశ్విన్–అరుణ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పడిపోతున్నా నిన్ను చూస్తూ...' అనే సెకండ్ లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. కిట్టు విస్సా ప్రగడ సాహిత్యం అందించిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి–హారిక నారాయణ్ పాడారు. రవి కస్తూరి మాట్లాడుతూ–''గేమ్ ఆన్'కి అన్నతమ్ముళ్లు అయిన గీతానంద్, దయానంద్ హీరోగా, డైరెక్టర్‌గా పోటీపడి పని చేయడం విశేషం'' అన్నారు.

ఈ రిస్క్ హిట్టవ్వాలి

\- యంయస్ రాజు




ఘంటాడి కృష్ణ, యంయస్ రాజు

సందీప్ అశ్వా హీరోగా మ్యూజిక్ డైరెక్టర్ ఘంటాడి కృష్ణ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'రిస్క్'. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమా రిలీజ్ కానుంది. 'సిక్స్ టీన్స్' సినిమాకు సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలోని 'సొగసుకే సోకు' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. తెలుగు వెర్షన్‌ను సిధ్ శ్రీరామ్ పాడారు. ఈ పాట విడుదల వేడుకలో 'రిస్క్' సినిమా తెలుగు మోషన్ పోస్టర్ విడుదల చేసిన నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ – ''ఈ సినిమాతో హీరో సందీప్, దర్శకుడు ఘంటాడి కృష్ణకు పాన్ ఇండియా సక్సెస్ రావాలి''అన్నారు. ''ఈ రిస్క్ తప్పక విజయం సాధించాలి'' అన్నారు దర్శక–నిర్మాత యంయస్. రాజు. ''ఈ చిత్రం పూర్తి కావడంలో నాకు సహకరించిన చిత్ర యూనిట్‌కు ధన్యవాదాలు'' అన్నారు ఘంటాడి కృష్ణ.

ఇలాంటి సినిమాలు అరుదుగా వస్తాయి

\- ఆదిత్య ఓం



ఆదిత్య ఓం

''ప్రతీ శుక్రవారం కొత్త సినిమాలు వస్తాయి. కానీ, 'దహనం' లాంటి సినిమాలు ఏ ఐదేళ్లకో, పదేళ్లకో అరుదుగా వస్తాయి. ఇది కమర్షియల్ ప్రాజెక్ట్ కాదు. ప్యాషన్‌తో తీసిన ప్రాజెక్ట్. ఈ సినిమాను ఇంత గొప్పగా తీసిన మా దర్శక–నిర్మాతలకు థాంక్స్'' అని నటుడు ఆదిత్య ఓం అన్నారు. ఆదారి మూర్తిసాయి దర్శకత్వంలో ఆదిత్య ఓం హీరోగా నటించిన చిత్రం 'దహనం'. డా. పెతకంశెట్టి సతీష్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్, ట్రైలర్ లాంచ్ వేడుక నిర్వహించారు. ''వర్తమాన, భూత, భవిష్యత్ కాలాల్లో నీరు, నిప్పు, గాలితో అవసరం ఉంటుందని చెప్పే కథ ఇది'' అన్నారు ఆదారి మూర్తిసాయి. ''కథ నచ్చి ఈ సినిమా నిర్మించాను'' అని డా. పెతకంశెట్టి సతీష్ కుమార్ అన్నారు. దర్శక–నిర్మాత వైవీఎస్ చౌదరి, నిర్మాతలు తమ్మారెడ్డి భరద్వాజ్, ప్రసన్న కుమార్, దామోదర్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్ రావు, డిస్ట్రిబ్యూటర్ ఆదినారాయణ, నటుడు మాదాల రవి, తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్ అనిల్ కుర్మాచలం మాట్లాడారు.

ప్రైవేట్ పోలీస్ స్టేషన్



రక్షిత్

రక్షిత్ అట్లూరి హీరోగా గొల్లపాటి నాగేశ్వరరావు దర్శకత్వంలో 'పోలీస్ స్టేషన్ ప్రైవేట్ లిమిటెడ్' అనే సినిమా షురూ అయింది. విశ్వేశ్వర శర్మ, రాజరాయ్ నిర్మిస్తున్న ఈ మూవీ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సీన్‌కి నిర్మాత ప్రసన్న కుమార్ కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ చందు మొండేటి క్లాప్ కొట్టారు అనంతరం గొల్లపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ–''సస్పెన్స్, యాక్షన్ డ్రామా, పోలీస్ నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు. ''వైవిధ్యమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ మూవీ అన్ని వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది'' అన్నారు రక్షిత్. ''మా సినిమాలో నటించే ఇతర నటీనటులు, పనిచేసే సాంకేతిక నిపుణల వివరాలు త్వరలో తెలియజేస్తాం'' అన్నారు విశ్వేశ్వర శర్మ.

ఏందిరా ఈ పంచాయితీ



విషికా, భరత్

భరత్, విషికా లక్ష్మణ్ జంటగా నటిస్తున్న సినిమా 'ఏందిరా ఈ పంచాయితీ'. గంగాధర. టి దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ సినిమాను ఎం. ప్రదీప్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లోగోను విడుదల చేసింది చిత్రబృందం. ''ఒక ఊర్లో ఉండే సహజమైన వాతావరణాన్ని చూపించనున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: పెద్దపల్లి రోహిత్, కెమెరా: సతీష్ మాసం.

ప్రేమ కథ



విద్య

తోట కార్తీక్, అమన్, విద్య క్రిష్ణ హీరో హీరోయిన్లుగా నటించనున్న చిత్రం 'ఏది ప్రేమ కథ'. కీర్తన సమర్పణలో నంద్యాల టి. ఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై రమేష్ తోడేటి నిర్మించనున్నారు. ''రాయలసీమ జిల్లాలైన నంద్యాల, కర్నూలు లొకేషన్స్‌లో ఈ సినిమా చిత్రీకరణను ప్లాన్ చేశాం. విభిన్నమైన ప్రేమకథా చిత్రంగా తెరకెక్కనున్న ఈ సినిమా యువతను, మహిళలను ఆకట్టుకునేలా ఉంటుంది'' అన్నారు రమేష్.



విజేత ముంబై ఇండియన్స్

- డబ్ల్యూపీఎల్ ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై విజయం
- 'తొలి' టైటిల్ అందుకున్న హర్మన్ బృందం
- గెలిపించిన మాథ్యూస్, నాట్ సివర్

ముంబై: తొలి మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 టోర్నమెంట్ టైటిల్‌ను ముంబై ఇండియన్స్ సొంతం చేసుకుంది. టోర్నీ ఆరంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం తుది పోరులోనూ సమష్టి ప్రదర్శనతో అదే జోరును కొనసాగించింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ముంబై 7 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 131 పరుగులు చేయగా...ముంబై 19.3 ఓవర్లలో 3 వికెట్లకు 134 పరుగులు సాధించింది. ముంబై బౌలింగ్ ధాటికి ఢిల్లీ ఆరంభం నుంచే తడబడింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (29 బంతుల్లో 35; 5 ఫోర్లు) మినహా అంతా విఫలం కావడంతో టపటపా వికెట్లు కోల్పోయింది. దాంతో స్కోరు 79/9కు చేరింది. అయితే ఆఖరి వికెట్‌కు రాధ యాదవ్ (12 బంతుల్లో 27 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), శిఖా పాండే (17 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) చెలరేగి 24 బంతుల్లోనే అభేద్యంగా 52 పరుగులు జోడించడంతో కాస్త గౌరవప్రదమైన స్కోరు దక్కింది. అనంతరం ముంబై కూడా 23 పరుగులకే 2 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నాట్ సివర్ బ్రంట్ (55 బంతుల్లో 60 నాటౌట్; 7 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (39 బంతుల్లో 37; 5 ఫోర్లు) మూడో వికెట్‌కు 74 బంతుల్లో 72 పరుగులు జోడించి జట్టును విజయం దిశగా నడిపించారు.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: లానింగ్ (రనౌట్) 35; షఫాలీ (సి) కెర్ (బి) వాంగ్ 11; క్యాప్సీ (సి) అమన్‌జోత్ (బి) వాంగ్ 0; జెమీమా (సి) మాథ్యూస్ (బి) వాంగ్ 9; మరిజాన్ కాప్ (సి) యస్తిక (బి) కెర్ 18; జొనాసెన్ (సి అండ్ బి) మాథ్యూస్ 2; అరుంధతి రెడ్డి (సి) ఇషాక్ (బి) కెర్ 0; శిఖా పాండే (నాటౌట్) 27; మిన్ను (సి) యస్తిక (బి) మాథ్యూస్ 1; తానియా (బి) మాథ్యూస్ 0; రాధ (నాటౌట్) 27; ఎక్స్‌ట్రాలు 1; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 131. వికెట్ల పతనం:** 1–12, 2–12, 3–35, 4–73, 5–74, 6–75, 7–75, 8–79, 9–79. **బౌలింగ్:** నాట్ సివర్ 4–0–37–0, ఇసీ వాంగ్ 4–0–42–3, సైకా ఇషాక్ 4–0–28–0, అమేలియా కెర్ 4–0–18–2, హేలీ మాథ్యూస్ 4–2–5–3.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: హేలీ మాథ్యూస్ (సి) అరుంధతి (బి) జొనాసెన్ 13; యస్తిక (సి) క్యాప్సీ (బి) రాధ 4; నాట్ సివర్ (నాటౌట్) 60; హర్మన్‌ప్రీత్ (రనౌట్) 37; అమేలియా కెర్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (19.3 ఓవర్లలో 3 వికెట్లకు) 134. వికెట్ల పతనం:** 1–13, 2–23, 3–95. **బౌలింగ్:** మరిజాన్ కాప్ 4–0–22–0, రాధ యాదవ్ 4–0–24–1, జొనాసెన్ 4–0–28–1, శిఖా పాండే 4–0–23–0, అలైస్ క్యాప్సీ 3.3–0–34–0.

345 డబ్ల్యూపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా మెగ్ లానింగ్ (ఢిల్లీ క్యాపిటల్స్) నిలిచింది. ఆమె 9 మ్యాచ్‌లు ఆడి రెండు అర్ధ సెంచరీలతో కలిపి మొత్తం 345 పరుగులు సాధించింది.

16 డబ్ల్యూపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లుగా హేలీ మాథ్యూస్ (ముంబై), సోఫీ ఎకెల్‌స్టోన్ (యూపీ వారియర్స్) నిలిచారు. వీరిద్దరు 16 వికెట్ల చొప్పున తీశారు.

జడేజాకు ప్రమోషన్... భరత్‌కు చోటు


జడేజా


భరత్

బీసీసీఐ కాంట్రాక్ట్‌ల ప్రకటన

ముంబై: భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆటగాళ్లకు సంబంధించిన వార్షిక కాంట్రాక్ట్‌లను ప్రకటించింది. గత ఏడాది 'ఎ' గ్రేడ్‌లో ఉన్న ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ప్రమోషన్ సాధించి 'ఎ ప్లస్' గ్రేడ్‌లో చోటు దక్కించుకున్నాడు. మరోవైపు వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న కేఎల్ రాహుల్ ఇప్పటి వరకు 'ఎ' గ్రేడ్‌లో ఉండగా, ఇప్పుడు 'బి'కి పడిపోయాడు. నిలకడగా రాణిస్తున్న అక్షర్ పటేల్‌కు 'ఎ' గ్రేడ్‌లోకి ప్రమోషన్ లభించగా, ఇటీవలే ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్‌తో అరంగేట్రం చేసిన ఆంధ్ర వికెట్ కీపర్ కేఎస్ భరత్‌కు తొలిసారి బోర్డు కాంట్రాక్ట్ (సి గ్రేడ్) దక్కడం విశేషం. మరో వైపు సీనియర్ ఆటగాళ్లు అజింక్య రహానే, ఇషాంత్ శర్మ, భువనేశ్వర్ కుమార్‌లు తమ కాంట్రాక్ట్‌లు కోల్పోయారు.

కాంట్రాక్ట్ జాబితా (మొత్తం 26 మంది)

'ఎ ప్లస్' గ్రేడ్ (రూ. 7 కోట్లు): రోహిత్, కోహ్లి, బుమ్రా, జడేజా.

'ఎ' గ్రేడ్ (రూ. 5 కోట్లు): హార్దిక్ పాండ్యా, అశ్విన్, షమీ, రిషభ్ పంత్, అక్షర్ పటేల్.

'బి' గ్రేడ్ (రూ. 3 కోట్లు): పుజారా, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, సిరాజ్, సూర్యకుమార్ యాదవ్, శుబ్‌మన్ గిల్.

'సి' గ్రేడ్ (రూ. 1 కోటి): ఉమేశ్ యాదవ్, శిఖర్ ధావన్, శార్దుల్ ఠాకూర్, ఇషాన్ కిషన్, దీపక్ హుడా, యజువేంద్ర చహల్, కుల్దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, సంజూ సామ్సన్, అర్ష్‌దీప్ సింగ్, కోన శ్రీకర్ భరత్.

నిఖత్ తడాఖా

రెండోసారి విశ్వవిజేతగా భారత స్టార్ బాక్సర్ • ఫైనల్లో ఆసియా చాంపియన్‌పై విజయం
రూ. 82 లక్షల 34 వేలు ప్రైజ్‌మనీ సొంతం • లవ్లీనా ఖాతాలోనూ స్వర్ణం

సొంతగడ్డపై భారత మహిళా బాక్సర్లు పసిడి పంచ్‌లతో అదరగొట్టారు. ఈ మెగా ఈవెంట్ చరిత్రలో తమ అత్యుత్తమ 'స్వర్ణ' ప్రదర్శనను సమం చేశారు. ఆదివారం ముగిసిన ప్రపంచ సీనియర్ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ నాలుగు బంగారు పతకాలతో తమ ప్రస్థానాన్ని ముగించింది. శనివారం నీతూ (48 కేజీలు), స్వీటీ (81 కేజీలు) పసిడి పతకాలు సాధించగా... ఆదివారం నిఖత్ జరీన్ (50 కేజీలు), లవ్లీనా బొర్గోహైన్ (75 కేజీలు) 'గోల్డెన్' ఫినిషింగ్ ఇచ్చారు.


నిఖత్


స్వర్ణ పతకంతో నిఖత్

న్యూఢిల్లీ: గత ఏడాది తాను సాధించిన ప్రపంచ చాంపియన్‌షిప్ పసిడి పతకం గాలివాటమేమీ కాదని భారత స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ నిరూపించింది. ఈ తెలంగాణ అమ్మాయి వరుసగా రెండో ఏడాది ప్రపంచ సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకంతో మెరిసింది. న్యూఢిల్లీలో ఆదివారం ముగిసిన ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో 26 ఏళ్ల నిఖత్ 50 కేజీల విభాగంలో విజేతగా అవతరించింది. ఫైనల్లో నిఖత్ 5–0తో రెండుసార్లు ఆసియా చాంపియన్‌గా నిలిచిన ఎన్గుయెన్ థి టామ్ (వియత్నాం)పై గెలుపొందింది. గత ఏడాది తుర్కియేలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నిఖత్ 52 కేజీల విభాగంలో బంగారు పతకం గెలిచింది. తాజా ప్రదర్శనతో నిఖత్ ప్రపంచ చాంపియన్‌షిప్ చరిత్రలో రెండు స్వర్ణ పతకాలు గెలిచిన రెండో భారతీయ బాక్సర్‌గా గుర్తింపు పొందింది. దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఆరు స్వర్ణాలు, ఒక రజతంతో కలిపి ఏడు పతకాలు సాధించింది. 2006లో న్యూఢిల్లీయే ఆతిథ్యమిచ్చిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ నాలుగు స్వర్ణాలు, ఒక రజతంతో కలిపి ఐదు పతకాలు గెలిచింది.

దూకుడుగా...

థి టామ్‌తో జరిగిన ఫైనల్లో నిఖత్ ఆద్యంతం దూకుడుగా ఆడింది. ఒకవైపు అవకాశం దొరికినపుడల్లా ప్రత్యర్థిపై పంచ్‌ల వర్షం కురిపించింది. మరోవైపు ప్రత్యర్థి విసిరిన పంచ్‌లను కాచుకుంది. తొలి రౌండ్‌లో నిఖత్‌ను ఒడిసిపట్టుకొని కింద పడేసినందుకు వియత్నాం బాక్సర్‌కు రిఫరీ పెనాల్టీ పాయింట్ విధించారు. ఆ తర్వాత నిఖత్ ఎదురుదాడికి దిగి రెండు రైట్ హుక్ పంచ్‌లతో, ఆ తర్వాత స్ట్రెయిట్ పంచ్‌లతో విరుచుకుపడింది. ఫలితం తొలి రౌండ్‌లో నిఖత్‌దే పైచేయిగా నిలిచింది. రెండో రౌండ్‌లో థి టామ్ పుంజుకుంది. నిర్ణాయక మూడో రౌండ్‌లో నిఖత్ మళ్లీ జోరు పెంచింది. నిఖత్ సంధించిన పంచ్‌కు వియత్నాం బాక్సర్‌కు దిమ్మదిరిగిపోయేలా చేసింది. చివరకు నిఖత్ అదే జోరు కొనసాగించి విజయాన్ని ఖరారు చేసుకుంది. టోర్నీ మొత్తం నిలకడగా రాణించిన నిఖత్‌కు 'బెస్ట్ బాక్సర్' అవార్డు కూడా లభించింది. విజేతగా నిలిచిన నిఖత్‌కు లక్ష డాలర్లు (రూ. 82 లక్షల 34 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 'బెస్ట్ బాక్సర్' పురస్కారం కింద 'మహీంద్రా థార్' వాహనం లభించింది.

ఓవరాల్ చాంపియన్ భారత్

ఆతిథ్య భారత్ నాలుగు స్వర్ణ పతకాలతో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. చైనా మూడు స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలతో ఏడు పతకాలతో రన్నరప్‌గా నిలిచింది. ర్యాంక్ వర్గీకరణలో నెగ్గిన స్వర్ణ పతకాల సంఖ్యను పరిగణనలోకి తీసుకుంటారు. రష్యా ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యంతో మూడు పతకాలతో మూడో స్థానంలో నిలిచింది. మొత్తం 12 వెయిట్ కేటగిరీలలో 48 పతకాల కోసం బౌట్‌లు జరగ్గా... 20 దేశాలు కనీసం ఒక్క పతకమైనా సాధించాయి. రష్యా బాక్సర్లను అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం (ఐబీఏ) ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనేందుకు అవకాశం ఇవ్వడంపై పలు దేశాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఐబీఏ నిర్ణయాన్ని నిరసిస్తూ 17 దేశాలు ఈ పోటీలకు దూరంగా ఉన్నాయి.

"రెండోసారి ప్రపంచ చాంపియన్‌గా నిలవడం చాలా సంతోషంగా ఉంది. అందులోనూ ఒలింపిక్ కేటగిరీలో స్వర్ణం గెలవడం ఇంకా సంతృప్తినిచ్చింది. టోర్నీలో సహజంగానే నా దృష్టిలో ఇదే కఠినమైన బౌట్. ఆమె ఆసియా చాంపియన్. హోరాహోరీగా తలపడ్డాం. కామన్వెల్త్ క్రీడల్లో నేను పెద్దగా పోటీని ఎదుర్కోలేదు. ఈ తర్వాత ఇక్కడే మళ్లీ బరిలోకి దిగాను. కానీ ఇక్కడ ప్రపంచ స్థాయి ప్రత్యర్థులతో వరుస బౌట్‌లలో తలపడాల్సి వచ్చింది. అందుకే కొన్నిసార్లు నేను వేగంగా కదల్లేకపోయాను. ఫైనల్లో మాత్రం చివరి బౌట్ కాబట్టి పూర్తి శక్తిసామర్థ్యాలు వాడాలని నిశ్చయించుకున్నా. వంద శాతంకంటే ఎక్కువ ప్రయత్నించా. గత ఏడాది పతకంతో పోలిస్తే ఇది ఎక్కువ శ్రమతో వచ్చింది. దీని కోసం బరువు తగ్గించుకొని ఎంతో కష్టపడాల్సి వచ్చింది. సన్నాహానికి సమయం తక్కువగా ఉన్నా పూర్తి ఏకాగ్రతతో సాధన చేశా. ఉత్తమ బాక్సర్‌గా మహీంద్రా థార్ వాహనం బహుమతిగా వచ్చింది కాబట్టి ప్రస్తుతానికి నాకు వచ్చిన ప్రైజ్‌మనీతో అమ్మా, నాన్నను హజ్ యాత్రకు పంపిస్తా.

–నిఖత్ జరీన్



లవ్లీనా తొలిసారి...

అస్సాం బాక్సర్ లవ్లీనా బొర్గోహైన్ మూడో ప్రయత్నంలో ప్రపంచ చాంపియన్‌గా అవతరించింది. 2018, 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో సెమీఫైనల్లో ఓడి కాంస్య పతకాలతో సరిపెట్టుకున్న లవ్లీనా ఈసారి మాత్రం విశ్వవిజేతగా నిలిచింది. ఫైనల్లో లవ్లీనా 5–2తో కైట్లిన్ పార్కర్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించింది. చాంపియన్‌గా నిలిచిన లవ్లీనాకు లక్ష డాలర్లు (రూ. 82 లక్షల 34 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

'పంచ్' పదును పెరిగింది

సాక్షి క్రీడా విభాగం

మే 19, 2022... నిఖత్ జరీన్ తొలిసారి ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. అప్పటి వరకు ఆమెకు ఉన్న గుర్తింపు వేరు. ఒకసారి యూత్ వరల్డ్ చాంపియన్‌గా, మరోసారి రన్నరప్‌గా నిలిచినా సరే, సీనియర్ స్థాయికి వచ్చేసరికి కనుమరుగైన వారి జాబితాలో ఆమె కూడా చేరుతుందని చాలా మంది అనుకున్నారు. ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్యంతో పాటు మరో ఆరు అంతర్జాతీయ పతకాలు సాధించినా నిఖత్‌పై ఎక్కువగా అంచనాలు లేవు. ఆమె ప్రదర్శనపై కూడా ఫర్వాలేదన్నవారే తప్ప అద్భుతం అని, మున్ముందు గొప్ప విజయాలు సాధించగలదని ఎవరూ ఊహించలేదు. అందుకు కారణం అప్పటికే ఉత్తరాది, ముఖ్యంగా హరియాణా బాక్సర్లతోనే భారత బృందం నిండి ఉంది. ఆటా వారిదే, ఫలితాలు వారి నుంచే అన్నట్లుగా పరిస్థితి ఉంది. పైగా మేరీకోమ్‌తో పోటీ పడేందుకు సిద్ధపడి అదేదో తప్పు చేసినట్లుగా తన ప్రమేయం లేకుండానే చాలా మంది దృష్టిలో నిఖత్ విలన్‌గా మారిపోయింది. కానీ...కానీ...ఒక్క అద్భుత ప్రదర్శన అంతా మార్చేసింది... వరల్డ్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడంతో నిఖత్ సత్తా అందరికీ అర్థమైంది. నిఖత్ ప్రతిభను ప్రపంచం గుర్తించింది. భారత్ నుంచి విశ్వ వేదికపై నిలబడగల అథ్లెట్ల జాబితాలో ఆమె కూడా చేరింది.

అసలు కర్తవ్యంపైనే దృష్టి...

గత వరల్డ్ చాంపియన్‌షిప్ స్వర్ణం నుంచి నిఖత్ ప్రయాణం కొత్తగా మొదలైంది. ఎందుకంటే అగ్రశ్రేణి ఆటగాళ్లు విజయాలు సాధించడం మాత్రమే కాదు, వాటిని కొనసాగించడం, నిలబెట్టుకోవడం కూడా చాలా ముఖ్యం. గొప్ప ఘనత తర్వాత వచ్చే కీర్తి కనకాదులు, ప్రచారాలు ప్లేయర్లను ఒక్కసారిగా ఆటకు దూరం చేసిన ఘటనలు గతంలో ఎన్నో జరిగాయి. సరిగ్గా ఈ విషయంలోనే నిఖత్ తడబడలేదు. వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన తర్వాత ఎన్నో ప్రచార, బ్రాండింగ్ కార్యక్రమాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలకు ఆహ్వానాలు, ప్రారంభోత్సవాలు, ఆపై టీవీ, సినిమా షోలు, అవార్డుల స్వీకరణ... ఇలా ఒక్కసారిగా నిఖత్ బిజీగా మారిపోయింది. అయితే ఈ సమయంలోనూ ఆమె తన అసలు కర్తవ్యాన్ని మరచిపోలేదు.

వెయిట్ కేటగిరీ మారినా...

గత విజయం తర్వాత నిఖత్ ముందు నిలిచిన పెద్ద సవాల్ వెయిట్ కేటగిరీ! 2022 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో ఆమె 52 కేజీల విభాగంలో టైటిల్ సాధించింది. దాంతో పారిస్ ఒలింపిక్స్–2024 అనేది అసలు లక్ష్యంగా మారింది. అయితే వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో 52 కేజీల విభాగం లేకపోవడంతో తప్పనిసరిగా దానిని మార్చుకోవాల్సి వచ్చింది. ముందుకెళితే 54 కేజీల్లో అప్పటికే అక్కడ సత్తా చాటుతున్న అంతర్జాతీయ స్టార్ బాక్సర్లు, అనుభవజ్ఞులు ఉంటారు. దాంతో తన పంచ్ పవర్ పదును పని చేసేందుకు వెయిట్ తగ్గడమే సరైందని భావించి 50 కేజీలకు మారింది. దానికి అనుగుణంగా తన బరువును మార్చుకొని తీవ్రంగా సాధన చేసింది. భారత కోచ్ జాన్ వార్‌బర్టన్ సాధన విషయంలో నిఖత్‌కు అన్ని రకాలుగా సరైన దిశానిర్దేశం చేశారు. ఆమె శ్రమ ఫలితం బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ క్రీడల్లో కనిపించింది. వరల్డ్ చాంపియన్‌గా తన స్థాయిని ప్రదర్శిస్తూ అక్కడ సునాయాసంగా స్వర్ణం గెలుచుకుంది. అదీ తాను కొత్తగా మొదలుపెట్టిన 50 కేజీల కేటగిరీలో కావడంతో తన ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. ఆపై మరో ఐదు నెలలకు వచ్చిన జాతీయ చాంపియన్‌షిప్‌లో నిఖత్‌కు మొదటి స్థానం లాంఛనమే అయింది. ఈ ఏడాది వ్యవధిలో ఆమె ఈ రెండు ఈవెంట్లు మినహా మరే టోర్నీలోనూ పాల్గొనలేదు. విదేశాల్లో కొన్ని టోర్నమెంట్‌లకు ఆహ్వానాలు అందినా... తన ఆట మెరుగవ్వాలంటే అలాంటి టోర్నీలలో ఆడి 'విజేత' అనిపించుకోవడంకంటే ప్రాక్టీస్ చేయడమే సరైందని జరీన్ భావించింది. చివరకు దాంతో ఫలితాన్ని అందుకుంది.



ఆద్యంతం ఆధిపత్యం...

సొంతగడ్డపై జరిగిన ఈ టోర్నీలో ఆద్యంతం నిఖత్ ఆధిపత్యం కనిపించింది. సెమీస్ మినహా మిగిలిన బౌట్‌లలో ఎక్కడా తడబాటు లేకుండా ఆమె అలవోక విజయాలు అందుకుంది. ఒక బౌట్‌లో ఆర్‌ఎస్‌సీ (రిఫరీ స్టాప్స్ ద కంటెస్ట్), 4 బౌట్‌లలో 5–0తో నెగ్గిన ఆమె ఒక్క సెమీస్‌లో 5–2తో ప్రత్యర్థికి కాస్త అవకాశం ఇచ్చింది. తాజా విజయంతో ఈ కేటగిరీలో నిఖత్ తన స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకుంది. ఇకపై పారిస్ ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యంగా ఆమె ముందుకు సాగాల్సి ఉంది. ఇదే తరహా ఆటను కొనసాగిస్తే ప్రపంచంలోని అత్యుత్తమ, మెగా ఈవెంట్‌లో కూడా పతకం అందుకోవడం అసాధ్యం కాబోదు!

సాత్విక్–చిరాగ్ జోడీకి టైటిల్

స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ


చిరాగ్ శెట్టి
సాత్విక్

బాసెల్: కీలకదశలో పట్టుదల కోల్పోకుండా ఆడిన భారత బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి స్విస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నీలో పురుషుల డబుల్స్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. 68 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో పురుషుల డబుల్స్ టైటిల్ నెగ్గిన తొలి భారతీయ జోడీగా సాత్విక్–చిరాగ్ గుర్తింపు పొందింది. ఆదివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్లో రెండో సీడ్ సాత్విక్–చిరాగ్ జంట 54 నిమిషాల్లో 21–19, 24–22తో రెన్ జియాంగ్ యు–టాన్ కియాంగ్ (చైనా) జోడీపై విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్, మహారాష్ట్ర ప్లేయర్ చిరాగ్ శెట్టిలకు ఈ ఏడాది ఇదే తొలి టైటిల్ కాగా, ఓవరాల్‌గా ఐదో టైటిల్. విజేతగా నిలిచిన సాత్విక్–చిరాగ్ జోడీకి 16,590 డాలర్ల (రూ. 13 లక్షల 66 వేలు) ప్రైజ్‌మనీ, 7000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

5 సాత్విక్–చిరాగ్ కెరీర్‌లో గెలిచిన వరల్డ్ టూర్ డబుల్స్ టైటిల్స్. స్విస్ ఓపెన్ కంటే ముందు ఈ జంట హైదరాబాద్ ఓపెన్ (2018), థాయ్‌లాండ్ ఓపెన్ (2019), ఫ్రెంచ్ ఓపెన్ (2022), ఇండియా ఓపెన్ (2022) టోర్నీల్లో విజేతగా నిలిచారు.

7 స్విస్ ఓపెన్‌లో భారత్ ప్లేయర్లకు టైటిల్ దక్కడం ఇది ఏడోసారి. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ (2011, 2012), పీవీ సింధు (2022)... పురుషుల సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ (2015), హెచ్‌ఎస్ ప్రణయ్ (2016), సమీర్ వర్మ (2018)... పురుషుల డబుల్స్‌లో సాత్విక్–చిరాగ్ (2023) విజేతగా నిలిచారు.

కాంస్యంతో ముగింపు

ప్రపంచకప్ షూటింగ్ టోర్నీలో భారత్‌కు రెండో స్థానం


సిఫ్ట్ కౌర్ సామ్రా

భోపాల్: ప్రపంచకప్ షూటింగ్ టోర్నమెంట్‌ను భారత్ కాంస్య పతకంతో ముగించింది. చివరిరోజు ఆదివారం భారత్ ఖాతాలో ఒక కాంస్య పతకం చేరింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్ ఈవెంట్‌లో సిఫ్ట్ కౌర్ సామ్రా మూడో స్థానంలో నిలిచింది. ఎంబీబీఎస్ చదువుతోన్న పంజాబ్‌కు చెందిన 21 ఏళ్ల సిఫ్ట్ కౌర్ క్వాలిఫయింగ్‌లో 588 పాయింట్లు స్కోరు చేసి ఐదో స్థానంలో నిలిచి ర్యాంకింగ్ రౌండ్‌కు అర్హత సాధించింది. ఎనిమిది మంది పాల్గొన్న ర్యాంకింగ్ రౌండ్‌లో సిఫ్ట్ కౌర్ 403.9 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. సిఫ్ట్ కౌర్‌కిది రెండో ప్రపంచకప్ పతకం. గత ఏడాది కొరియాలో జరిగిన ప్రపంచకప్‌లోనూ ఆమె కాంస్య పతకం సాధించింది. సొంతగడ్డపై జరిగిన ప్రపంచకప్‌లో ఓవరాల్‌గా భారత్ ఒక స్వర్ణం, ఒక రజతం, ఐదు కాంస్యాలతో కలిపి మొత్తం ఏడు పతకాలతో రెండో స్థానంలో నిలిచింది. చైనా ఎనిమిది స్వర్ణాలు, రెండు రజతాలు, రెండు కాంస్యాలతో కలిపి మొత్తం 12 పతకాలతో టాప్ ర్యాంక్‌ను దక్కించుకుంది.

హంపి, హారిక తొలి గేమ్ 'డ్రా'



న్యూఢిల్లీ: అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నీని భారత గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక 'డ్రా'తో ప్రారంభించారు. ఆదివారం జరిగిన తొలి రౌండ్ గేమ్‌లో వీరిద్దరు ముఖాముఖిగా తలపడ్డారు. తెల్లపావులతో ఆడిన హంపి 31 ఎత్తుల్లో గేమ్‌ను 'డ్రా'గా ముగించింది. భారత్‌కే చెందిన అంతర్జాతీయ మాస్టర్ (ఐఎం) వైశాలికి తొలి గేమ్‌లో 'వాకోవర్' లభించింది. ఆమెతో తొలి రౌండ్‌లో తలపడాల్సిన జర్మనీ గ్రాండ్‌మాస్టర్ ఎలిజబెత్ పాట్జ్ టోర్నీ నుంచి వైదొలిగింది. దాంతో తొలి గేమ్‌లో వైశాలిని విజేతగా ప్రకటించారు. టోర్నీ నిర్వాహకుల నిర్వహణ వైఫల్యాల కారణంగానే తాను టోర్నీ నుంచి తప్పుకుంటున్నానని ఎలిజబెత్ తెలిపింది. నిర్వాహకుల తీరుపై ఆగ్రహంతో కజకిస్తాన్ గ్రాండ్‌మాస్టర్ జాన్సయ అబ్దుమలిక్ కూడా ఈ టోర్నీ నుంచి వైదొలిగింది.

బోపన్న జోడీకి షాక్



ఫ్లోరిడా: గతవారం ఇండియన్ వెల్స్ మాస్టర్స్ సిరీస్ టైటిల్ నెగ్గిన రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ... మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టోర్నీలో మాత్రం నిరాశపరిచింది. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న–ఎబ్డెన్ ద్వయం 5–7, 6–4, 4–10తో 'సూపర్ టైబ్రేక్'లో కెవిన్ క్రావిట్జ్ (జర్మనీ)–ఫాబ్రిస్ మార్టిన్ (ఫ్రాన్స్) జంట చేతిలో ఓడిపోయింది. 84 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న–ఎబ్డెన్ 11 ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. కీలకమైన సూపర్ టైబ్రేక్‌లో మాత్రం బోపన్న, ఎబ్డెన్ తడబడి ఓటమి చవిచూశారు. తొలి రౌండ్‌లో ఓడిన బోపన్న–ఎబ్డెన్ జోడీకి 18,020 డాలర్ల (రూ. 14 లక్షల 83 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

దక్షిణాఫ్రికా రికార్డు ఛేదన

- రెండో టి20లో విండీస్ ఓటమి
- చార్లెస్, డికాక్ మెరుపు శతకాలు


డికాక్

సెంచూరియన్: అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక పరుగులను ఛేదించిన జట్టుగా దక్షిణాఫ్రికా కొత్త రికార్డు సృష్టించింది. ఆదివారం జరిగిన రెండో టి20లో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో వెస్టిండీస్‌పై విజయం సాధించింది. ముందుగా విండీస్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. జాన్సన్ చార్లెస్ (46 బంతుల్లో 118; 10 ఫోర్లు, 11 సిక్స్‌లు) మెరుపు వేగంతో 39 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. అనంతరం సఫారీ టీమ్ 18.5 ఓవర్లలో 4 వికెట్లకు 259 పరుగులు చేసి గెలిచింది. క్వింటన్ డి కాక్ (44 బంతుల్లో 100; 9 ఫోర్లు, 8 సిక్స్‌లు) దూకుడుగా ఆడి 43 బంతుల్లో శతకం బాదగా, హెన్‌డ్రిక్స్ (28 బంతుల్లో 68; 11 ఫోర్లు, 2 సిక్స్‌లు) అండగా నిలిచాడు. దాంతో మరో 7 బంతులు మిగిలి ఉండగానే దక్షిణాఫ్రికా రికార్డు విజయాన్ని అందుకుంది. అంతర్జాతీయ టి20ల్లో అత్యధిక ఛేదన రికార్డు ఆస్ట్రేలియా (245/5) జట్టు పేరిట ఉంది. 2018లో న్యూజిలాండ్ జట్టుతో (20 ఓవర్లలో 243/6)తో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఈ రికార్డు నమోదు చేసింది.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	398	57,527
నిఫ్టీ ▽	132	16,945

విదేశీ సూచీలు		
నాస్‌డాక్	11,824	△ 37
డోజోన్స్	32,238	△ 132
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,405	▽ 94
డాక్స్	14,957	▽ 253
షాంఘై	3,266	▽ 21
నికాయ్	27,385	▽ 34

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

రేట్ల పెంపు రూటు.. ఇంటికి దారెటు?

- గృహ రుణం ఫ్లోటింగ్ రేటుతో లాభ, నష్టాలు
- వడ్డీ రేట్లు పెరిగే తరుణంలో భారం
- రుణ కాల వ్యవధిని పెంచుకోవచ్చు
- లేదంటే ఈఎంఐ పెంపు
- ఫిక్స్‌డ్ రేటు 2 శాతం ఎక్కువ
- ముందస్తు సన్నద్ధత కావాల్సిందే..
- ఆదాయానికి తగ్గట్టు అదనపు చెల్లింపులు

సొంతింటి కలను రుణం సాకారం చేస్తుంది. రుణం తీసుకోకపోయినా సొంతిల్లు సమకూర్చుకోవచ్చు. కాకపోతే మధ్య తరగతి వాసులు రుణం జోలికి వెళ్లకుండా ఉండాలంటే.. దీర్ఘ కాలం పాటు క్రమశిక్షణతో పొదుపు, మదుపు చేసినప్పుడే ఇంటి కొనుగోలుకు కావాల్సినంత సమకూరుతుంది. అదే గృహ రుణం అయితే, కొన్నేళ్ల ముందుగానే ఇంటి కల నెరవేరుతుంది. పైగా రుణం తీసుకున్న తర్వాత ఎలా అయిన తీర్చాల్సిన బాధ్యత ఉంటుంది. కనుక దానికి కట్టుబడి ఉంటాం. కానీ, 20-30 ఏళ్ల పాటు ఇంటి కోసం పొదుపు చేసే క్రమంలో.. జీవితంలో వచ్చే ముఖ్యమైన అవసరాల కోసం గృహ రుణ నిధి విషయంలో రాజీపడే ప్రమాదం ఉంటుంది. కనుక గృహ రుణం వల్ల కొన్ని ప్రయోజనాలున్నాయి. కాకపోతే, గృహ రుణం విషయంలో సరైన ప్రణాళిక, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే సమస్యలు ఎదురైనప్పుడు ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆర్థిక సమస్యలూ, ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సి రావచ్చు. గృహ రుణం అంటే చాలా పెద్ద మొత్తంలోనే ఉంటుంది. కనుక దీనిపై వడ్డీ రేట్ల ప్రభావం కూడా ఎక్కువే. గత 10 నెలలుగా వడ్డీ రేట్లు అసాధారణంగా పెరిగాయి. రుణం తీసుకున్న వారు, తీసుకోబోయే వారు ఈ రిస్కులు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. పెద్ద మొత్తంలో గృహ రుణం తీసుకునే ముందు తప్పకుండా గమనించాల్సిన అంశాలేంటో ఈ కథనంలో చూద్దాం...

గృహ రుణంపై ఫ్లోటింగ్ రేటు చాలా తక్కువ రేటు ఆప్షన్లలో ఒకటి. అదే ఫిక్స్‌డ్ రేటు (స్థిరంగా ఉండే వడ్డీ రేటు, అదీ కొన్నేళ్ల పాటే) అయితే చాలా ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా ఫ్లోటింగ్ రేటు కంటే ఫిక్స్‌డ్ వడ్డీ రేటు 2 శాతం అధికంగా ఉంటుంది. గృహ రుణం తీసుకునే వారిలో ఎక్కువ మంది ఫ్లోటింగ్ రేటును ఎంపిక చేసుకోవడానికి ఈ వ్యత్యాసమే కారణం. కానీ, ఫ్లోటింగ్ రేటు అన్నది రెండు వైపులా పదునున్న కత్తి మాదిరే అనుకోవాలి. వడ్డీ రేట్లు తగ్గిపోయే క్రమంలో ఫ్లోటింగ్ రేటు వల్ల ఎంతో ఉపశమనం లభిస్తుంది. కానీ, అదే వడ్డీ రేట్లు పెరిగిపోయే తరుణంలో రుణ గ్రహీతలను మరింతగా బాధిస్తుంది. ఫ్లోటింగ్ రేటుపై గృహ రుణాలు తీసుకుంటే, అవి రెపో రేటుకు అనుసంధానమై ఉంటాయి. అందుకని ఫ్లోటింగ్ రేటుపై గృహ రుణం తీసుకునే వారు, వడ్డీ రేట్లు పెరిగే సమయంలో అదనంగా చెల్లించేందుకు ముందుగానే సన్నద్ధం కావాల్సి ఉంటుంది.





రేట్లు ఇంకా పెరగొచ్చు

సవాళ్లు, ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు సాధారణంగా అవి తొందరగా ముగిసిపోవాలని కోరుకుంటారు. కానీ, వడ్డీ రేట్లు పెరిగే క్రమంలో ఇలాంటి కోరికలు నెరవేరవు. ఆర్‌బీఐ గతేడాది మే నుంచి రెపో రేటును 2.5 శాతం పెంచింది. రెపో రేటు ప్రస్తుతం 6.5 శాతంగా ఉంది. చాలా మంది నిపుణులు రెపో రేటు 6.5 శాతానికి చేరిన వెంటనే వడ్డీ రేట్ల పెంపు ముగుస్తుందని లోగడ అంచనా వేశారు. కానీ, పరిస్థితులు తర్వాత మారిపోయాయి. అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణం సమస్యాత్మకంగా తయారైంది. అందుకే అన్ని కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్ల పెంపు విధానాన్ని అనుసరిస్తున్నాయి. దీంతో రుణ గ్రహీతలు మరో విడత లేదంటే, మరిన్నిసార్లు రెపో రేటు పెంపును చూడాల్సి రావచ్చని నిపుణులు అంటున్నారు.

చాలా సైకిల్స్

వడ్డీ రేట్లన్నవి ఆర్థిక చక్ర భ్రమణాల మాదిరే ఉంటాయి. పెరుగుతూ, తగ్గుతూ ఉంటాయి. మరి గృహ రుణం అంటే ఎంత లేదన్నా 20 ఏళ్లు, అంతకంటే ఎక్కువ కాలానికి తీసుకుంటూ ఉంటారు. దీంతో వడ్డీ రేట్ల సైకిల్స్ ఎన్నో వచ్చి పోతుంటాయి. దీనిపై రుణం తీసుకునే వారు ముందుగానే అవగాహన కలిగి ఉండాలి. గృహ రుణం ఈఎంఐ అనేది ఆర్జించే వేతనంలో 40 శాతం మించకుండా చూసుకుంటే, ఇలాంటి ఆర్థిక అనిశ్చితులు, వడ్డీ రేట్ల పెరుగుదలను ధైర్యంగా ఎదుర్కోవచ్చు.

సరైన సమయం కోసం వేచి చూడొద్దు

ఏదీ శాశ్వతం కాదు. కనిష్ఠ వడ్డీ రేట్లు అయినా, గరిష్ఠ వడ్డీ రేట్లు అయినా ఒక నిర్ణీత కాలం పాటే కొనసాగుతాయి. ఉదాహరణకు 20 ఏళ్ల గృహ రుణ కాలవ్యవధిలో ఒకటి నుంచి రెండు సైకిల్స్ అధిక వడ్డీ రేట్లు ఉండొచ్చు. కనుక కనిష్ఠ వడ్డీ రేట్లు ఉన్నప్పుడే గృహ రుణం తీసుకుందామని అనుకోవద్దు. దీనివల్ల విలువైన కాలం గడిచిపోతుంది. ఇంటి కొనుగోలు ధర కూడా పెరగొచ్చు. కనుక తక్కువ వడ్డీ రేట్ల కోసం చూస్తే, అందులో మిగిలేది, పెరిగే ఇంటి ధరతో పోలిస్తే తక్కువే ఉండొచ్చు. అవసరం, తక్కువ ధరలే ఇంటి కొనుగోలుకు ఆధారం కావాలి కానీ, వడ్డీ రేట్లు కాదని నిపుణుల సూచన.

రేట్ల పెంపునకు సన్నద్ధం

ఇంటిని కొనుగోలు చేసే సమయంలో కొందరు తమ అభిరుచులకు అనుగుణంగా సదుపాయాలు ఉండాలని కోరుకుంటారు. ఇందుకోసం అదనపు ఖర్చుకూ వెనుకాడరు. ఇంటి బడ్జెట్ పెంచుకోవడం అన్నది అదనపు భారానికి దారితీస్తుంది. తీసుకునే గృహ రుణం పెరుగుతుంది. దీంతో వడ్డీ రేట్లు పెరిగే క్రమంలో మరింత చెల్లించాల్సి రావచ్చు. కనుక అధిక మొత్తానికి గృహ రుణం తీసుకోవడం అన్నది పెద్ద సవాలు అవుతుందని ఆంద్రోమెడా లోన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ వి. స్వామినాథన్ పేర్కొన్నారు. కనుక అవసరమైతే, వడ్డీ రేట్లు ఊహించని విధంగా పెరిగిపోతే, నెలవారీ ఈఎంఐ 20-25 శాతం అధికంగా చెల్లించేందుకు వీలుగా, నెలవారి ఆదాయంలో వెసులుబాటు ఉండేలా చూసుకోవాలి. ఉదాహరణకు నెలవారీ గరిష్ఠంగా రూ.40,000ను ఈఎంఐ కింద చెల్లించే సామర్థ్యం ఉంటే, అప్పుడు రూ.30,000–32,000 ఈఎంఐకి పరిమితమై గృహ రుణం తీసుకోవాలి. దీంతో వడ్డీ రేట్లు పెరిగినా, ఇబ్బంది లేకుండా అదనపు మొత్తాన్ని చెల్లించేందుకు అవకాశం ఉంటుంది.

కాలవ్యవధి పెంపు

వడ్డీ రేట్లు పెరిగిన ప్రతీ సందర్భంలోనూ రుణమిచ్చిన సంస్థలు రుణ గ్రహీతల ఈఎంఐ పెంపు కంటే, కాల వ్యవధిని పెంచేందుకు మొగ్గు చూపిస్తుంటాయి. అయితే, దీనికీ పరిమితి ఉంది. రుణ గ్రహీతలు పదవీ విరమణకు ఇంకా ఎన్నేళ్లు ఉందన్న అంశాన్ని బ్యాంకులు చూస్తాయి. సాధారణంగా గృహ రుణ కాలాన్ని బ్యాంకులు రుణ గ్రహీతల వయసు, ఆర్జన ఆధారంగా నిర్ణయిస్తుంటాయి. అదే పనిగా వడ్డీ రేట్లు పెరుగుతున్న క్రమంలో.. బ్యాంకులు రేటు పెరిగినప్పుడల్లా ఆ మేరకు కాలవ్యవధిని పెంచుకుంటూ పోతే, తిరిగి చెల్లింపుల కాలం రిటైర్మెంట్ వయసుకు త్వరగా చేరిపోవచ్చు. ఇక ఆ తర్వాత కాలవ్యవధి పెంచుకోవడానికి ఉండదు. దీనికి బదులు ఈఎంఐ మొత్తాన్ని పెంచుతుంటాయి బ్యాంకులు. దీంతో అదనపు భారం పడుతుంది.

•••

రుణ కాల వ్యవధి పెంచుకోవడం వల్ల అంతిమంగా చెల్లించే వడ్డీ కూడా ఎక్కువగానే ఉంటుంది. కనుక రుణదాత కాల వ్యవధి పెంచేందుకు ఆసక్తి చూపించినా.. రుణ గ్రహీతలు దీనికి మొగ్గు చూపకపోవడమే మంచిది. కాల వ్యవధి పెంచుకోవద్దంటే, పెరిగిన వడ్డీ రేట్ల మేర అదనపు ఈఎంఐ చెల్లించేందుకు సిద్ధం కావాలి. నెలవారీ చెల్లించే ఈఎంఐని పెంచడం వల్ల గృహ రుణాన్ని త్వరగా తీర్చేయవచ్చు. అందుకే గృహ రుణ గ్రహీతలకు నెలవారీ మిగులు ఉండాలి. దీనివల్ల వడ్డీ రేట్లు పెరిగినప్పుడు అదనంగా చెల్లించే సామర్థ్యం ఉంటుంది. దీంతో కాల వ్యవధి పెంచుకోవడం కంటే ఈఎంఐ పెంపునకే మొగ్గు చూపుతారు. ఫలితంగా అదనపు వడ్డీ భారం పడదు.

ముందస్తు చెల్లింపులు

వడ్డీ రేట్లు ఎప్పుడు పెరుగుతాయో ఎవరూ చెప్పలేరు. అందుకనే గృహ రుణం తీసుకున్న తర్వాత వీలు చిక్కినప్పుడల్లా పాక్షిక చెల్లింపులకు మొగ్గు చూపించడం మెరుగైన ఆప్షన్ అవుతుంది. దీనివల్ల గృహ రుణం బకాయిని వేగంగా తగ్గించుకోవచ్చు. నిర్ణీత కాలం కంటే ముందుగానే తీర్చివేయవచ్చు. ఒకవేళ వడ్డీ రేట్లు పెరిగినా పెద్ద భారం పడకుండా ఉంటుంది. ఉద్యోగులు అయితే బోనస్ రూపంలో వచ్చిన మొత్తాన్ని గృహ రుణానికి చెల్లింపులు చేసుకోవచ్చు. అదే మాదిరి, ఏటా వేతనం పెరుగుతూ ఉంటుంది. పెరిగే వేతనంలో సగ భాగాన్ని గృహ రుణ ఈఎంఐ పెంచి కట్టుకోవడానికి ఉపయోగించుకోవాలి.

క్రెడిట్ స్కోరు అనుకూలత

వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయిలో ఉన్నాయి. అప్పుడు ఫ్లోటింగ్ రేటును ఎంచుకోవడమే మార్గం. అప్పటికే తీసుకున్న గృహ రుణానికి సంబంధించి వడ్డీ భారాన్ని భరించలేకపోతుంటే.. దాన్ని తక్కువ రేటుకు ఆఫర్ చేసే బ్యాంకుకు లేదా ఇతర సంస్థకు బదిలీ చేసుకోవడం ఒక మార్గం. సేవలు బాగుండి, తక్కువ రేటుకు ఆఫర్ చేసే సంస్థకు నిశ్చింతంగా మారిపోవచ్చు. గృహ రుణ బ్యాలన్స్‌ను బదిలీ చేసుకునే ముందు, కొత్తగా రుణం ఇచ్చే బ్యాంకులో ప్రాసెసింగ్ చార్జీలు, ఇతర చార్జీలను కూడా చూడాలి. క్రెడిట్ స్కోరు మెరుగ్గా ఉంటే కాస్త డిమాండ్ చేసి రేటును తగ్గించుకోవచ్చు. బ్యాలన్స్ బదిలీ విషయంలోనూ మెరుగైన క్రెడిట్ స్కోరు ఉపయోపడుతుంది.

మరో పావు శాతం రెపో పెంపు ఖాయం!



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వచ్చే నెల 3,5,6వ తేదీల్లో జరపనున్న ఆర్థిక సంవత్సరం తొలి ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపో రేటును మరో పావుశాతం పెంచడం ఖాయమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇదే జరిగితే బ్యాంకులకు ఆర్‌బీఐ తానిచ్చే రుణాలపై వసూలు చేసే వడ్డీ రేటు 6.75 శాతానికి పెరగనుంది. పాలసీ సమీక్ష నిర్ణయాలు 6వ తేదీన వెలువడనున్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు, మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో అరశాతం చొప్పున పెరుగుతూ, 5.9 శాతానికి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు పెంపు 0.35 శాతం ఎగసి 6.25 శాతాన్ని తాకింది. ఫిబ్రవరి మొదట్లో జరిగిన ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధానంలో వరుసగా ఆరవసారి (పావు శాతం) రేటు పెంపుతో మే నుంచి 2.5 శాతం రెపో రేటు పెరిగింది. ఈ రేటు 6.5 శాతానికి ఎగసింది.

జాగరూకత అవసరం:

బ్యాంకింగ్‌కు నిర్మలా సీతారామన్ సూచన

కాగా, వడ్డీరేట్ల పెరుగుదల, దీనికి సంబంధించిన ఎదురయ్యే సవాళ్ల వంటి విషయాల్లో అప్రమత్తత అవసరమని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకింగ్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల చీఫ్‌లతో ఆమె ఒక అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించారు. బ్యాంకింగ్ పనితీరు, పటిష్టతపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించడం జరిగింది.

బిర్లాసాఫ్ట్ లిమిటెడ్ | రెలిగేర్ బ్రోకింగ్ | కొనొచ్చు

స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 265 టార్గెట్: రూ. 341

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) మూడో త్రైమాసికంలో వార్షికంగా ఆదాయం 3.5 శాతం బలపడింది. వెరసి అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో డాలర్ల రూపేణా 14.84 కోట్ల డాలర్లకు చేరింది. అయితే రూ.లలో ఆదాయం 1,220 కోట్లను తాకడంతో 14 శాతం వృద్ధి నమోదైంది. ప్రధానంగా టెక్నాలజీ ట్రాన్స్‌ఫార్మేషన్, క్లౌడ్ సర్వీసుల బిజినెస్‌లు వృద్ధికి దోహదం చేశాయి. దీంతో ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్ల బిజినెస్ నెమ్మదించినప్పటికీ ఆదాయంలో పురోగతిని సాధించింది. కాగా.. స్థూల ఆర్థిక సవాళ్లు, క్లయింట్లలో ఒక సంస్థ దివాలా ప్రకటించడం వంటి అంశాలు సమీప కాలంలో పనితీరును దెబ్బతీయవచ్చని యాజమాన్యం తాజాగా అంచనా వేసింది. అయినప్పటికీ టెక్నాలజీ బిజినెస్, క్లౌడ్ సర్వీసుల విభాగాలలో డీల్ పైప్‌లైన్(ఆర్డర్లు పొందే అవకాశాలు) భవిష్యత్‌లో మెరుగైన పనితీరుకు సహకరించే అవకాశముంది. అంతేకాకుండా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులు, బీమా(బీఎఫ్‌ఎస్‌ఐ) విభాగంలో యాక్టివిటీ, తయారీ సంబంధ విభాగానికి కనిపిస్తున్న డిమాండు వీటికి జత కలవనున్నాయి. యూరప్, అమెరికా ప్రాంతాల నుంచి పెరుగుతున్న డీల్స్(ఒప్పందాలు) సైతం ఆదాయ వృద్ధికి దోహదం చేయనుంది. నిర్వహణా వ్యయాలపై యాజమాన్య ప్రత్యేక దృష్టి కారణంగా లాభదాయకత మెరుగుపడే వీలుంది. క్యూ3లో కంపెనీ చేపట్టిన ప్రొవిజన్లు, సమీప కాలంలో ఎదురుకానున్న సవాళ్లను మినహాయిస్తే దీర్ఘకాలంలో కంపెనీ పటిష్ట ఫలితాలను ప్రకటించవచ్చని అంచనా.



బికాజీ ఫుడ్స్ ఇంటర్నేషనల్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 352 టార్గెట్: రూ. 440

ఎందుకంటే: దేశీయంగా అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సంప్రదాయ స్వల్పాహార(స్నాక్స్) విభాగంలో బికాజీ ఫుడ్స్ ఇంటర్నేషనల్‌కు పట్టుంది. వివిధ ఉత్పత్తులతో 9 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. తద్వారా ఈ విభాగంలోని దిగ్గజాలలో మూడో పెద్ద కంపెనీగా నిలుస్తోంది. దేశీ స్నాక్స్ మార్కెట్ విలువ రూ. 18,100 కోట్లుకాగా.. నాలుగేళ్ల కాలంలో(2022–26 మధ్య) వార్షికంగా 15.6 శాతం చొప్పున పురోగతి సాధించవచ్చని అంచనా. ప్యాకేజ్‌డ్ స్నాక్స్ పరిశ్రమలో బ్రాండ్ ఈక్విటీ, విభిన్న ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియో, సప్లై చైన్ సామర్థ్యాలు వంటి అంశాలు కంపెనీల పురోగతికి కీలకంగా నిలుస్తాయి. సంఘటిత రంగంలో ప్రధాన కంపెనీలుగా ఎదిగేందుకు ఇలాంటి సామర్థ్యాలు దోహదం చేస్తాయి. కంపెనీ నాయకత్వ స్థాయి, అత్యధిక ప్రొడక్టులు, ఫ్యామిలీ ప్యాక్‌లపై ప్రత్యేక దృష్టి వంటి అంశాలు పోటీ కంపెనీలతో పోలిస్తే బికాజీని ప్రత్యేకంగా నిలుపుతున్నాయి. వెరసి కుటుంబ వినియోగంలో కీలక బ్రాండుగా బికాజీ పేరొందింది. గత రెండేళ్లుగా కంపెనీ తయారీ సామర్థ్యాలను పెంచుకునే బాటలో కొత్త యూనిట్లను ఏర్పాటు చేస్తూ వస్తోంది. తద్వారా కీలక మార్కెట్లకు ప్రత్యక్షంగా చేరే వీలు కలుగుతోంది. అంతేకాకుండా ప్రత్యేక మార్కెట్లలో మరింత విస్తరించే అవకాశముంది. పంపిణీ పటిష్టతతో 2017–22 మధ్య కీలక మార్కెట్లలో 19 శాతం, ప్రత్యేక మార్కెట్లలో 41 శాతం చొప్పున అమ్మకాలలో వార్షిక వృద్ధిని సాధించింది. ముడివ్యయాలు తగ్గడం, వినిమయం పుంజుకోవడం, పెట్టుబడులు కంపెనీకి బలాన్నివ్వనున్నాయని నిపుణులు పేర్కొంటున్నారు.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ప్రీమియం కస్టమర్లకు హెచ్‌డీఎఫ్‌సీ గోల్డెన్ కార్డ్



న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రెగాలియా గోల్డ్ క్రెడిట్ కార్డ్ పేరుతో ఓ సూపర్ ప్రీమియం క్రెడిట్ కార్డ్‌ను విడుదల చేసింది. ప్రయాణ, లైఫ్‌స్టయిల్ ప్రయోజనాలు ఈ కార్డుతో పొందొచ్చని బ్యాంక్ ప్రకటించింది. ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్‌ను ఉచితంగా అందిస్తోంది. ప్రీమియం మైల్ స్టోన్ ప్రయోజనాలు కూడా కార్డులో భాగం. ఇది అందరికీ కాకుండా అధిక ఆదాయం ఉన్న వారికే బ్యాంక్ జారీ చేయనుంది. అంతర్జాతీయ ప్రయాణాలు, హోటళ్ల బుకింగ్‌లు, లైఫ్ స్టయిల్ కోసం ఖర్చు, కొనుగోళ్ల కోసం ప్రత్యేకంగా ఈ కార్డును తీసుకొచ్చింది. రిలయన్స్ డిజిటల్, మింత్రా, నైకాలో కొనుగోళ్లపై 5 రెట్ల రివార్డులు వస్తాయి. ప్రతి రూ.150 రిటైల్ వ్యయంపై 4 రివార్డు పాయింట్లు లభిస్తాయి. వార్షిక వ్యయం లక్ష్యాలను చేరుకున్న కస్టమర్లకు రెండు ఫ్లయిట్ టికెట్ వోచర్లు అందిస్తుంది.

ఫండ్స్‌కు నామినేషన్ ఇచ్చారా..?



మార్చి 31తో గడువు పూర్తి

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్టర్లు నామినేషన్ సమర్పించేందుకు ఇచ్చిన గడువు మార్చి 31తో ముగియనుంది. ఎవరినైనా నామినీగా నమోదు చేయడం లేదంటే, నామినేషన్ ఆప్ట్ అవుట్ ఈ రెండింటిలో ఏదో ఒకటి చేయడం తప్పనిసరి. ఈ రెండింటిలో ఏదో ఒకటి ఇన్వెస్టర్ ఎంపిక చేసుకోకపోతే గడువు ముగిసిన తర్వాత వారి మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులన్నీ స్తంభనకు గురవుతాయి. దాంతో పెట్టుబడులను ఉపసంహరించుకోవడానికి అనుమతి ఉండదు. ఫండ్స్ పెట్టుబడులు, డీమ్యాట్ ఖాతాలకు నామినేషన్ లేదా నామినేషన్ వద్దంటూ డిక్లరేషన్ ఇవ్వడాన్ని తప్పనిసరి చేస్తూ సెబీ 2022 జూన్ 15న ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత జూలై ఆఖరి వరకు గడువు ఇవ్వగా.. అక్టోబర్ వరకు పొడిగించారు. అప్పటికే పెట్టుబడులు కలిగిన వాటికి నామినేషన్ సమర్పించేందుకు 2023 మార్చి 31 వవరకు గడువు ఇచ్చింది. నామినేషన్ లేకుండా పెట్టుబడిదారు మరణించినట్టయితే.. వాటిని క్లెయిమ్ చేసుకోవడానికి వారసులు లేదా కుటుంబ సభ్యులు క్లిష్టమైన ప్రక్రియను పూర్తి చేయాల్సి వస్తుంది. ఆ ఇబ్బంది లేకుండా నామినేషన్‌ను సెబీ తీసుకొచ్చింది.

యాక్సిస్ కొత్త ఈటీఎఫ్ ఫండ్...

ఏప్రిల్ 5న ముగింపు

ముంబై: దేశీయంగా ఏడో పెద్ద ఫండ్ హౌస్ యాక్సిస్ ఎంఎఫ్ కొత్త ఫండ్ ఆఫర్(ఎన్‌ఎఫ్‌వో)కు తెరతీస్తోంది. ఈ నెల 22న ఫండ్ ప్రారంభమైన ఫండ్, ఏప్రిల్ 5న ముగియనుంది. ఈ ఎన్‌ఎఫ్‌వో(ఓపెన్ ఎండెడ్ ఎస్అండ్‌పీ 500 ఈటీఎఫ్ ఫండ్ ఆఫ్ ఫండ్స్) ద్వారా కనీసం రూ. 50 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈ నిధులను ఎస్అండ్‌పీ 500 ఇండెక్స్‌ను ప్రతిబింబించే ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్(ఈటీఎఫ్‌లు)లో ఇన్వెస్ట్ చేయనుంది. ఫండ్‌ను వినాయక్ జయంత్ నిర్వహించనున్నారు. అలాట్‌మెంట్ తేదీ నుంచి 30 రోజుల్లోగా రిడీమ్ లేదా స్విచ్‌డ్ ఔట్ అయితే 0.25 శాతం ఎగ్జిట్ లోడ్ విధిస్తారు. అలాట్‌మెంట్ అయ్యాక 30 రోజుల్లోగా రిడీమ్ లేదా స్విచ్‌డ్ ఔట్ అయితే ఎలాంటి ఎగ్జిట్ లోడ్ అమలుకాదని ఫండ్ హౌస్ చీఫ్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాఘవ్ అయ్యంగర్ పేర్కొన్నారు. వివిధ రకాల ఆస్తులలో పెట్టుబడులు చేపట్టే ఇతర రెగ్యులర్ మ్యూచువల్ ఫండ్స్ మాదిరికాకుండా ఈ ఫండ్ సొంత పథకాలు లేదా ఇతర ఫండ్ హౌస్ పథకాలలో ఇన్వెస్ట్ చేయనుంది. ఆఫ్‌షోర్ మ్యూచువల్ ఫండ్స్‌లో అయితే యూనిట్లలో ఇన్వెస్ట్ చేస్తుంది.


ఏ ఆసుపత్రిలో అయినా నగదు రహిత వైద్యం

ఐసీఐసీఐ లాంబార్డ్ ఆఫర్

ముంబై: ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ తన హెల్త్ పాలసీదారులకు మంచి ఆఫర్‌ను ప్రకటించింది. పాలసీదారులు నగదు రహిత వైద్యాన్ని ఏ ఆస్పత్రి నుంచి అయినా పొందొచ్చని.. నాన్ ఎంప్యానెల్డ్ హాస్పిటల్స్‌లోనూ ఈ సేవలు వినియోగించుకోవచ్చని సూచించింది. పరిశ్రమలో ఈ తరహా ఆఫర్ మొదటిదిగా పేర్కొంది. వైద్యం కోసం కస్టమర్లు తమ పాకెట్ నుంచి చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. 'ఐఎల్ టేక్ కేర్' యాప్ నుంచి ఈ నూతన సదుపాయాన్ని పొందొచ్చని ప్రకటించింది. నగదు రహిత వైద్యాన్ని హాస్పిటళ్లు అందించడంపై ఆధారపడి ఉంటుందని, ఆస్పత్రిలో చేరడానికి 24 గంటల ముందే పాలసీదారులు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. తాము సూచించిన హాస్పిటల్ లేదంటే సమీపంలోని హాస్పిటల్‌కు వెళ్లొచ్చని సూచించింది.

పీఎఫ్‌ను ముందస్తుగా వెనక్కి తీసుకోవచ్చా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్


నేను ఒక కంపెనీలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నాను. నా సోదరి వివాహం కోసం నా పీఎఫ్ ఫండ్‌ను వాడుకోవాలని అనుకుంటున్నాను. నా సందేహం ఏమిటంటే.. నేను కరోనా లాక్‌డౌన్‌ల సమయంలో ఒకసారి పాక్షికంగా ఉపసంహరించుకున్నాను. కనుక మరోసారి పీఎఫ్ ఉపసంహరణకు దరఖాస్తు చేసుకోవచ్చా? పన్ను పడుతుందా?
– వేణు ఉదత్

ప్రావిడెంట్ ఫండ్ నుంచి రెండు సార్లు ఉపసంహరించుకోవచ్చు. పన్నుల అంశానికంటే ముందు తెలుసుకోవాల్సిన ఇతర అంశాలు కూడా ఉన్నాయి. పలు సందర్భాల్లో పీఎఫ్ నుంచి ఉపసంహరణకు అనుమతి ఉంటుంది. ఇల్లు లేదా ఫ్లాట్ కొనుగోలు లేదా నిర్మాణం, రుణాల చెల్లింపు, కొన్ని వ్యాధులకు సంబంధించి చికిత్సా వ్యయాల చెల్లింపులకు, వివాహం లేదా పిల్లల ఉన్నత విద్య, రిటైర్మెంట్‌కు ఏడాది ముందు సందర్భాల్లో ఉపసంహరించుకోవచ్చు. ఈ ప్రత్యేక సందర్భాలకు సంబంధించి ఈపీఎఫ్‌వో సభ్యుడు నిర్ణీత సర్వీసు కాలాన్ని పూర్తి చేసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు సభ్యుడు/సభ్యురాలి వివాహం కోసం లేదంటే కుమార్తె, కుమారుడు, సోదరుడు లేదా సోదరి వివాహం కోసం ఉపసంహరించుకోవాలంటే కనీసం ఏడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకోవాలి. ఉద్యోగి వాటా కింద జమ అయి, దానికి వడ్డీ చేరగా సమకూరిన మొత్తం నుంచి 50 శాతాన్ని వెనక్కి తీసుకోవచ్చు. ఈ అవసరాల కోసం మూడు సార్లు ఉపసంహరణకు అనుమతిస్తారు. మీరు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నారు. కనుక మీరు చేసే ఉపసంహరణలపై పన్ను ఉండదు. మీ సోదరి వివాహం కోసం ఉపసంహరించుకోవాలని అనుకుంటున్నారు. కనుక కనీసం ఏడేళ్ల సర్వీసు ఉండాలి. మీకు ఐదేళ్ల సర్వీసు మాత్రమే ఉంది. ఏడేళ్లు పూర్తి కాకుండా దరఖాస్తు చేసుకుంటే తిరస్కరణకు గురవుతుంది. గతంలో మీరు కోవిడ్ సమయంలో చేసిన ఉపసంహరణ ప్రభావం తాజా ఉపసంహరణలపై ఉండదు.

ఈఎల్ఎస్ఎస్ ఫండ్‌ను ఒక సంస్థ నుంచి ఇంకో సంస్థకు మార్చుకోవచ్చా..?
– రాజేష్ షా

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) ఫండ్స్ మూడేళ్ల తప్పనిసరి లాకిన్ పీరియడ్‌తో వస్తాయి. పెట్టుబడి పెట్టిన తేదీ నుంచి ఈ లాకిన్ పీరియడ్ అమల్లోకి వస్తుంది. ఒక సంస్థ నుంచి ఈఎల్ఎస్ఎస్ పెట్టుబడిని మరోసంస్థకు చెందిన ఈఎల్ఎస్ఎస్ ఫండ్‌లోకి మార్చుకోవాలంటే ముందుగా ఉపసంహరించుకోవాలి. మూడేళ్ల లాకిన్ పీరియడ్ వరకు ఉపసంహరించుకోలేరు. మూడేళ్లు నిండిన తర్వాత అప్పుడు మీ పెట్టుబడులు అన్నింటినీ వెనక్కి తీసుకోవచ్చు. మీకు నచ్చిన పథకంలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈఎల్ఎస్ఎస్ కానీ, మరే ఇతర పన్ను ఆదా పథకాలు అయినా తప్పనిసరి లాకిన్ పీరియడ్‌తో వస్తుంటాయి. కనుక లాకిన్ సమయంలో ఉపసంహరణలను అనుమతించరు.

ఇసాఫ్ బ్యాంక్ కస్టమర్లకు జియోజిత్ ట్రేడింగ్ ఖాతా



కోచి: జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ ఇసాఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా ఈసాఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కస్టమర్లకు 3 ఇన్ 1 డీమ్యాట్ బండిల్డ్ అకౌంట్‌ను ఆఫర్ చేస్తున్నట్టు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రకటించింది. దీని కింద ఈసాఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సేవింగ్స్ ఖాతాదారులు జియోజిత్ డీమ్యాట్, ట్రేడింగ్ అకౌంట్‌ను ఉచితంగా ప్రారంభించుకోవచ్చు. ఆన్‌లైన్‌లో కేవలం 15 నిమిషాల్లో ఖాతా తెరవొచ్చని జియోజిత్ ఫైనాన్షియల్ తెలిపింది. 3 ఇన్ 1 ఖాతా కింద.. డీమ్యాట్ ఖాతా తెరిచేందుకు ఎలాంటి చార్జీలు ఉండవని, సౌకర్యమైన బ్రోకరేజీ ప్లాన్లు పొందొచ్చని ప్రకటించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-3-2023	
విశాఖ	450-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్ ధర (డజను)	66.00
26-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	410-00
వరంగల్	412-00
రిటైల్ ధర	4.70



యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఎ.అభిషేక్ రెడ్డి తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని, ముఖ మండపంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.

- యాదగిరిగుట్ట

పందులు కాస్తున్నారని | గుడిలోకి అనుమతి నిరాకరణ?

ఆత్మహత్యకు యత్నించిన ఆలయ స్థలదాత

ఇల్లెందు: గుడి నిర్మాణానికి స్థలం ఇచ్చిన తమను ఆలయంలోకి అనుమతించడం లేదని ఆరోపిస్తూ ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందుకు చెందిన చోటాలాల్ పాసీ కొన్నేళ్ల కిందట సాయిబాబా ఆలయ నిర్మాణానికి స్థలం ఇచ్చాడు. అయితే, ఆయన కుమారుడు మోహన్‌లాల్ పాసీని కొంత కాలంగా గుడిలోకి కమిటీ సభ్యులు రానివ్వడం లేదని చెబుతున్నారు. పందులు కాస్తూ జీవిస్తున్నారనే అభియోగంతో అడ్డుకోవడమే కాక గుడి సమీప స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారని ఆరోపిస్తూ మోహన్ ఆదివారం పురుగుల మందు తాగాడు. కాగా, ఆలయంలోకి రానివ్వని అంశంపై పోలీసులు, కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఈవిషయమై ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ను వివరణ కోరగా.. మోహన్‌లాల్ ఆరోపణలు అవాస్తవమని, ఏనాడు కూడా ఏమీ అనలేదన్నారు.

నేడు రాష్ట్రానికి వర్ష సూచన

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ సూచించింది. ప్రస్తుతం విదర్భ నుంచి మరత్వాడా, ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక మీదుగా ఇంటీరియర్ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీంతో సోమవారం ఉత్తరాది జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. కాగా, ఆదివారం నిజామాబాద్‌లో 37.5 డిగ్రీల సెల్సియస్‌ల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.